www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 29-6-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 91 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం; తిథి: చవితి ఉ.9.15 తదుపరి పంచమి; నక్షత్రం: ఆశ్లేష ఉ.6.34 తదుపరి మఖ; వర్జ్యం: రా.6.57-8.36; దుర్ముహూర్తం: సా.5.05-5.57; అమృతఘడియలు: తె.4.52-6.31; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మార్చే యత్నం.. మారిన రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో మార్పు కనిపిస్తోంది. మంత్రులతో నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. పార్టీ సమావేశాల్లో కూడా తన మనసులోని మాటను సూటిగా చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షలు మొదలెట్టారు. అదే సమయంలో మంత్రులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఎక్కడికక్కడ మంత్రులపైనే ఉంటుందని స్పష్టంచేస్తున్నారు. విధానపరమైన ప్రకటనలను మంత్రులు తమంతట తాము చేయకుండా పీసీసీ అధ్యక్షుడి ద్వారా కట్టడి చేయించారు. ముఖ్యమంత్రి అనుమతి లేకుండా మంత్రులు విధానపరమైన ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. అదే సమయంలో పార్టీ అధిష్ఠానం ఆలోచనలతో సంబంధం లేకుండా తన మానాన తాను పనిచేసుకుపోవాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్టుగా కనిపిస్తోంది. పార్టీపైన, ప్రభుత్వంపైన పట్టు పెంచుకుంటే తన నాయకత్వానికి ఢోకా ఉండదన్న అభిప్రాయానికి రేవంత్ వచ్చారని చెబుతున్నారు. తదుపరి దశలో మంత్రులను కట్టడి చేయడంపై ముఖ్యమంత్రి దృష్టిపెడతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ముఖ్యమంత్రిలో ఈ తెగింపు రావడానికి కారణం ఏమిటి? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకోవాలని ఎందుకు నిర్ణయించుకున్నారు? అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. ఆయనలో ఈ మార్పు రావడానికి సహచర మంత్రులతో పాటు సొంత పార్టీ నాయకులు, పార్టీ అధిష్ఠానం కూడా కారణమని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రిగా ఆయనకు తగినంత స్వేచ్ఛ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇబ్బందులపాల్జేసింది. దీంతో సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్ఠానానికి మధ్య అంతరం ఏర్పడిందన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్న ప్రచారం జరిగింది.


కొత్త పలుకు

అదే సమయంలో కొంత మంది మంత్రులు, నాయకులు పార్టీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చడం అవసరమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అభిప్రాయపడేలా చేశారు. ఆయన నాయకత్వంలో స్థానిక ఎన్నికలకు వెళ్లలేమని ఫిర్యాదు చేశారు. ఎన్నికల నాటితో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలహీనపడిందని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అలవాటు ప్రకారం అసంతృప్తులనే ప్రోత్సహించింది.

ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగి అత్యంత గోప్యంగా అభిప్రాయ సేకరణకు పూనుకున్నారు. ఎంపిక చేసిన కొంత మందికి, ముఖ్యంగా ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరిన వారికి ఫోన్లు చేసి సీఎంని మారిస్తే ఎలా ఉంటుందంటూ ఆరా తీశారు. అయితే ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి షాకింగ్ విషయాలు తెలిసొచ్చాయి. రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలన్న పిచ్చి ఆలోచన చేయొద్దు.. అలా చేస్తే ప్రభుత్వం నెలలోనే పతనమవుతుందని ఓ సీనియర్ ఎమ్మెల్యే కుండబద్దలు కొట్టారు.

4

నాయకత్వంలో లోపాలు గుర్తిస్తే వాటిని సరిదిద్దుకోవడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి గానీ ఏకంగా నాయకత్వాన్నే మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని క్షేత్ర స్థాయి నుంచి కూడా పార్టీ అధిష్ఠానానికి అభిప్రాయాలు అందాయి. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చాలన్న అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం స్వస్తి చెప్పింది.

రాష్ట్రాలలో బలమైన నాయకులు ఉన్నప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండేది. జాతీయ స్థాయిలో పార్టీ బలపడాలంటే రాష్ట్రాలలో పటిష్ఠమైన నాయకత్వాలను అభివృద్ధి చేసుకోవాలన్న ప్రాథమిక సూత్రాలను విస్మరిస్తున్నారు.

కేసీఆర్ హయాంలో విచ్చలవిడిగా వందల వేల సంఖ్యలో ప్రత్యర్థుల ఫోన్లను దొంగచాటుగా, అక్రమంగా విన్నప్పటికీ కేసీఆర్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయారు. ఇక నాకు సంబంధించినంత వరకు రెండు సంవత్సరాల కాల్ డేటా తెప్పించుకున్నారు. ఇది అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు విరుద్ధం. మావోయిస్టులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారి జాబితాలో నా ఫోన్ నంబర్ చేర్చారు. 2018 ఎన్నికలకు ముందు సెప్టెంబరు మాసంలో నా ఫోన్ సంభాషణలను నేరుగా విన్నారు. నా ఫోన్ మాత్రమే కాదు, మరికొందరు మీడియా యజమానుల ఫోన్లనూ ట్యాప్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులకు న్యాయం జరగాలన్నా, నిందితులకు శిక్ష పడాలన్నా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలి. ఈ అరాచకానికి కర్త, కర్మ, క్రియ నాటి సీఎం కేసీఆర్ అన్నది అందరికీ తెలిసిందే. కేసీఆర్ అండ్ కో సేఫ్ గా ఉంటారా? జైలుకెళ్తారా? అన్నది కాలమే చెప్పాలి!



బీసీ.. ఎంపీ!

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రంగం సిద్ధం

- నేడు నోటిఫికేషన్.. జూలై 1వ తేదీన ప్రకటన
- రేసులో ఈటల, ధర్మపురి అర్వింద్, బండి సంజయ్
- సమీకరణాలు మారితే రాంచందర్‌రావుకు చాన్స్
- తుది పేరు ఖరారుపై జాతీయ నాయకత్వం కసరత్తు
- ఒకే నామినేషన్ దాఖలయ్యే అవకాశం

హైదరాబాద్, న్యూఢిల్లీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడి ఎన్నికకు రంగం సిద్ధమైంది. కొన్ని గంటల్లోనే కొత్త సారథి ఎవరో తేలిపోనుంది. పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం నోటిఫికేషన్ జారీ కానుంది. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జూలై 1న అధ్యక్షుడి పేరును అధికారికంగా ప్రకటిస్తారు. రాష్ట్ర రాజకీయాలు బీసీల ఓటు బ్యాంకు కేంద్రంగా మారిన క్రమంలో.. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఆ సామాజికవర్గం వైపే బీజేపీ జాతీయ నాయకత్వం మొగ్గుచూపుతోందన్న ప్రచారం జరుగుతోంది. అందులోనూ ఎంపీకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. పార్టీ బీసీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

మిగతా 3వ పేజీలో...

సమర్థుడికే అధ్యక్ష బాధ్యతలు

పార్టీ సారథి ఎవరో ఎల్లుండి తేలిపోతుంది

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

3

నేడు రాష్ట్రానికి అమిత్ షా రాక

నిజామాబాద్‌లో పసుపుబోర్డు కార్యాలయ ప్రారంభోత్సవం

అనంతరం బహిరంగ సభ

బోర్డుతో నెరవేరిన రైతుల కల

అభివృద్ధి దైవకార్యం

రాక్షసుల్లా అడ్డుపడ్డా మా యజ్ఞం ఆగదు.. కేసులతో ఆపినా అది తాత్కాలికమే

కంచ గచ్చిబౌలి భూములను అభివృద్ధి చేస్తాం

నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తరహాలో

అక్కడ ఐదు లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

తెలంగాణ రాష్ట్రంపై బీజేపీ సర్కారుది వివక్షే

8 మంది ఎంపీలను గెలిపిస్తే ఏమిచ్చారు?

కిషన్‌జీ గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పండి

నాగార్జున హీరోలా 2 ఎకరాలిచ్చారు.. ఎన్ కన్వెన్షన్

తొలగించినా మంచి కార్యక్రమాన్ని గుర్తించారు

నేను చదివే రోజుల్లో పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ

ఆయన అడ్డుకోకుంటే హైటెక్ సిటీ తరలిపోయేది

నగరానికి కృష్ణా జలాలు ఆయన పోరాట ఫలితమే

పీజేఆర్ వంతెన ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి


గచ్చిబౌలి వంతెనను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాలెడ్జ్ పార్కును అభివృద్ధి చేస్తే 5 లక్షల ఉద్యోగాలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను అభివృద్ధి చేస్తే పది లక్షల ఉద్యోగాలు వచ్చాయని, అదే తరహాలో కంచ గచ్చిబౌలిని అభివృద్ధి చేయాలని తాను ప్రయత్నిస్తుంటే ప్రతిపక్షాలు కోర్టుల్లో పిటిషన్లు వేసి రాష్ట్ర యువత ఉద్యోగావకాశాలను అడ్డుకుంటున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. దేవతలు యజ్ఞాలు చేసినప్పుడు రాక్షసులు వచ్చి భగ్నం చేసే ప్రయత్నం చేశారని, అంత మాత్రాన యజ్ఞాలు ఆగలేదని, అలాగే ఎవరు అడ్డుపడ్డా అవాంతరాలను అధిగమించి హైదరాబాద్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. గచ్చిబౌలి చౌరస్తాలో రూ.182 కోట్లతో నిర్మించిన ఆరు లేన్ల పీజేఆర్ వంతెనను శనివారం

మిగతా 7వ పేజీలో...

11

ఫ్యూచర్ సిటీ, నిమ్జ్ భూసేకరణ పూర్తి చేయండి

పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లకూడదు

డేటా సెంటర్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టండి

పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా

డాక్టర్ నోరి

క్యాన్సర్ నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన సేవల కోసం నియామకం

7


శుభాన్షు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ

నా దేశం ఎంతో గొప్పది!

అంతరిక్షం నుంచి ఘనంగా కనిపిస్తోంది

భూగోళాన్ని చూస్తుంటే ఏ సరిహద్దులూ లేని ఏకత్వ భావన కలుగుతోంది

రోజుకు 16సార్లు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు చూస్తున్నాం

13

ఐఎన్ఎస్ నుంచి శుభాన్షు శుక్లా

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని

మీరెంత దూరంగా ఉన్నా మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు: మోదీ

'రా' చీఫ్‌గా పరాగ్ జైన్



20 ఏళ్లకుపైగా 'రా'లో..

ఉగ్ర స్థావరాలపై పకడ్బందీ నిఘాతో ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర

13

ఆస్పత్రి నుంచి వెళ్లేలోగా బర్త్ సర్టిఫికెట్ మంజూరు!

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నిర్దేశం

స్థానిక రిజర్వేషన్లు ఎలా!

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఓవైపు.. అన్ని సామాజిక వర్గాలకు కలిపి 50 శాతం రిజర్వేషన్లు మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు మరోవైపు.. రిజర్వేషన్లను 30 రోజుల్లో ఖరారు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశం ఇంకోవైపు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అంశాన్ని త్వరగా తేల్చే దిశగా సర్కారు కసరత్తు ప్రారంభించింది.

బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జీవో ఇవ్వొచ్చా?

చట్టం లేకుండా ఉత్తర్వులు సాధ్యమేనా?

అడ్వొకేట్ జనరల్‌తో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు

రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు తీర్పు పైనా సమాలోచనలు

రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే చాన్స్

తొలుత ఏ ఎన్నికలనే దానిపైనా స్పష్టత

ముందు పంచాయతీలేనన్న అభిప్రాయాలు



హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంత శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. 42 శాతానికి పెంచుతూ జీవో ఇవ్వాలంటే చట్టపరంగా సాధ్యమేనా? లేక ప్రస్తుతమున్న రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలా? అనే దానిపై సలహా ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్‌ను కోరింది. జీవో ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నా.. దానికి చట్టపరమైన ప్రాతిపదిక లేదన్న అంశం తాజాగా

మిగతా 2వ పేజీలో...



భారత్‌కు పంపే సొమ్ముపై

రెమిటెన్స్ పన్ను లేనట్టే!

అమెరికాలోని ఎన్నారైలకు పెద్ద ఊరట

'బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్' ముసాయిదాలో కీలక మార్పులు చేసిన ఆ దేశ సెనేట్

11

రెమిటెన్స్ 3.5% నుంచి ఒక శాతానికి తగ్గింపు

అక్కడి బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల నుంచి బదిలీ చేస్తే పూర్తిగా మినహాయింపు

కేవలం నగదు, మనీ ఆర్డర్, చెక్కుల రూపంలో పంపే రెమిటెన్స్‌లకే పన్ను వర్తింపు


దహన సంస్కారాలు నిర్వహిస్తున్న మనవడు

బతికున్నప్పుడు పట్టించుకోలే.. చనిపోతే వచ్చారా?

మృతుడి నలుగురు పిల్లలపై గ్రామస్థుల కన్నెర్ర

మృతదేహం దగ్గరకు వెళ్లనీయకుండా అడ్డగింత

అందరూ తలో చేయి వేసి అంత్యక్రియలు పూర్తి

మెదక్ జిల్లా వట్టూరు గ్రామంలో ఘటన

2


వినోద (ఫైల్)

బ్యాంకు ఖాతాలోని డబ్బులివ్వలేదని

తల్లిపై పెట్రోల్ పోసి నిప్పు

ఓ కుమారుడి ఘాతుకం

90 శాతం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరిన బాధితురాలు

వరంగల్ జిల్లా కుంటపల్లిలో ఘటన

ఇక బీఆర్ఎస్ నేతలకు సిట్ నోటీసులు

ట్యాపింగ్ బాధితుల్లో ఆ పార్టీ నేతలు

ఇప్పటి వరకు 200 మందికి పైగా బాధితుల నుంచి వాంగ్మూలాల నమోదు

కవిత పీఏకు సిట్ నోటీసులంటూ ప్రచారం

నిర్ధారించని సిట్ అధికారులు

14

అనుబంధ చార్జిషీట్‌కు రంగం సిద్ధం



వైద్య కళాశాలల్లో 607 కొలువుల భర్తీ

14

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన రిక్రూట్‌మెంట్ బోర్డు

వైద్య కాలేజీల్లో తీరనున్న అధ్యాపకుల కొరత

ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

పదేళ్ల పాలనలో నిర్వహణను గాలికొదిలేసింది

జూరాల రోప్‌లు తెగిపోయే ప్రమాదం ఉందని నాడు అధికారులు చెప్పినా పట్టించుకోలేదు

ప్రాజెక్టు గేట్లకు కొత్త రోప్‌లు వేయిస్తున్నాం

కొత్తగా మరో గ్యాంటీ క్రేన్ మంజూరు: ఉత్తమ్

జూరాల దిగువన రూ.100 కోట్లతో వంతెన నిర్మిస్తామని వెల్లడి

14


జూరాల నీటి విడుదలను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్, శ్రీహరి

'ఆంధ్రజ్యోతి' ఆలోచనలను ఆచరిస్తాం

- సమాజ హితం కోసం పాటుపడతాం
- 'అక్షరం అండగా' సభలో ఎమ్మెల్యే జనార్దన్
- కార్యక్రమ రూపకర్త, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యకు ప్రత్యేక అభినందనలు
- ఒంగోలు 37వ డివిజన్ ఎన్టీఆర్ పార్కులో రూ.70.5లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం

ఒంగోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం 'ఆంధ్రజ్యోతి' చేసే ప్రతి ఒక్క ఆలోచననూ అమలు చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. ఒంగోలు నగరంలోని 37వ డివిజన్ ఎన్టీఆర్ పార్కులో శనివారం రాత్రి జరిగిన 'అక్షరం అండగా' సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' పేరుతో కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. దీన్ని రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యను ప్రత్యేకంగా అభినందించారు. నిధుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికి 37వ డివిజన్‌లో ఐదు నెలల్లో రూ.2.60 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. ప్రజలకు మేలుచేసే ఇలాంటి కార్యక్రమాలను ఇంకా కొనసాగించాలని కోరారు. 'అక్షరం అండగా' కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంస్థ డైరెక్టర్ వేమూరి ఆదిత్య మాట్లాడుతూ 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన కార్యక్రమానికి ఒంగోలులో మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ పార్కులో చేపట్టిన రూ.70.50 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జనార్దన్, వేమూరి ఆదిత్య ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పార్కులో జరిగిన లెవలింగ్, వాకింగ్ ట్రాక్ ఆధునికీకరణ పనులు, పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు తదితరాలను వారు పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి' ఒంగోలు యూనిట్ మేనేజర్ ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.


ఒంగోలులోని ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య తదితరులు




వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. శనివారం అమ్మవారు కుల్లా, నిత్యక్లిన్న అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. - వరంగల్ కల్చరల్

ఆల్మట్టికి పోటెత్తిన వరద

హైదరాబాద్/ధరూరు/దోమలపెంట/బెంగళూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పెరిగింది. కర్ణాటకలోని ఆల్మట్టి రిజర్వాయర్‌కు వరద పోటెత్తింది. ఫలితంగా డ్యామ్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 519.90 మీటర్లకు 516.82 మీటర్లకు చేరుకుంది. ఎగువ నుంచి 1.15 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 36 గేట్లు ఎత్తేసి 90 వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. దీంతో దిగువన ఉన్న నారాయణపూర్ జలాశయానికి భారీగా వరద నీరు వస్తోంది. రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 492.25 మీటర్లకు 490.63 మీటర్లకు చేరుకుంది. ఎగువ నుంచి 84,445 క్యూసెక్కుల వరద వచ్చి పడుతుండగా, 70 వేల క్యూసెక్కుల నీరు వదిలేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు శనివారం 1.24 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. ప్రాజెక్టులో 7.571 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 12 గేట్లను ఒక మీటర్ మేర ఎత్తి 86,340 క్యూసెక్కులతో మొత్తం 1,15,978 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో 129.78 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 1,16,607 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 4,332 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్‌కు 4,484 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే మొత్తం వదిలి పెడుతున్నారు.

స్థానిక రిజర్వేషన్లు ఎలా!

(మొదటిపేజీ తరువాయి)

తెరపైకి వచ్చింది. ఇప్పుడున్న చట్టం ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు సుమారు 23 శాతమే రిజర్వేషన్లు ఉన్నాయి. వాటిని 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో బిల్లులను ఆమోదించి కేంద్రానికి పంపారు. కానీ, అవి చట్టరూపం దాల్చలేదు. దీంతో చట్టం కాకుండానే రిజర్వేషన్లను పెంచుతూ కార్యనిర్వాహక ఉత్తర్వులు ఇవ్వొచ్చా.. అనే అంశం తెరపైకి వచ్చింది. దీనిపైనా ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ అభిప్రాయం కోరింది. రెండు, మూడు రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. ఆ వెంటనే రిజర్వేషన్లను ఖరారు చేసి ఎన్నికలకు వెళ్లనుంది. రిజర్వేషన్ల వ్యవహారం కొలిక్కి వచ్చాక.. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలా? సర్పంచ్ ఎన్నికలా? అనే అంశంపైనా సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

నిర్ణయం తేలితే.. వారంలో రిజర్వేషన్ల ఖరారు

సుప్రీంకోర్టు తీర్పు, ప్రత్యేక జీవో విడుదల అంశాలపై ప్రభుత్వం న్యాయ నిపుణులతోనూ చర్చిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రత్యేక జీవో ఇచ్చినా.. అది చెల్లుబాటయ్యేది అనుమానమేనని అంటున్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పును అధిగమించి ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రత్యేక జీవో ఇవ్వాలంటే రాష్ట్రపతి ఆదేశమైనా ఉండాలి, లేదా రిజర్వేషన్ల పెంపునకు రాష్ట్రాలకు అవకాశమైనా ఉండాలని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండూ లేనందున ప్రత్యేక జీవో ఇవ్వడానికి కూడా ఆస్కారం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం భావిస్తున్న 42 శాతం ప్రకారం ముందుకెళ్లాలా? డెడికేటెడ్ కమిషన్ రిపోర్టు ప్రకారం వెళ్లాలా? లేదంటే



ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరపాలా? అని అధికారులు ఆలోచిస్తున్నారు. అయితే డెడికేటెడ్ కమిషన్ నివేదికపై ఇటీవల జరిగిన క్యాబినెట్ భేటీలో చర్చ జరిగినప్పటికీ.. ఇంకా ఆ నివేదిక పంచాయతీరాజ్ శాఖకు చేరలేదు. నివేదిక అందాక ప్రభుత్వం సూచించిన మేరకు రిజర్వేషన్లను వారం పది రోజుల్లో ఖరారు చేసే అవకాశం ఉంటుందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

తొలుత ఏ ఎన్నికలు?

రిజర్వేషన్లను తేల్చాక తొలుత ఏ ఎన్నికలు నిర్వహిస్తారన్న చర్చ జరుగుతుండడంతో.. ప్రభుత్వం కూడా దీనిపై ఆలోచన చేస్తోంది. వాస్తవానికి ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించిన తరువాత సర్పంచ్ ఎన్నికలు జరిపేవారు. అది కాంగ్రెస్ ఆనవాయితీ. ఇటీవల ఓ మంత్రి కూడా తన నియోజకవర్గ నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని సమాయత్తం కావాలని సూచించారు. దీంతో రాష్ట్రంలో తొలుత ఈ ఎన్నికలే జరుగుతాయన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి, కేంద్రానికి వివరాలు సమర్పిస్తే పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను కొంతమేరైనా రాబట్టుకునే అవకాశం ఉంటుందనే చర్చ కూడా జరుగుతోంది.

రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకి ఇదే!

అన్ని సామాజిక వర్గాలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు గతంలో పలు కేసుల్లో ఇచ్చిన తీర్పే బీసీలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపునకు ఆటంకంగా మారింది. ఒకవేళ రిజర్వేషన్లను పెంచాలంటే రాజ్యాంగంలో సవరణలు చేయాలి. తర్వాత వాటిని షెడ్యూల్ 9లో చేర్చాలి. అప్పుడే బీసీలకు 42 శాతంతోపాటు రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉంటుంది. ఈ కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. అయితే, పార్లమెంటు ఆమోదం పొందాలంటే రిజర్వేషన్లపై గతంలో సుప్రీంకోర్టు తీర్పులు వెలువరించిన సమయంలో సూచించిన పలు నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. వాటి ప్రకారం.. బీసీలకు కచ్చితంగా ఎక్కువ రిజర్వేషన్ అమలు చేయాలనే వివరాలను పార్లమెంటుకు నివేదించాలి. అందుకోసమే ప్రభుత్వం కులసర్వే నిర్వహించింది. దాంతోపాటు బీసీ రిజర్వేషన్ల గుర్తింపునకు డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ రిపోర్టు ప్రకారమే బీసీలకు రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో బిల్లు పెట్టి తీర్మానించింది. బిల్లులు కేంద్రానికి వెళ్లి నెలలు గడుస్తున్నా స్పందన లేదు.

ఎడమ గట్టు విద్యుత్కేంద్రంలో..
పరిష్కృతమైన నీటి లీకేజీ సమస్య

- డ్రాఫ్ట్‌ట్యూబ్‌లో లీకేజీకి వెల్డింగ్

దోమలపెంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్కేంద్రం 1వ యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ నుంచి అవుతున్న నీటి లీకేజీని నిలువరించేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. గత సెప్టెంబరు 18న మొదటిసారి పలచటి లీకేజీ బయటపడింది. డిసెంబరు 25 నుంచి నిరంతరాయంగా విద్యుదుత్పాదనతో పాటు, శ్రీశైలం డ్యాంలోకి నీటి మళ్లింపు కొనసాగుతున్న క్రమంలో పంపు మోడ్‌లో టర్బైన్ వేగంగా తిరగడం వల్ల 1వ యూనిట్‌లో డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి.. పలచటి లీకేజీ కాస్తా ధారలా మారింది. "వాటర్ లీకేజీతో ఎడమ గట్టు విద్యుత్తు కేంద్రానికే ప్రమాదం" శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మెయిన్ ఎడిషన్‌లో కథనం ప్రచురితం కావడంతో.. అప్పటి జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్లు విద్యుత్కేంద్రంలో లీకేజీని పరిశీలించి, నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెన్‌కో ఇంజనీర్లు హైదరాబాద్‌కు చెందిన అనుభవం ఉన్న ఇంజనీరింగ్ కంపెనీ వారిని పిలిపించి.. 1వ యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్‌కు కెమికల్ గ్రౌటింగ్ చేసి, తాత్కాలికంగా లీకేజీని నిలువరించారు. డ్రాఫ్ట్ ట్యూబ్‌లో స్పైరల్‌కేస్ దగ్గర గతంలో పైపులకు చేసిన వెల్డింగ్ జాయింట్‌లో వచ్చిన క్రాక్‌ను గుర్తించేందుకు డ్రై పెనెట్రెంట్ టెస్టు(డీపీటీ) నిర్వహించారు. ఈ పరీక్షలో భాగంగా 60 మిల్లీ మీటర్ల మందం ఉండే పైపులో 200 మీటర్ల పొడవు జాయింట్‌లో పరిశీలన జరిపారు. 10ఎంఎం రంధ్రాన్ని గుర్తించి, అక్కడా గ్లౌజింగ్, వెల్డింగ్ చేశారు. దీంతో.. సమస్య పరిష్కృతమై.. మరో రెండ్రోజుల్లో విద్యుదుత్పాదన ప్రారంభం కానుంది.

ఏడేళ్లుగా తండ్రిని పట్టించుకోలే..
చచ్చాక వచ్చారా?

- మృతుడి నలుగురు సంతానంపై గ్రామస్థుల కన్నెర్ర

తూప్రాన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బతికున్నప్పుడు తండ్రిని పట్టించుకోని పిల్లలు.. ఆయన చనిపోయాక అంత్యక్రియలకు రావడంతో గ్రామస్థులు అడ్డుకున్నారు. ఆ వృద్ధుడి మృతదేహం దరిదాపుల్లోకి కూడా వారిని వెళ్లనీయలేదు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వట్టూరు గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన బింగి దేవయ్య (75), నర్సమ్మ దంపతులకు యాదగిరి, శ్రీనివాస్ కుమారులు.. ధనమ్మ, సంతోష, రమేశ్వరీ కూతుళ్లు ఉన్నారు. ఐదుగురు పిల్లలకూ దేవయ్య దంపతులు పెళ్లిళ్లు చేశారు. కూతుళ్లు అత్తగారి ఇళ్లలో ఉంటే.. కుమారులు బతుకుదెరువు కోసం ఊరు విడిచి దూరంగా వెళ్లిపోయారు. చిన్న కుమారుడు శ్రీనివాస్ వృద్ధ దంపతుల బాగోగులు చూసేవాడు. ఏడేళ్ల క్రితం దేవయ్య భార్య నర్సమ్మ, మూడేళ్ల క్రితం కొడుకు శ్రీనివాస్ చనిపోయారు. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉంటున్న దేవయ్యను కొడుకు యాదగిరి గానీ.. కూతుళ్లు గానీ ఎన్నడూ పట్టించుకోలేదు. నెల క్రితం దేవయ్య ఇంట్లో జారిపడి గాయపడ్డాడు. పక్కింటి వాళ్లు గుర్తించి గ్రామస్థుల సాయంతో కొడుకు, బిడ్డలకు ఫోన్ చేసి సమాచారమిచ్చినా వారు రాలేదు. పోలీసులతో ఫోన్ చేయించినా స్పందించలేదు. గ్రామస్థులే దేవయ్యను ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. శుక్రవారం రాత్రి దేవయ్య మృతి చెందాడు. శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు నలుగురు సంతానం ఊరొచ్చారు. దేవయ్య బతికున్నప్పుడు ఎన్నడూ పట్టించుకోలేదంటూ వారిని మృతదేహం వద్దకు గ్రామస్థులు రానివ్వలేదు. "పెద్దాయన చచ్చాక వచ్చారా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థులే అంత్యక్రియల కోసం తలో చేయి వేశారు. దేవయ్య బాగోగులు చేసుకున్న శ్రీనివాస్ చిన్న కుమారుడు.. అంటే ఆయన మనుమడితో దహన సంస్కారాలు చేయించారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని
వృద్ధురాలి గుడిసెకు నిప్పు

బంధువు దుశ్చర్య.. ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఘటన

ఏటూరునాగారం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఓ వృద్ధురాలి పూరి గుడిసెను సమీప బంధువు దహనం చేసిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారంలో శనివారం జరిగింది. మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురానికి చెందిన నిరుపేద వృద్ధురాలు పలక సమ్మక్క ఓ పూరి గుడిసెలో ఒంటరిగా ఉంటోంది. శనివారం ఆమె సమీప బంధువు పలక నాగరాజు అక్కడికి వచ్చి మద్యం తాగడానికి డబ్బులు కావాలని అడిగాడు. తన దగ్గర లేవని సమ్మక్క చెప్పడంతో నాగరాజు అక్కడి నుంచి వెళ్లిపోయినట్టే వెళ్లి పక్కనే దాక్కొని గుడిసెకు నిప్పంటించాడు. మంటలు చెలరేగడంతో వృద్ధురాలు ప్రాణాలతో బయటపడగా, గుడిసెలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి.


మంటల్లో కాలిపోయిన పూరిగుడిసె

తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కొడుకు

- ఖాతాలోని డబ్బు ఇవ్వడం లేదని ఘాతుకం
- వరంగల్ జిల్లా కుంటపల్లిలో ఘటన

సంగెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డబ్బు మీద వ్యామోహంతో విచక్షణ మరిచిన ఓ వ్యక్తి.. తనని కన్న తల్లి పట్ల రాక్షసంగా ప్రవర్తించాడు. ఎన్నిసార్లు అడిగినా సరే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బును తనకివ్వడం లేదనే ఆక్రోశంతో.. తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ ఘటనలో వినోద(60) అనే మహిళ 90 శాతం మేర కాలిన గాయాలతో ఆస్పత్రిపాలైంది. సంగెం పోలీసులు, కుంటపల్లి గ్రామప్రజల కథనం ప్రకారం.. కుంటపల్లికి చెందిన ముత్తినేని సాంబయ్య-వినోద దంపతులకు కుమారుడు సతీష్, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. సతీష్ గ్రామంలో జులాయిగా తిరుగుతుంటాడు. టెక్స్‌టైల్ పార్కు కోసం చేపట్టిన భూసేకరణలో సాంబయ్య పొలాన్ని కూడా సేకరించారు. ఇందుకు సంబంధించిన పరిహారం ప్రభుత్వం చెల్లించగా..అందులో కొత్త మొత్తంతో ఖానాపురం మండలం ధర్మారావుపేటలో కొంత సాగు భూమి కొనుగోలు చేశారు. మరో రూ.5 లక్షలను సంగెంలోని ఓ బ్యాంకులో జమ చేసుకుని వృద్ధ దంపతులు జీవనం సాగిస్తున్నారు. బ్యాంకులో ఉన్న ఆ సొమ్ము కోసం సతీష్ తన తల్లిదండ్రులతో పలుమార్లు గొడవపడటమే కాక దాడులు కూడా చేశాడు. దీంతో తల్లిదండ్రులకు దూరంగా ఉండాలని గ్రామ పెద్దలు చెప్పడంతో.. సతీష్ తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఏప్రిల్ నుంచి గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో నివాసముంటున్నాడు. కానీ, బ్యాంకు ఖాతాలోని సొమ్ముపై అతనిలో మార్పు రాలేదు. ఎన్నిసార్లు అడిగినా తల్లిదండ్రులు ఆ డబ్బు ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకున్న సతీష్ పెట్రోల్ సీసాతో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత కుంటపల్లి చేరుకున్నాడు. ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోసి ఆమె మేల్కొనేలోపే నిప్పు అంటించాడు. దాంతో వినోద పెట్టిన కేకలకు సాంబయ్య నిద్ర లేచేసరికి సతీష్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు మంటలను అదుపు చేయగా.. విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వినోదకు 90 శాతం మేర కాలిన గాయాలు అయ్యాయని తెలిపిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు.


వినోద (ఫైల్)

నేడు నిజామాబాద్‌కు అమిత్ షా

» పసుపు బోర్డు కార్యాలయానికి ప్రారంభోత్సవం

» అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగం



నిజామాబాద్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పసుపు బోర్డు కార్యాలయం

నిజామాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదివారం నిజామాబాద్ జిల్లాకు రానున్నారు. అమిత్ షా గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా 1.45 గంటలకు నిజామాబాద్ కలెక్టరేట్‌కు వస్తారు. ఆ తర్వాత నగరంలోని ఆర్యనగర్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వినాయక్‌నగర్‌లో కొద్ది సేపు పార్టీ నేతలతో మాట్లాడతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.05 గంటలకు బయలుదేరి కంఠేశ్వర్ బైపాస్‌కు చేరుకొని డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత నగరంలోని పాలిటెక్నిక్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. హెలికాప్టర్ ద్వారా 5 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేటకు బయలుదేరి వెళతారు. అమిత్‌షా జిల్లాకు వస్తుండటంతో అధికారులు, పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సభకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల, రఘునందన్, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ..

పసుపు బోర్డు కోసం మూడు దశాబ్దాలుగా జిల్లా రైతులు పోరాటాలు చేశారు. హైదరాబాద్, ఢిల్లీలోనూ ఆందోళనలు నిర్వహించారు. ఎన్నికల్లో సైతం పోటీకి దిగారు. 2019 ఎన్నికల్లో పసుపు బోర్డు తెస్తానన్న హామీతో ఎంపీ అర్వింద్ పోటీ చేశారు. ఎన్నికల్లో గెలవగానే పసుపు బోర్డు కోసం ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో గత పార్లమెంటు ఎన్నికలకు ముందే ప్రధాని మోదీ పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రకటన చేశారు. పసుపు బోర్డు కోసం మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ.. ఉద్యమాలను దృష్టిలో పెట్టుకొని నిజామాబాద్‌లో ఏర్పాటు చేశారు. పసుపు బోర్డు వల్ల పంటకు ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందుతుంది. పసుపు ఎగుమతి చేయడంతో పాటు పసుపు పరిశ్రమలు కూడా జిల్లాలో ఏర్పాటు కానున్నాయి. నిర్మల్, నిజామాబాద్, వరంగల్ జిల్లా రైతులకు కూడా దీని వల్ల ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది.

అప్పు తీర్చాలన్నందుకు వడ్డీ వ్యాపారి హత్య

» కాజీపేటలో రైల్వే ఉద్యోగి ఘాతుకం

కాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అప్పుగా తీసుకున్న మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగివ్వాలని అడిగినందుకు వడ్డీ వ్యాపారిపై కక్ష పెంచుకున్న ఓ రైల్వే ఉద్యోగి అతడిని కత్తితో పొడిచి చంపాడు. హనుమకొండ జిల్లా కాజీపేటలో ఈ ఘటన జరిగింది. వరంగల్ గిర్మాజీపేటకు చెందిన త్రిపురాది నవీన్‌కుమార్ (55) ఫైనాన్స్ వ్యాపారి. కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్న రైల్వే ఉద్యోగి గడ్డం ప్రవీణ్‌కుమార్ అడిగితే ఆరు నెలల క్రితం రూ.50వేలు అప్పుగా ఇచ్చాడు. ఆ డబ్బులు వడ్డీతో సహా తిరిగివ్వాలని ప్రవీణ్‌పై నవీన్ ఒత్తిడి పెంచాడు. శుక్రవారం తన ఇంట్లో మద్యం తాగుదామని నవీన్‌ను ప్రవీణ్ పిలిపించుకున్నాడు. అతడితో ఫుల్లుగా మద్యం తాగించాడు. అనంతరం కత్తితో నవీన్ తల, మెడపై పొడిచాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. నవీన్ మెడలో ఉన్న స్వర్ణాభరణాలను ప్రవీణ్ తీసేసుకున్నాడు. మృతుడి భార్య త్రిపురాది మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గడ్డం ప్రవీణ్‌కుమార్‌కు గతంలోనే నేరప్రవృత్తి ఉన్నట్లు చెబుతున్నారు. రైల్వేలో ఓ మహిళా ఉద్యోగితో ప్రవీణ్ వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో భార్య తీవ్ర మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇప్పటికే పలు కేసుల్లో సస్పెండై తిరిగి ఉద్యోగంలో చేరాడు. కాగా నవీన్ హత్యలో ప్రవీణ్‌కు ఎవరైనా సహకరించారా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏసీబీ వలలో ముగ్గురు ప్రభుత్వోద్యోగులు

సుల్తానాబాద్/ హుజూర్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల ముగ్గురు ప్రభుత్వోద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ వాసి ఆర్నకొండ ప్రసాద్‌ను ఆయన నిర్మించుకున్న ఇంటికి నంబర్ ఇవ్వడానికి మున్సిపల్ బిల్ కలెక్టర్ విజయ్, ఆర్ఐ వినోద్ రూ.10 వేలు లంచమడిగారు. దీనిపై బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసి, వారి సూచన మేరకు శనివారం విజయ్‌కు.. పట్టణంలోని ఒక ఎలక్ట్రిక్ షాప్‌లో రూ.5,000 లంచం అందజేశాడు. అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు విజయ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయానికెళ్లారు. ఆర్ఐ వినోద్ లంచమడిగినట్లు నిర్ధారించుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ తహసీల్దార్ పరిధిలోని కరక్కాయలగూడెం వాసి రాంబాబు, తన తండ్రి పేరిట ఉన్న భూమి పట్టాను తనతోపాటు తన సోదరి పేరిట మార్చుకోవడానికి స్లాట్ బుక్ చేసుకున్నా.. దీనికి భూభారతి ఆపరేటర్ విజేతరెడ్డి రూ.20 వేలు లంచమడిగాడు. కానీ, 12 ఎకరాలకు రూ.12 వేలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్న రాంబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు విజేత రెడ్డికి రూ.12 వేలు ఇచ్చాడు. డీఎస్పీ జగదీశ్ చందర్ సారథ్యంలో అక్కడే సిద్ధంగా ఉన్న ఏసీబీ సిబ్బంది.. విజేత రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో అధికారుల పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బీసీ.. ఎంపీ!



(మొదటిపేజీ తరువాయి)

పేర్లపై చర్చ జరుగుతోంది. ఈటల, అర్వింద్ ఇద్దరూ ఇప్పటికే గట్టి ప్రయత్నాలు చేశారు. బండి సంజయ్ పేరు కూడా వినిపిస్తున్నా.. తాను రేసులో లేనని గతంలో ఆయన పేర్కొన్న అంశం చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఎంపీకి కాకుండా మరో సీనియర్ నేతకు పట్టం కట్టాలనుకుంటే.. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావుకు అవకాశం దక్కవచ్చన్న చర్చ జరుగుతోంది. రాంచందర్‌రావుకు పార్టీ పాత తరం నాయకుల మద్దతు కూడా ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకదశలో బండి సంజయ్ కూడా రాంచందర్‌రావు పట్ల సానుకూలత చూపారని అంటున్నాయి.

రెండేళ్లుగా వాయిదా పడుతూనే..

బీజేపీ జాతీయ నాయకత్వం 2023 జూలై 4న బండి సంజయ్ స్థానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యత అప్పగించింది. అది తాత్కాలికమేనని, కొన్ని నెలల్లో కొత్త అధ్యక్షుడిని నియమిస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఎక్కువ మంది సీనియర్ నేతలు పోటీపడటం, తర్వాతి పరిణామాల్లో రెండు, మూడు గ్రూపులు ఏర్పడటంతో ఇప్పటివరకు వాయిదా పడుతూ వచ్చింది. ఒకదశలో పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి కూడా ఏర్పడింది. మరోవైపు పార్టీ జాతీయ నాయకత్వం అంతరంగం అంతుచిక్కకపోవడంతో ఆశావహులు కూడా తమ ప్రయత్నాలకు కొంత విరామమిచ్చారు. ఇన్నాళ్లకు మళ్లీ కదలిక వచ్చింది.

పోటా పోటీ సభలతో చర్చ!

ఇటీవల వికసిత్ సంకల్ప్ సభ పేరిట సభ నిర్వహించిన ఈటల రాజేందర్.. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌తోపాటు రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సభకు ఆహ్వానించారు. మరోవైపు నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ అర్వింద్ రైతు మహా సమ్మేళనం పేరిట బహిరంగసభ చేపట్టారు. అందులో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోపాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొననున్నారు. ఇలా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష రేసులో ఉన్న ఇద్దరు ఎంపీలు పోటాపోటీగా సభలు నిర్వహించడం పార్టీలో చర్చకు దారితీసింది.


ఎన్నిక లాంఛనమే!

నూతన అధ్యక్షుడిగా ఎవరికి అవకాశం ఇచ్చేదీ జాతీయ నాయకత్వం ఖరారు చేయాల్సి ఉంది. తర్వాత ఎన్నిక లాంఛనమే కానుంది. సాధారణంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కలిసి ఎన్నుకుంటారు. పార్టీ జాతీయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక రిటర్నింగ్ అధికారి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే పర్యవేక్షణలో ఎన్నిక చేపడతారు. అయితే ఒకే నామినేషన్ దాఖలయ్యే అవకాశం ఉందని, వారే రాష్ట్ర అధ్యక్ష పదవి చేపడతారని పార్టీ వర్గాలు తెలిపాయి ఉమ్మడి రాష్ట్రంలోను, తెలంగాణ ఆవిర్భావం తర్వాత కూడా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి ఓటింగ్ జరగలేదని గుర్తు చేశాయి. రాష్ట్ర అధ్యక్ష పదవి ఆశిస్తున్న నేతలు పార్టీ జాతీయ నాయకత్వం నుంచి ఫోన్ కాల్ కోసం ఎదురుచూస్తున్నారని, ఎంపికైనట్టు ఎవరికి ఫోన్ వస్తే వారే సోమవారం నామినేషన్ దాఖలు చేస్తారని పేర్కొన్నాయి. ఆదివారం రాత్రిలోగా ఎప్పుడైనా తమకు ఢిల్లీ నుంచి ఫోన్ రావొచ్చన్న ఆశాభావంతో నేతలు ఎదురుచూస్తున్నారని తెలిపాయి.

సమర్థుడికే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు

» పార్టీ సారథి ఎవరో ఎల్లుండి తేలిపోతుంది..

» బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



రామగిరి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సమర్థ నాయకుడికే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తామని బీజేపీ జాతీయ ఎన్నికల అధికారి, ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. పార్టీ సారథి ఎవరో మంగళవారం తెలిపోతుందని చెప్పారు. కార్యకర్తల అభిప్రాయం మేరకు పార్టీ నిర్ణయం ఉంటుందన్నారు. శనివారం నల్లగొండలో లక్ష్మణ్ విలేకరులతో మా ట్లాడారు. సామాన్య కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం బీజేపీలోనే సాధ్యమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ సర్కారును డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశాన్ని మ్యానిఫెస్టోలో పెట్టి, బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చాక.. ఇప్పుడు చేతులెత్తేయాలని చూస్తే.. కర్రు కాల్చి వాత పెట్టడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాగా, బీసీలు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రధాని మోదీ చేస్తున్న జన, కులగణనను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని లక్ష్మణ్ మండిపడ్డారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన బీసీ సంఘాల సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో నెహ్రూ కాలం నుంచి మన్మోహన్‌సింగ్ కాలం వరకు బీసీలకు అన్యాయమే జరిగిందని లక్ష్మణ్ విమర్శించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అడుగుతా: రాజాసింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాను కూడా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని అడుగుతానని.. ఇస్తారా.. లేదా..? అన్నది పార్టీ పెద్దల ఇష్టమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "నాకు అధ్యక్ష పదవి ఇవ్వరు. ఆ విషయం నాకు తెలుసు. కానీ ప్రయత్నం చేస్తే తప్పేముంది..?" అని వ్యాఖ్యానించారు. నామినేషన్ తేదీ ప్రకటించిన తర్వాత తాను కూడా నామినేషన్ వేయాలా..? వద్దా..? అని ఆలోచిస్తానని తెలిపారు. కాగా, నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ దుకాణంలో జరిగిన ఘర్షణపై రాజాసింగ్ వీడియో విడుదల చేశారు. హిందూ సమాజంపై ఇష్టానుసారంగా మాట్లాడే వారిపై కఠిన సెక్షన్లు విధించి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు పిల్లలతో కోర్టు భవనంపై నుంచి దూకి..

గొడవల కారణంగా దంపతుల దుశ్చర్య

భార్య మృతి.. ముగ్గురికి గాయాలు

6నెలల నుంచి

భార్యాభర్తల మధ్య తగాదాలు

మెదక్ అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవనం వద్ద విషాద ఘటన జరిగింది. పేషీకి హాజరైన భార్యాభర్తలు, క్షణికావేశంలో తమ ఇద్దరు పిల్లలతో కలిసి కోర్టు భవనంపై నుంచి కిందకు దూకారు. ఈ ఘటనలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. బంధువులు వెల్లడించిన వివరాల మేరకు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్, రమ్య (28) భార్యాభర్తలు. వీరికి యశ్విక (5), రుత్విక (2) కూతుళ్లు. ఆరు నెలల క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. పిల్లలు నల్లగా ఉన్నారంటూ భార్యతో నవీన్ గొడవపడేవాడని తెలిసింది. భర్త వేధింపులు తాళలేక రమ్య తన పుట్టిల్లు అయిన రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌కు వెళ్లింది. కొన్నాళ్లకు.. భార్యను పంపడం లేదంటూ నవీన్ లక్ష్మాపూర్‌కు వెళ్లి.. అత్తగారి ఇంటిపై సుత్లి బాంబులు వేశాడు. ఈ ఘటనకు సంబంధించి అతడిపై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో అతడు రెండు నెలలు జైల్లో ఉన్నాడు. ఇదే కేసు విషయంలో శనివారం కోర్టు విచారణకు దంపతులు హాజరయ్యారు. అక్కడ ఇద్దరి నడుమ మళ్లీ గొడవ తల్తెత్తింది. కొద్దిసేపటికి రమ్య, నవీన్ పిల్లలను వెంట బెట్టుకొని కోర్టు భవనంపైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకారు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో రమ్య మృతిచెందింది. భర్త నవీన్‌గౌడ్ కాళ్లు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. పిల్లలిద్దరి చేతులకు దెబ్బలు తగిలాయి. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఘటన స్థలానికి చేరుకొని రమ్య మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో చిన్నారులను నిలోఫర్‌కు, నవీన్‌ను గాంధీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదైంది.

పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు?

» పసుపు పంటకు 15వేల మద్దతు ధర ఇవ్వాలి: కవిత

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఇప్పటికే రెండుసార్లు ప్రారంభించారని.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మూడోసారి ప్రారంభించేందుకు వస్తున్నారని, ఇలా ఇంకెన్నిసార్లు ప్రారంభిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే దానికి చట్టబద్ధత కల్పించాల శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పసుపు బోర్డుకు ఇదివరకే ప్రారంభోత్సవాలు చేసిన సంగతి ఎంపీ అర్వింద్ కేంద్ర హోం మంత్రికి చెప్పలేదేమోనని ఎద్దేవా చేశారు. అమిత్ షా పసుపు పంటకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, యాకుత్‌పురా నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు శనివారం కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. కాగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనకు కవిత నివాళులు అర్పించారు. కాగా, తెలంగాణ జాగృతితో సీపీఐ సాంస్కృతిక విభాగం యువ కళావాహిని కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని కేరళకు చెందిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సందోష్‌కుమార్ తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో ఆమెతో సందోష్ భేటీ అయ్యారు.

'దోస్త్' మూడోవిడతలో 85,680 మందికి ప్రవేశాలు

ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ కౌన్సెలింగ్ మూడోవిడత ఫలితాలను తెలంగాణ ఉన్నత విద్యామండలి శనివారం ప్రకటించింది. మొత్తం 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా.. 85,680 మందికి సీట్లు కేటాయించినట్లు దోస్త్ కన్వీనర్ ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. కామర్స్ కోర్సుల్లో అత్యధికంగా 35,402 మంది, ఫిజికల్ సైన్స్‌లో 20,890, లైఫ్ సైన్స్‌లో 16,099, ఆర్ట్స్‌లో 13,128, ఇతర కోర్సుల్లో 161 మంది ప్రవేశాలు పొందినట్టు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందినవారు ఈనెల 30లోపు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, జూలై1లోపు కళాశాలల్లో చేరాలని కన్వీనర్ సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ఫోన్ ట్యాపింగ్ జాబితాను ప్రతి ఆరు నెలలకు ఉన్నత స్థాయిలో సమీక్షించాలి. ఈ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. ఏయే సందర్భాలలో కాల్ డేటా సేకరించవచ్చు, ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చు అన్న విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు విధించి రాష్ట్రాలకు పంపింది. అయినా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలోని కమిటీ ఇవేమీ పట్టించుకోకుండా గుడ్డిగా ఆమోదించింది. అత్యవసర పరిస్థితులలో ఐజీ, ఆ పైస్థాయి అధికారి మాత్రమే ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించవచ్చు. ఈ కేసును సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపితే నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆ కమిటీలోని ఇతర అధికారులతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులను శిక్షించాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారంతా ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. ప్రస్తుతం సిట్‌కు ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆ స్థాయి అధికారులు ఏం ప్రశ్నించగలరు?

మార్చే యత్నం.. మారిన సీఎం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో మార్పు కనిపిస్తోంది. ఏడాదిన్నర క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఇంత కాలంగా అనేక సందర్భాలలో టేకిట్ ఈజీ ధోరణి ప్రదర్శించారు. సహచర మంత్రులతో స్నేహపూర్వకంగా వ్యవహరించారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ క్రమంలో పలువురు మంత్రులు, అధికారులు అదుపు తప్పారు. ఫలితంగా ముఖ్యమంత్రికి ప్రభుత్వంపై పట్టు రాలేదన్న విమర్శలు వినిపించాయి. దీంతో రేవంత్‌రెడ్డి ఇటీవలి కాలంలో మంత్రులు, శాసనసభ్యులతో కొంత నిర్మొహమాటంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. పార్టీపై, ప్రభుత్వంపై పట్టు సాధించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మార్పు అకస్మాత్తుగా వచ్చింది కాదు. ముఖ్యమంత్రిలో ఈ తెగింపు రావడానికి కారణం ఏమిటి? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకోవాలని ఎందుకు నిర్ణయించుకున్నారు? అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. ఆయనలో ఈ మార్పు రావడానికి సహచర మంత్రులతో పాటు సొంత పార్టీ నాయకులు, పార్టీ అధిష్ఠానం కూడా కారణమని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రిగా ఆయనకు తగినంత స్వేచ్ఛ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇబ్బందులపాల్జేసింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పార్టీ అధిష్ఠానానికి మధ్య అంతరం ఏర్పడిందన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్న ప్రచారం కూడా జరిగింది. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉన్న సమయంలోనే రాహుల్‌గాంధీ ఆయనను కలుసుకోకుండా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలుసుకోవడం ఈ వార్తలకు బలం చేకూరింది. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానానికి మళ్లీ సన్నిహితం అవడానికి ఆయన తన వంతు ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కొంత మెత్తబడింది. అయితే, అదే సమయంలో కొంత మంది మంత్రులు, నాయకులు పార్టీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చడం అవసరమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అభిప్రాయ పడేలా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫైర్ బ్రాండ్ లీడర్‌లా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రిగా ఆ స్థాయిలో వ్యవహరించకపోవడం వాస్తవం. ఇందుకు అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది కాంగ్రెస్ అధిష్ఠానమే. కాంగ్రెస్ సంస్కృతిని అవగాహన చేసుకోవడానికి ఆయనకు కొంత సమయం పట్టింది. ముఖ్యమంత్రిగా అనేక పరిమితుల మధ్య పనిచేయవలసి వచ్చింది. అయినా కాంగ్రెస్ అధిష్ఠానం మనసెరిగి వ్యవహరించడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆయన నాయకత్వ ప్రతిభపై నీలినీడలు కమ్ముకున్నాయి. ముఖ్యమంత్రిగా ఉండి కూడా కొంత మంది మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోలేని విధంగా పార్టీ అధిష్ఠానం ఆరంభంలోనే ఆంక్షలు విధించింది. రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాలలో తొందరపాటు ప్రదర్శించారు. అందరూ తనవాళ్లే అన్నట్టుగా తన మనసులోని అభిప్రాయాలను అందరి ముందూ బయటపెట్టేవారు. దీంతో పార్టీలోని రేవంత్‌రెడ్డి ప్రత్యర్థులు తమ వ్యూహాలకు పదునుపెట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని పార్టీ అధిష్ఠానానికి నూరిపోశారు. ఆయన నాయకత్వంలో స్థానిక ఎన్నికలకు వెళ్లలేమని ఫిర్యాదు చేశారు. ఎన్నికల నాటితో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలహీనపడిందని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అలవాటు ప్రకారం అసంతృప్తులనే ప్రోత్సహించింది. ఒక దశలో రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చే విషయం కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలించింది. ఈ అభిప్రాయానికి వచ్చిందే తడవుగా ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగి అత్యంత గోప్యంగా అభిప్రాయ సేకరణకు పూనుకున్నారు. ఎంపిక చేసిన కొంత మందికి, ముఖ్యంగా ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరిన వారికి ఫోన్లు చేసి ముఖ్యమంత్రిని మారిస్తే ఎలా ఉంటుందంటూ ఆరా తీశారు. అయితే ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి షాకింగ్ విషయాలు తెలిసొచ్చాయి. రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలన్న పిచ్చి ఆలోచన చేయొద్దు. అలా చేస్తే ప్రభుత్వం నెల రోజుల్లోనే పతనమవుతుందని ఒక సీనియర్ ఎమ్మెల్యే కుండబద్దలు కొట్టారు. మారిస్తే ప్రభుత్వం ఒక్క రోజు కూడా మనుగడ సాగించలేదు అని మరో సీనియర్ నాయకుడు కూడా తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతోనే తాను ప్రతిపక్ష పార్టీ నుంచి గెలిచి కూడా కాంగ్రెస్‌లో చేరానని, రేవంత్‌రెడ్డే లేకపోతే మేం ఈ పార్టీలో ఎందుకుంటామని మరో ఎమ్మెల్యే స్పష్టంచేశారు. నాయకత్వంలో లోపాలు గుర్తిస్తే వాటిని సరిదిద్దుకోవడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి గానీ ఏకంగా నాయకత్వాన్నే మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని క్షేత్ర స్థాయి నుంచి కూడా పార్టీ అధిష్ఠానానికి అభిప్రాయాలు అందాయి. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చాలన్న అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం స్వస్తి చెప్పింది. ఈ విషయం ముఖ్యమంత్రికి తెలుసో లేదో తెలియదు గానీ ఆయన మాత్రం గేరు మార్చాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇటీవలి కాలంలో ఆయనలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మంత్రులతో నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. పార్టీ సమావేశాల్లో కూడా తన మనసులోని మాటను నిర్మొహమాటంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షలు మొదలెట్టారు. అదే సమయంలో మంత్రులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఎక్కడికక్కడ మంత్రులపైనే ఉంటుందని స్పష్టంచేస్తున్నారు. విధానపరమైన ప్రకటనలను మంత్రులు తమంతట తాము చేయకుండా పీసీసీ అధ్యక్షుడి ద్వారా కట్టడి చేయించారు. ముఖ్యమంత్రి అనుమతి లేకుండా మంత్రులు విధానపరమైన ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. అదే సమయంలో పార్టీ అధిష్ఠానం ఆలోచనలతో సంబంధం లేకుండా తన మానాన తాను పనిచేసుకుపోవాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్టుగా కనిపిస్తోంది. పార్టీపైన, ప్రభుత్వంపైన పట్టు పెంచుకుంటే తన నాయకత్వానికి ఢోకా ఉండదన్న అభిప్రాయానికి రేవంత్ వచ్చారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ, ప్రభుత్వ వ్యవహారాల్లో ఆయన స్పీడ్ పెంచారు. తదుపరి దశలో మంత్రులను కట్టడి చేయడంపై ముఖ్యమంత్రి దృష్టిపెడతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ప్చ్.. అధిష్ఠానం తీరంతే!

రేవంత్‌రెడ్డి విషయం అలా ఉంచితే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఏమీ మారలేదని ఈ పరిణామాలతో స్పష్టమవుతోంది. పుష్కర కాలం క్రితం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రదర్శించిన పెత్తందారీ పోకడలనే ఇప్పుడూ ప్రదర్శిస్తోంది. నిజానికి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కుంచించుకుపోయింది. పలు రాష్ట్రాలలో ఆ పార్టీకి ఉనికి లేదు. సమీప భవిష్యత్తులో కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం కాంగ్రెస్ శ్రేణుల్లో నానాటికీ సన్నగిల్లుతోంది. ప్రధాని మోదీ రాజకీయం ముందు ఆ పార్టీ నిలబడలేకపోతోంది. ప్రస్తుతం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉంది. అది కూడా స్థానికంగా బలమైన నాయకులు ఉండటం వల్లనే అక్కడ పార్టీ అధికారంలోకి రాగలిగింది. కర్ణాటకలో అధికారంలోకి రావడానికి భారతీయ జనతా పార్టీ యడియూరప్పను దూరం పెట్టడం ఎంత కారణమో, కాంగ్రెస్ సిద్దరామయ్య నాయకత్వంలో ఉండటం కూడా అంత కారణం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డే ప్రధాన కారణం. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పోకడలతో తెలంగాణ ప్రజలు విసుగు చెందారు. అయితే కాంగ్రెస్–బీజేపీలో ప్రత్యామ్నాయ పార్టీగా దేన్ని ఎంచుకోవాలో తేల్చుకోలేని స్థితిలో తెలంగాణ సమాజం ఉండింది. ఈ దశలో కాంగ్రెస్ నాయకత్వ పగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి రాజకీయంగా విజృంభించారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం మారడం కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇదే అదనుగా భావించిన రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అమీతుమీకి సిద్ధపడ్డారు. ఎన్నికల ఖర్చు కోసం అందినచోటల్లా అప్పులు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి ఆయన కొత్త అయినప్పటికీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఒంటి చేత్తో పోరాడారు. ప్రజలు కూడా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయాన్ని రేవంత్‌రెడ్డిలో చూసుకున్నారు. ఫలితంగా ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 65 స్థానాలు లభించాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీ అధిష్ఠానం ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉండి వుంటే కాంగ్రెస్ పార్టీకి 70కి పైగా సీట్లు లభించి ఉండేవి.

ఎవరి ఆదేశాలతో, ఎవరి కోసం ఇన్ని వందల ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నా ప్రభాకరరావు మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా అయితే ప్రస్తుత దర్యాప్తు వృథా ప్రయాసే అవుతుంది. గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్టుగా ఈ ఎపిసోడ్ మిగలకూడదు అంటే తగు నిర్ణయం తీసుకోవలసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే.

కాంగ్రెస్ విజయం సాధిస్తే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. అయినా ముఖ్యమంత్రి ఎంపికపై కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడిన ఒకరిద్దరితో పాటు, వారికి మద్దతు ప్రకటించిన ఐదారుగురిని మినహాయిస్తే మిగతా వారందరూ రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డికి ఎటువంటి అనుకూల వాతావరణం ఉందో రేవంత్‌రెడ్డికి కూడా అటువంటి సానుకూల పరిస్థితి వచ్చింది. అయినా ముఖ్యమంత్రి ఎంపికలో కాంగ్రెస్ అధిష్ఠానం కొద్ది రోజులు తాత్సారం చేసింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేసినా మంత్రివర్గం కూర్పులో ఆయనకు స్వేచ్ఛ ఇవ్వలేదు. మంత్రులుగా ఎవరిని తీసుకోవాలో, వారికి ఏయే శాఖలను కేటాయించాలో కూడా పార్టీ అధిష్ఠానమే నిర్ణయించింది. అదే సమయంలో మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, వారి శాఖల్లో జోక్యం చేసుకోవద్దని షరతు విధించింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి అవ్వాలన్న కోరిక ఫలించిన సంతోషంలో రేవంత్‌రెడ్డి ఇవేమీ పట్టించుకోలేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మంత్రులు, పార్టీలో సీనియర్లను సమన్వయం చేసుకోవడం రేవంత్‌రెడ్డికి తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రిగా ఉండి కూడా వంద కోట్ల రూపాయల బిల్లులను కూడా విడుదల చేయించలేని దుస్థితి నెలకొంది. ఆర్థికమంత్రిగా భట్టి విక్రమార్కకు బిల్లుల చెల్లింపు అధికారం కట్టబెట్టారు. ఏయే శాఖల్లో ఎవరెవరికి ఎంత మొత్తం చెల్లించాలో సంబంధిత శాఖల మంత్రులు సూచిస్తే తదనుగుణంగా బిల్లులు చెల్లించే విధానం అమలు చేస్తున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డే ప్రధాన కారణం. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పోకడలతో తెలంగాణ ప్రజలు విసుగు చెందారు. అయితే కాంగ్రెస్–బీజేపీలో ప్రత్యామ్నాయ పార్టీగా దేన్ని ఎంచుకోవాలో తేల్చుకోలేని స్థితిలో తెలంగాణ సమాజం ఉండింది. ఈ దశలో కాంగ్రెస్ నాయకత్వ పగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి రాజకీయంగా విజృంభించారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం మారడం కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇదే అదనుగా భావించిన రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అమీతుమీకి సిద్ధపడ్డారు. ఎన్నికల ఖర్చు కోసం అందినచోటల్లా అప్పులు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి ఆయన కొత్త అయినప్పటికీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఒంటి చేత్తో పోరాడారు. ప్రజలు కూడా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయాన్ని రేవంత్‌రెడ్డిలో చూసుకున్నారు. ఫలితంగా ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 65 స్థానాలు లభించాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీ అధిష్ఠానం ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉండి వుంటే కాంగ్రెస్ పార్టీకి 70కి పైగా సీట్లు లభించి ఉండేవి.

ఇటువంటి సవాలక్ష పరిమితులు ఉన్నప్పటికీ పార్టీ అధిష్ఠానం పట్ల విధేయతతో రేవంత్‌రెడ్డి సర్దుకుపోయారు. అధిష్ఠానం చెప్పిన విధంగా నడుచుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా ఆయన రెండు మూడు నిర్ణయాలు అనాలోచితంగా చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. ఇంకోవైపు పార్టీ నిధుల కోసం అధిష్ఠానం తెలంగాణపైనే ఆధారపడిన పరిస్థితి. ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారడానికి ఇది కూడా ఒక కారణం అయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలన్న ఆలోచన అధిష్ఠానానికి రావడం పలువుర్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. పార్టీ పగ్గాలు జాతీయ స్థాయిలో సోనియాగాంధీ చేతికి వచ్చాక ఢిల్లీలో సామంతరాజులు ఎక్కువయ్యారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర నాయకత్వాలపై అంతులేని పెత్తనం చేశారు. రాజశేఖరరెడ్డి వంటి వారు కూడా డబ్బు మూటలతో సామంతులను సంతృప్తిపరచాల్సిన పరిస్థితి. ఇప్పుడు పార్టీ కేంద్రంలో అధికారం కోల్పోయి పదకొండేళ్లు అయింది. అయినా ఢిల్లీలో పెద్దలుగా చెలామణి అవుతున్న వారిలో మార్పు లేదు. జాతీయ స్థాయిలో పార్టీ బలహీనపడినా రాష్ట్రాలలో పెత్తనాన్ని కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చీటికిమాటికీ ఢిల్లీకి పిలిపించుకొని రోజుల తరబడి వేచివుండే పరిస్థితి కల్పించారు. కేంద్రంలో పదకొండేళ్లుగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీలో ఈ సంస్కృతి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలోని ఆ పార్టీ అత్యంత బలంగా ఉంది. అయినా రాష్ట్రాలలో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా సమస్యలు ఉత్పన్నమైతే వాటి పరిష్కారానికి ఢిల్లీ నుంచి పార్టీ ప్రతినిధులను పంపుతున్నారే గానీ ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకోవడం లేదు. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలకు ఇప్పుడు చేయడానికి పని కూడా లేదు. అయినా అయినదానికీ కానిదానికీ ఆ ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రులను కూడా ఢిల్లీకి పిలిపించుకుంటున్నారు. ఇటువంటి ధోరణులను విడనాడకపోవడం వల్లనే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మెరుగుపడటం లేదు. గతంలో వలె రాష్ట్రాలపై పార్టీకి పట్టు ఉండటం లేదు. అయినా ఢిల్లీ నుంచి పెత్తనం చేయాలని అనుకుంటున్నారు. రాష్ట్రాలలో బలమైన నాయకులు ఉన్నప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండేది. జాతీయ స్థాయిలో పార్టీ బలపడాలంటే రాష్ట్రాలలో పటిష్ఠమైన నాయకత్వాలను అభివృద్ధి చేసుకోవాలన్న ప్రాథమిక సూత్రాలను విస్మరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత దుస్థితికి ఆ పార్టీ అధిష్ఠానమే కారణం. ఈ నేపథ్యంలో దాదాపు దశాబ్దం తర్వాత తెలంగాణలో అధికారంలోకి రాగలిగాం అన్నది విస్మరించడంతో పాటు అందుకు కారణం ఎవరు అన్న వాస్తవాన్ని విస్మరించి ఏడాదిన్నరకే నాయకత్వాన్ని మార్చాలన్న ఆలోచన చేయడమే వింతగా ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఆలోచనలతో సంబంధం లేకుండా రాష్ట్రంలో తన నాయకత్వాన్ని పటిష్ఠం చేసుకోవాలన్న ఆలోచనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన కరకుగా వ్యవహరించాలన్న నిర్ణయానికీ వచ్చారట. ఏది ఎలా జరగాలని ఉంటే అలానే జరుగుతుంది. ఇకపై నా స్టయిల్లోనే ముందుకు వెళతాను అన్న నిర్ణయానికి రేవంత్‌రెడ్డి వచ్చారని చెబుతున్నారు. ఫలితమే ఇటీవలి కాలంలో ఆయనలో మనం చూస్తున్న మార్పు.

ట్యాపింగ్ లోగుట్టు వీడాలంటే..

ఈ విషయం అలా ఉంచితే తెలంగాణలో కేసీఆర్ హయాంలో విచ్చలవిడిగా సాగిన టెలిఫోన్ ట్యాపింగ్ విషయానికి వద్దాం. 2018కి ముందు అధికారులు ఎంత అరాచకంగా వ్యవహరించారో ఈ ఉదంతం చెబుతోంది. వందల వేల సంఖ్యలో ప్రత్యర్థుల ఫోన్లను దొంగచాటుగా, అక్రమంగా విన్నప్పటికీ కేసీఆర్ ఓటమి నుంచి తప్పించుకోలేక పోయారు. ఇంత భారీ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన విషయం కూడా కాకతాళీయంగా బయటపడింది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఆ నాటి ప్రభువుల కోసం అడ్డగోలుగా వ్యవహరించిన నాటి ఎస్ఐబీ అధికారులు తమను తాము కాపాడుకొనే క్రమంలో సర్వర్లు, హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో తీవ్రవాదులు, ఉగ్రవాదులకు సంబంధించి కొన్ని ఏళ్లుగా సేకరించి భద్రపరిచిన సమాచారాన్ని కూడా ధ్వంసం చేశారు. ఇది అత్యంత తీవ్రమైన నేరం. దీంతో ప్రభుత్వ మార్పిడి తర్వాత ఎస్ఐబీ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదైంది. తీగ లాగితే డొంక కదిలినట్టు 2018 ఎన్నికలకు ముందు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని వెల్లడైంది. నేరస్థులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఎక్కడో ఒకచోట పొరపాటు చేస్తారు అన్నట్టుగా నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకరరావు బృందం సర్వీస్ ప్రొవైడర్లకు పంపిన మెయిల్ ఒకటి విచారణ అధికారులకు లభించింది. దీంతో ఎవరెవరి ఫోన్లు ఎంతకాలం దొంగచాటుగా విన్నదీ వెలుగులోకి వచ్చింది. ఈ దురాగతానికి వివిధ స్థాయిలలో అనుమతించిన అధికారులందరికీ ఈ నేరంతో సంబంధం ఉన్నట్టే. అమలులో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా వివిధ స్థాయిల్లో అధికారులు గుడ్డిగా అనుమతించారు. ఫోన్ ట్యాపింగ్ అరాచకానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రులైన, ఆయన సామాజిక వర్గానికే చెందిన అధికారులు ప్రభాకరరావు, ప్రణీత్‌రావు, రాధాకృష్ణరావు వంటి వారు పాల్పడ్డారు. మునుగోడు ఉప ఎన్నికలో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు నిధులు అందకుండా కట్టడి చేయడం కోసం విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేయించి అధికార పార్టీ గెలుపునకు సహకరించిన ప్రణీత్‌రావు అనే ఇన్‌స్పెక్టర్‌కు ఆక్సిలరేటెడ్ ప్రమోషన్ ఇచ్చి డీఎస్పీగా నియమించుకున్నారు. ప్రభాకరరావు అప్పటికే పదవీ విరమణ చేసినా ఆయననే ఎస్ఐబీ చీఫ్‌గా నియమిస్తూ నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అడ్డగోలుగా జీవో ఇచ్చారు. మరో రిటైర్డ్ అధికారి రాధాకృష్ణరావును టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. వీళ్లందరూ చట్టవిరుద్ధంగా వ్యవహరించి కేసీఆర్ సేవలో తరించారు. ఫోన్ ట్యాపింగ్ జాబితాను ప్రతి ఆరు నెలలకు ఉన్నత స్థాయిలో సమీక్షించాలి. ఈ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. ఏయే సందర్భాలలో కాల్ డేటా సేకరించవచ్చు, ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చు అన్న విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు విధించి రాష్ట్రాలకు పంపింది. అయినా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలోని కమిటీ ఇవేమీ పట్టించుకోకుండా గుడ్డిగా ఆమోదించింది. అత్యవసర పరిస్థితులలో ఐజీ, ఆ పైస్థాయి అధికారి మాత్రమే ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించవచ్చు. ఈ కేసును సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపితే నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆ కమిటీలోని ఇతర అధికారులతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులను శిక్షించాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారంతా ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. సాక్షిగా సంతకం చేయడానికి కూడా శాంతికుమారి వంటి వారు నిరాకరిస్తున్నారు. సిట్ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రానికి తిరిగి వచ్చిన ప్రభాకరరావును విచారిస్తున్నారు. అయితే ఆయన నోరు విప్పకపోగా అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌ను అడగండి అని బుకాయిస్తున్నారు. అనిల్‌ను అడిగితే తాను పేరుకు మాత్రమే ఇంటెలిజెన్స్ చీఫ్‌ని అని, అంతా ప్రభాకరరావు చూసేవారని చెబుతున్నారు. ప్రస్తుతం సిట్‌కు ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆ స్థాయి అధికారులు ఏం ప్రశ్నించగలరు? ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్నప్పుడు వాడిన ఫోన్లను ఇవ్వమని సిట్ అధికారులు కోరగా, అమెరికాలో మరచిపోయానని ప్రభాకరరావు చెబుతున్నారు. కేంద్రం జారీ చేసిన నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేలు, ఎంపీల ఫోన్ నంబర్లను ట్యాప్ చేయకూడదు. అలా చెయ్యాలంటే పెద్ద తతంగమే ఉంటుంది. దీంతో ప్రభాకరరావు బృందం కేవలం ఫోన్ నంబర్లను మాత్రమే సర్వీస్ ప్రొవైడర్లకు, రివ్యూ కమిటీకి పంపేవారు. ఇలా పంపిన కొన్ని జాబితాలపై నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ సంతకం లేదు. ఇక నాకు సంబంధించినంత వరకు రెండు సంవత్సరాల కాల్ డేటా తెప్పించుకున్నారు. ఇది అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు విరుద్ధం. మావోయిస్టులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారి జాబితాలో నా ఫోన్ నంబర్ చేర్చారు. 2018 ఎన్నికలకు ముందు సెప్టెంబరు మాసంలో నా ఫోన్ సంభాషణలను నేరుగా విన్నారు. నా ఫోన్ మాత్రమే కాదు, మరికొందరు మీడియా యజమానుల ఫోన్లనూ ట్యాప్ చేశారు. తమాషా ఏమిటంటే, ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఫోన్ ట్యాపింగ్ చేసిన అధికారులను బురిడీ కొట్టించింది బీజేపీ ఎంపీ రఘునందనరావు ఒక్కరే. ఎన్నికల సందర్భంగా ఆయన ఫోన్ కూడా ట్యాప్ చేశారు. అయితే అధికారులను తప్పుదారి పట్టించడం కోసం ఆయన ఫలానా కారులో డబ్బు పంపుతున్నానని అవతలి వ్యక్తికి చెప్పారు. ఆ వెంటనే అధికారులు సదరు నంబరు కారును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏమీ దొరక్కపోవడంతో కారును విడి భాగాలుగా ఊడదీసి మరీ తనిఖీ చేశారు. అయినా ఏమీ దొరక్కపోవడంతో తాము బోల్తా పడ్డామని సదరు అధికారులు తెలుసుకున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులకు న్యాయం జరగాలన్నా, నిందితులకు శిక్ష పడాలన్నా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తు చేయాలి. ఈ అరాచకానికి కర్త, కర్మ, క్రియ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నది అందరికీ తెలిసిందే. అయితే ఆయనకు వ్యతిరేకంగా ఒక్కరు కూడా నోరు విప్పడం లేదు. ఎవరి ఆదేశాలతో, ఎవరి కోసం ఇన్ని వందల ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నా ప్రభాకరరావు మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా అయితే ప్రస్తుత దర్యాప్తు వృథా ప్రయాసే అవుతుంది. గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్టుగా ఈ ఎపిసోడ్ మిగలకూడదు అంటే తగు నిర్ణయం తీసుకోవలసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే. చూద్దాం ఏం జరుగుతుందో. కేసీఆర్ అండ్ కో సేఫ్‌గా ఉంటారా? జైలుకు వెళతారా? అన్నది కాలమే చెప్పాలి!



శోధన, బోధనలో దొణప్ప వెలుగులు

'విద్యార్థి ఎంత ఎదిగితే దేశం అంత ఎదిగి సుభిక్షమవుతుంద'నే సూత్రాన్ని ఆచరించి అందరికీ మార్గదర్శకంగా నిలిచిన గురు సార్వభౌముడు ఆచార్య తూమాటి దొణప్ప. భాషాశాస్త్రానికి తెలుగులో తగిన పుస్తకాలు దొరకని రోజుల్లో తేలికగా అర్థమయ్యేలా, ఆసక్తి కలిగించేలా బోధించిన భాషాశాస్త్ర పండితుడు దొణప్ప. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రాకట్ల గ్రామంలో తూమాటి సంజీవప్ప, తిమ్మక్క దంపతులకు 1926, జూలై 1న జన్మించారు. పుట్టినప్పుడు ఆయనకు దొణతిమ్మరాయచౌదరి అని పేరు పెట్టారు. పాఠశాల రికార్డుల్లో మాత్రం దొణప్ప అని పేరు మార్చారు. బాల్యంలో భీమప్పగారి వద్ద సంస్కృతాంధ్రాలు చదివారు. భారత, భాగవత రామాయణాలు గురువుగారి నేతృత్వంలో అధ్యయనం చేశారు. వజ్రకరూర్‌లో 1939–42 మధ్య విద్యాభ్యాసం చేశారు. 1946లో ఉరవకొండ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశారు.

అనంతపురంలో ఇంటర్మీడియట్ చదివారు. అక్కడే చిలుకూరి నారాయణ రావు పాఠాల వల్ల పరిశోధనపై ఆసక్తి కలిగింది. ఆపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఎ. ఆనర్స్‌లో గంటిజోగి సోమయాజి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి వంటి ఉద్దండ పండితుల నేతృత్వంలో చదువు కొనసాగింది. ఆనర్స్‌లో 'ద్రవిడియన్ ఫిలాలజీ అండ్ జనరల్ లింగ్విస్టిక్స్'ను ప్రత్యేకాంశంగా చదివారు. గంటిజోగి సోమయాజి పర్యవేక్షణలో తెలుగులో 'వైకృత పద స్వరూప నిరూపణము' అనే అంశంపై పరిశోధన చేశారు. 1958లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకుడిగా చేరి భాషా శాస్త్ర బోధనలో తనదైన శైలిలో బోధించ ప్రారంభించారు. తరగతి గదిలో చెప్పిన పాఠం పరీక్షల వరకూ గుర్తుండేలా బోధించేవారు.

గుంటూరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పీజీ సెంటర్‌ను విశ్వవిద్యాలయంగా మార్చే ప్రక్రియలో 1976లో అధ్యాపకుల బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో తన వద్ద పని చేస్తున్న పరిశోధక విద్యార్థి బృందంతో సహా 1976 సెప్టెంబర్ 11న కొత్తగా నామకరణం చేసిన నాగార్జున విశ్వవిద్యాలయానికి వెళ్లారు. అక్కడే శాఖాధిపతిగా, విశ్వవిద్యాలయ కళాశాలకు ప్రిన్సిపల్‌గా, రిజిస్ట్రార్‌గా పలు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏ పదవిలో ఉన్నా క్లాసు టైమ్‌కి మాత్రం తప్పక వచ్చి పాఠాలు చెప్పిన మహామహోపాధ్యాయుడాయన. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలుగు కళలు, చారిత్రక వారసత్వ సంపదల పరిరక్షణకు ఒక విశ్వవిద్యాలయం స్థాపించాలని భావించారు. 1986 జనవరి 8న తెలుగు విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి, తొలి వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య తూమాటి దొణప్పను నియమించారు. ఈ విశ్వవిద్యాలయం కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకూడదని తెలుగు భాషా సాహిత్యంతో పాటు, కళలు, జానపద కళలు, పురావస్తుశాఖ మొదలైన అధ్యయనాలను అభివృద్ధి చేయాలని శ్రీశైలం, కూచిపూడి, రాజమండ్రి, వరంగల్ ప్రాంతాల్లో నాలుగు అనుబంధ శాఖలు ఏర్పాటు చేశారు.




బాధ్యతాయుతమైన ఉపకులపతిగా ఉన్నా, రచనా వ్యాసంగం కొనసాగించారు. ఆయన ఏ రచనా ప్రక్రియ ప్రారంభించినా ఆమూలాగ్రం పరిశోధించి చికిలీపట్టి, నగిషీ చేయగల సమర్థుడు. ఆయన రచనల్లో అధిక భాగం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డులు, ప్రత్యేక పురస్కారాలు పొందిన రచనలే. వాటిల్లో ఆంధ్ర సంస్థానాలలో సాహిత్య పోషణ, భాషా చారిత్రక వ్యాసావళి, జానపద కళాసంపద, తెలుగు హరికథా సర్వస్వం, తెలుగులో కొత్త వెలుగులు, ఆకాశ భారతి, వైకృత పద స్వరూప నిరూపణము, బాలల శబ్ద రత్నాకరములతో పాటు సంపాదకుడిగా తెలుగు వ్యుత్పత్తి పదకోశము, త్రివేణి, మాండలిక వృత్తి పద కోశము, అన్వేషణ మొదలైన ముద్రిత గ్రంథాలున్నాయి. దొణప్ప రచించిన మూడు వేల పుటలకు పైగా అముద్రిత రచనలను ముద్రించే యత్నాలు శతజయంతి కమిటీ నేతృత్వంలో కొనసాగుతున్నాయి. ఆయన పర్యవేక్షణలో తెలుగు వారి ఇంటిపేర్లు, ఊర్ల పేర్లు, సంప్రదాయ ఆధునిక కవుల రచనలు, క్రైస్తవ, ముస్లిం, జైన, బౌద్ధం, తెలుగు–సంస్కృత వ్యాకరణాలు మొదలైన పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. ఉద్యోగ విరమణానంతరం ప్రత్యేక అనుమతితో ఆయన వద్ద పలువురి పరిశోధనలు కొనసాగాయి.

ఆచార్య దొణప్ప నేతృత్వంలో అరవై మందికి పైగా పీహెచ్‌డీ డిగ్రీలు పొందారు. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా నిత్యం తెలుగు భాషా పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చేవారు. పీహెచ్‌డీ పొందినవారి నుద్దేశించి 'పీహెచ్‌డీ పట్టా పరిశోధనకు తొలిమెట్టు. అనంతరం అధిరోహించి పరిశోధించవలసినది ఎంతో ఉంది' అని చెప్పేవారు. గురువులకే గురువుగా, తెలుగు భాషా సాహిత్యాన్ని జీవిత పరమార్థంగా భావించి జీవించిన ఆచార్య దొణప్ప 1996 సెప్టెంబరు 6న విజయవాడలో తనువు చాలించారు. ఆయన శిష్య బృందం ప్రపంచవ్యాప్తంగా విస్తరిల్లి నేటికీ ఆయన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఆచార్య తూమాటి దొణప్ప శతవత్సరాన్ని (1926–2025) పురస్కరించుకుని ఆయన కుటుంబసభ్యులు, విద్యార్థులు, అభిమానులు ఏడాది పొడవునా శతజయంతి వేడుకలు, సదస్సులు, తెలుగు భాషా సాహిత్య కార్యక్రమాలు జరపడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. శత జయంత్యుత్సవాలు జూలై 1, 2025న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభమవుతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో, పలు సాహిత్య సంస్థల ద్వారా 'ఆచార్య దొణప్ప శతజయంతి సాహిత్య వేడుక'ల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధమయినాయి. తెలుగు భాషా సాహిత్య ఆచార్యునికి సాహిత్య అభిమానులు, అంతేవాసులు ఏడాదిపాటు నిర్వహించే తెలుగు భాషా సాహిత్య సభలు, అముద్రిత గ్రంథాల ప్రచురణ కొత్త వెలుగులు చూపుతాయనడంలో సందేహం లేదు.

▪ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

(జూలై 1 నుంచి ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలు)



గాజర్ల రవి ఆశయాలు సాధించుకుందాం

- నినదించిన రాజకీయ, పౌర సంఘాల నేతలు, ప్రజలు
- వెలిశాలలో సంస్మరణ సభ
- భారీగా తరలి వచ్చిన జనం

6



అలా నా కల నెరవేరింది..!

- అమెరికాలో ప్రముఖ కంపెనీలో ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు
- దేశాన్ని వీడవద్దనే లక్ష్యంతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో ఇంజనీర్‌గా చేరా
- ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో సివిల్స్‌లో ర్యాంకు సాధించా
- వరంగల్ గొప్ప చరిత్ర కలిగిన ప్రాంతం.. ఇక్కడి ప్రజలు చాలా షార్ప్
- ప్రజలకు దగ్గరగా ఉండేలా పోలీసింగ్ చేపడుతున్నాం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ప్రజలకు సేవ చేయాలనే సంకల్పమే ఐపీఎస్‌ను చేసింది

ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించారు.. అమెరికాలో మంచి కంపెనీలో ఉద్యోగం ఆఫర్ వచ్చింది.. కానీ, స్వదేశంపై మమకారంతో అమెరికా ఉద్యోగం వద్దనుకున్నారు.. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. అయితే ప్రజలకు సేవ చేయాలంటే ఇంజనీరింగ్ కాదు, ప్రజలకు దగ్గరగా ఉండే పోలీస్ ఉద్యోగం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యోగం చేస్తూనే రోజు నాలుగైదు గంటలు మాత్రమే చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐపీఎస్ అధికారయ్యారు. అమ్మానాన్న, చెల్లి, బావ అందరూ టీచింగ్ వృత్తిలోనే ఉన్నారు. అయితే మేనమామ పోలీస్ కొలువులో ఉండటంతో ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఐపీఎస్ సాధించి, ప్రజలకు సేవ చేయాలనే కలను సాకారం చేసుకున్నారు. ఆయనే వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్. వరంగల్ అంటే ఒక చరిత్ర, ఇక్కడ ప్రజలు చాలా షార్ప్.. అంటున్న సన్‌ప్రీత్‌సింగ్ అంతరంగం ఆయన మాటల్లోనే..



▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మాది పంజాబ్‌లోని పాటియాల ప్రాంతం. నాన్న జర్నయిల్‌సింగ్.. అమ్మ అమర్‌జీత్ కౌర్. ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలోనే ఉన్నారు. వారితో పాటు చెల్లి మాన్‌ప్రీత్ కూడా టీచరే. బావ సిమ్రాన్‌జిత్ ప్రొఫెసర్. టీచింగ్ ఫ్యామిలిలో నేను ఒక్కడినే పోలీస్‌ను అయ్యాను. అమ్మనాన్నలు ఇద్దరు ఉద్యోగులే కావటంతో వారికి ఉండే బదిలీలతో నా చదువు కూడా అనేక స్కూల్స్ మారుతూ వచ్చింది. 10వ తరగతి వరకు పాటియాల జిల్లాలో ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో విద్యాభ్యాసం చేశాను.

పంజాబ్‌లో 8వ తరగతికి కూడా బోర్డు పరీక్షలు ఉండేవి. అప్పట్లో 8వ తరగతిలో జిల్లా టాపర్‌గా నిలిచాను. ఆ తరువాత 10వ తరగతి, ఇంటర్‌లో కూడా టాపర్‌గా నిలిచాను. ఇంటర్ పూర్తయ్యాక పాటియాలలోని థాపర్ ఇనిస్టూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (టీఐఈటీ)లో చేరాను. బీటెక్ (ఎలక్ట్రికల్) పూర్తి చేశాను.

తొలి వేతనం అమ్మనాన్నలకే..

అమ్మనాన్నలతో నాకు ఎంతో అనుబంధం ఉంది. వారికి ఎప్పుడు దూరంగా ఉండాలనే ఆలోచనే ఉండేది కాదు. కానీ, ఉద్యోగ రీత్యా తప్పటం లేదు. 2007లో ఇంజనీర్‌గా వచ్చిన తొలి వేతనం రూ.50వేలు అమ్మ, నాన్నలతో పాటు నాన్నమ్మ, తాతయ్యలకు అనేక వస్తువులు తీసుకుని గిఫ్టుగా అందించాను. పోలీస్ ఉద్యోగంలో వచ్చిన తొలి వేతనాన్ని కూడా అమ్మ, నాన్న, చెల్లికి గిఫ్టులు అందించాను. 2015లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన డెంటిస్టు డాక్టర్ దీప్తితో వివాహం అయింది. మాకు సంద్రిప్తి, అమితేజ్‌సింగ్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాదిలో ఒకటిరెండు కార్యక్రమాలకే పంజాబ్ వెళ్లుతున్నాం. చాల కార్యక్రమాలకు వెళ్లటం కుదరకపోవటంతో బాధగానే ఉన్నప్పటికి, ప్రజలకు దగ్గరగా ఉండి సేవ చేస్తున్నామనే సంతృప్తి ఉంది. ఏఎస్పీ నుంచి పోలీస్ కమిషనర్‌గా అనేక ప్రాంతాల్లో పని చేశాను. ప్రజలను నేరుగా కలవటం, వారి సమస్యలను అడిగి తెలుసుకోవటమంటే ఇష్టం. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ట్రైనింగ్ సమయంలో వృద్ధ దంపతులు నా వద్దకు వచ్చి. తమను కొడుకు పట్టించుకోవటం లేద ని తెలిపారు. వెంటనే అతన్ని వెతికి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశా.. తల్లిదండ్రులకు సేవ చేయడం కొడుకుగా నీ బా ధ్యతని గుర్తు చేశాను. తరువాత నేనా (మిగతా 6వ పేజీలో)

అమెరికాలో అవకాశం వచ్చినా..

2007లో థాపర్ యూనివర్సిటీలో బీ.టెక్‌లో గోల్డ్‌మెడల్ సాధించాను. దీంతో అమెరికాలోని కాలిఫోర్నియలో ఓ ప్రముఖ కంపెనీలో జాబ్ వచ్చింది. అయితే భారతదేశాన్ని వీడి వెళ్లాలని అనిపించలేదు. దేశానికి సేవ చేయాలని నిర్ణయించుకుని అమెరికా ఉద్యోగాన్ని వదులుకున్నా. అదే ఏడాది ఇండియన్ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌గా ఉద్యోగం వచ్చింది. రూ.55వేలకు పైగా వేతనం వచ్చేది. అయితే ఆఫీసు, ఇంటికే ఉద్యోగం పరిమితం అయింది. అమ్మ, నాన్న, చెల్లి అందరూ టీచింగ్ వృత్తితో సమాజానికి ఎంతో కొంత సేవ చేస్తున్నారు. మా మేనమామ ఒకరు ఎస్పీగా రిటైర్డ్ అయ్యారు. అయనకు ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. పోలీస్ అయితే ప్రజలకు దగ్గరగా వారికి సేవ చేయవచ్చునని అనిపించింది. అయితే పోలీస్ కావాలంటే సివిల్స్‌లో ర్యాంకు సాధించాలి. ఇటు ఉద్యోగం చేస్తూ సివిల్‌కు ప్రిపేర్ కావటం కొంచెం కష్టంగా ఉండేది. అందుబాటులో ఉన్న బుక్స్ చదువుకుంటు ఉద్యోగం చేశాను. 2009లో మొదటి సారిగా సివిల్ పరీక్ష రాశాను. ఇంటర్వ్యూ వరకు వెళ్లాను కానీ, సెలక్ట్ కాలేదు. దీంతో ఐపీఎస్ కావాలనే పట్టుదల మరింత పెరిగింది. ఉద్యోగం చేస్తూనే రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలే టైమ్ అడ్జెస్ట్ చేసుకుని చదవటం ప్రారంభించాను. ఎలాంటి కోచింగ్‌లు లేవు.. ప్రత్యేకంగా క్లాసులు లేవు. పట్టు వదలకుండా చదవటంతో 2010-11లో సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యాను. ప్రజలకు దగ్గరగా ఉండే ఉద్యోగం కావాలనే నా టార్గెట్‌ను రీచ్ అయ్యాను. ఏపీ క్యాడర్‌కు పంపించటంతో ఆదిలాబాద్ జిల్లాలో ట్రైనింగ్ పూర్తి చేశాను.

అంతరంగం

'కొండా' అనుచరుల భారీ కాన్వాయ్

గాంధీ భవన్‌కు తరలివెళ్లిన పార్టీ శ్రేణులు



మల్లు రవిని కలిసి ఫిర్యాదు చేస్తున్న కొండా మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కొండా దంపతుల అనుచరులు, అభిమానులు సుమారు 500 మంది శనివారంహైదరాబాద్ గాంధీభవన్‌కు తరలివెళ్లా రు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మె ల్సీ కొండా మురళీధర్‌రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో భారీ కాన్వాయ్‌తో గాంధీభన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కొండా మురళి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిని కలిశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ ఇటీవల తనకు తెలియకుండా నియోజకవర్గంలో చేస్తున్న కార్యక్రమాలు, పదవులు ఇప్పించుకోవడం, తనపై చేస్తున్న ఆరోపణల గురించి కమిటీకి 16 పేజీలతో లిఖితపూర్వకంగా వివరించి ఫిర్యాదు చేశారు.

ఊరు ఒకటే.. పేర్లు రెండు

- రికార్డులో ఒకలా.. వాడుక భాషలో మరోలా
- లోకల్ పేర్లకే ప్రాధాన్యమిస్తున్న గ్రామీణులు
- చిత్ర విచిత్రంగా ధ్వనించే పదాలు

7



విలేకరుల సమవేశంలో మాట్లాడుతున్న తక్కళ్ళపెల్లి శ్రీనివాస్‌రావు

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం

- కమ్యూనిస్టులు ప్రశ్నించే గొంతుకలు
- రోడ్లు వేసినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లా
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టుల బలం ఉన్న ప్రతీ చోట పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీపీఐరాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపెల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం ఎల్కతుర్తి,కమలాపూర్, భీమదేవరపల్లి మండలాల ముఖ్య నాయకులతో స్థానిక సంస్థల సన్నాహక సమావేశం సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్ అ ధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రా వు మాట్లాడారు. అసెంబ్లీలో (మిగతా 8వ పేజీలో)

ఇంటికి పిలిపించి.. మద్యం తాగించి..



నవీన్‌కుమార్ (ఫైల్)

- కాజీపేటలో వడ్డీ వ్యాపారి దారుణ హత్య
- నిందితుడు గడ్డం ప్రవీణ్‌కుమార్ రైల్వే ఉద్యోగి
- తీసుకున్న అప్పును తీర్చాలన్నందుకు పక్కా ప్లాన్‌తో దాడి
- మృతుడి ఒంటిపై వున్న బంగారు వస్తువులు తీసుకొని పరారీ
- నిందితుడిది మొదటి నుంచి నేరప్రవృత్తే...



ప్రవీణ్‌కుమార్ ఇంటిలో హత్యకు గురైన వడ్డీ వ్యాపారి నవీన్‌కుమార్

కాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వడ్డీకి ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమన్నాడన్న కోపంతో ఓ వడ్డీ వ్యాపారిని హనుమకొండ జిల్లా కాజీపేటలో ఓ రైల్వే ఉద్యోగి కత్తితో పొడిచి చంపాడు. అనంతరం శవంపై వున్న బంగారు వస్తువులను తీసుకొని ఉడాయించాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన ఇలా ఉన్నాయి.. వరంగల్ గిర్మాజిపేటకు చెందిన త్రిపురాది నవీన్ కుమార్(55) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. గత కొన్ని సంవత్సరాలుగా కాజీపేటలోని పలువురు వ్యాపారస్తులకు, రైల్వే ఉద్యోగులకు వడ్డీకి అప్పులు ఇస్తున్నాడు. ఈ క్రమంలో కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో ఉండే రైల్వే ఉద్యోగి గడ్డం ప్రవీణ్‌కుమార్‌కు ఆరు నెలల క్రితం రూ.50 వేలు అప్పుగా ఇచ్చాడు. అయితే వడ్డీకి ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి పెంచడంతో ప్రవీణ్‌కుమార్ కక్ష పెంచుకున్నాడు. మద్యం తాగుతామని నవీన్‌కుమార్‌ను శుక్రవారం తన ఇంటికి పిలిపించి ఫుల్లుగా మద్యం తాగించాడు. మద్యం మత్తులో ఉన్న నవీన్‌కుమార్‌పై కత్తితో తలపై, మెడపై దాడి చేశాడు. దీంతో నవీన్‌కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం నవీన్‌కుమార్ మెడలో ఉన్న 55 గ్రాముల బంగారు పులిగోరు లాకెట్, 25 గ్రాముల బంగారు రుద్రాక్షమాల, 40 గ్రాముల 8 చేతి ఉంగరాలు, 35 గ్రాముల చేతి కడియం, వస్తువులను తీసుకుని ప్రవీణ్‌కుమార్ పాయిపోయాడు. బంగారం మొత్తం విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విచారించి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శనివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య త్రిపురాది మాధవి ఫిర్యాదు మేరకు కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మొదటినుంచి గడ్డం ప్రవీణ్‌కుమార్‌ది నేరప్రవృత్తే. ఓ మహిళా రైల్వే ఉద్యోగితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో అతడి భార్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

వీరికి ఒక బాబు ఉన్నాడు. బాలుడు అమ్మమ్మ వద్ద ఉంటున్నట్లు స్థానికులు చెప్పారు. పలు నేరాలతో సంబంధం ఉన్న ప్రవీణ్ కుమార్ పలు కేసుల్లో సస్పెండై తిరిగి ఉద్యోగంలో చేరాడు. శుక్రవారం రాత్రి నవీన్‌కుమార్‌ను ప్రవీణ్‌కుమార్ ఒక్కడే హత్య చేశాడా... ఎవరైనా సహకరించారా.. అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

వరంగల్ ఏఎస్పీగా శుభంప్రకాశ్



- 2022 బ్యాచ్ ఐపీఎస్ అధికారి
- ఏసీపీ స్థాయి పోస్టులో తొలిసారి ఐపీఎస్ నియామకం
- ఉత్తర్వులు జారీ అయిన రోజే బాధ్యతల స్వీకరణ

మట్టెవాడ/వరంగల్ క్రైం, జూన్ 28, (ఆంధ్రజ్యోతి): వరంగల్ సబ్ డివిజన్ ఎఎస్పీగా ఐపీఎస్ అధికారి ఎన్.శుభంప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రి మట్టెవాడలోని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్‌కు చెందిన శుభంప్రకాశ్ ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో ఎఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన బదిలీల్లో ఆయనను ప్రభుత్వం వరంగల్ డివిజన్ ఎఎస్పీగా బదిలీ చేసింది. ప్రస్తుతం ఏసీపీగా వున్న నందిరాం నాయక్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్‌కు మొదటి సారిగా ఐపీఎస్ అధికారిని నియమించడం విశేషం. ఇప్పటివరకు ఇక్కడ డీఎస్పీ ర్యాంకు అధికారులే ఏసీపీలుగా వ్యవహరించారు. ఇటీవల వరంగల్ తూర్పు నియోజక వర్గంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏసీపీ నందిరాంనాయక్ బదిలీ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. వరంగల్‌లో కాంగ్రెస్ (మిగతా 8వ పేజీలో)

కర్కోటక కొడుకు



వినోద (ఫైల్)

- నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోసి నిప్పు
- బ్యాంకులోని డబ్బులు ఇవ్వడం లేదని ఆగ్రహం
- 90 శాతం గాయాలతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి
- సంగెం మండలం కుంటపల్లిలో అమానవీయ ఘటన

సంగెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో ఉన్న డబ్బులు విడిపించి ఇవ్వడం లేదని కన్నతల్లిపై కక్షగట్టిన కొడుకు ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆమెను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతుంది. ఈ సంఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని కుంటపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

సంగెం పోలీసులు, గ్రామస్థులు అందించిన సమాచారం ప్రకారం... కుంటపల్లికి చెందిన ముత్తినేని సాంబయ్య-వినోద దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు ఆయ్యాయి. కుమారుడు సతీష్ కొన్ని నెలలుగా జిల్లాలోని గీసుగొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణంలో సాంబయ్యకు చెందిన వ్యవసాయ భూమి పోయింది. దీంతో ప్రభుత్వం భూమికి సంబంధించిన డబ్బులు అందించింది. అందులో కొంత డబ్బుతో ఖానాపురం మండలం ధర్మారావుపేట గ్రామంలో వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. మిగిలిన రూ.5 లక్షలను సంగెం మండల కేంద్రంలోని బ్యాంకులో డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీతో జీవనం సాగిస్తున్నారు. అయితే తన అవసరాల రీత్యా బ్యాంకులోని డబ్బు విడిపించి ఇవ్వమని తల్లి వినోద, తండ్రి సాంబయ్యను సతీష్ కొన్ని రోజులుగా కోరుతున్నాడు. పలుమార్లు బలవంతం చేయడంతో పాటు దాడులు చేశాడు. దీంతో గ్రామ పెద్దలు సతీశ్‌ను తల్లిదండ్రులకు (మిగతా 8వ పేజీలో)

సమన్వయంతో పనిచేయాలి

అడిషనల్ డీసీపీ రవి

వరంగల్ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బాలల సంరక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీసు కమిషనరేట్ అడ్మిన్ అడిషనల్ డీసీపీ రవి సూచించారు. జూలై 1 నుంచి నెల రోజుల పాటు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ 11వ విడత కార్యక్రమంపై శనివారం కమిషనరేట్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బాలల సంరక్షణ కోసం ప్రత్యేక పోలీసు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వరంగల్ పోలీసుకమిషనరేట్ పరిధిలో 18 సంవత్సరాల లోపు పిల్లలచే ఎవరైనా భిక్షాటన చేయించినా, బాలకార్మికులుగా మార్చినా అటువంటి వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్‌పై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమునేని అనిల్‌చందర్, ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చాణక్య, వినోద్, రజిత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్స్ వరంగల్ , జనగామ నుంచి సుజాత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కీలక పదవిలో పీవీ నారాయణరావు

● తెలుగు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక



వరంగల్ చౌరస్తా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు ఎన్నికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ట్యాక్స్ కన్సల్టెంట్లకు సేవలను అందిస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్‌బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో 54వ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కోటా అమిత్‌కుమార్ తెలిపారు. ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ప్రభుత్వ అధికారుల సమన్వయంతో ప్రజల్లో పన్నులపై అవగాహన కల్పిస్తున్న నారాయణరావును తెలుగు రాష్ట్రాలకు చెందిన సీఏలు అభినందించారు.

పీవీ జయంతి వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించాలి

● పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు



వంగర గ్రామంలో పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీవీ కుటుంబ సభ్యులు, తదితరులు

భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా వంగరతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. శనివారం భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో పీవీ 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలోని పీవీ విగ్రహానికి, ఇంట్లో పీవీ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రిగా ఆశ్రమ పాఠశాలలు, ముఖ్యమంత్రిగా భూ సంస్కరణలు, కేంద్ర మంత్రిగా నవోదయ పాఠశాలలు, ప్రధాన మంత్రిగా ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశ దశదిశను మార్చారని కొనియాడారు. తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ పీవీ పాలన అనంతరం కొనసాగుతున్న ప్రభుత్వాలు ఆయన చూపిన బాటలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. సాఫ్ట్‌వేర్ రంగం పీవీ చొరవనేనన్నారు. నేటి తరం యువత, ప్రజలు, పీవీ జీవిత పాఠాన్ని జీవనంలో ఒక భాగంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామోజు మొండయ్య, చిట్టంపల్లి అయిలయ్య, ఊసకోయిల ప్రకాష్, ఆర్.వెంకట్‌రెడ్డి, చిదురాల స్వరూప, ఒల్లాల రమేష్, తిరుపతిరెడ్డి, సతీష్‌రెడ్డి, గజ్జెల రమేష్, చంద్రారెడ్డి, లక్ష్మీకాంతారావు, కండెసుధాకర్, గోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు మాచర్ల కుమార్, ఊసకోయిల కిషన్, నోముల భిక్షపతి, బొల్లంపల్లి శ్యామ్, శనిగరపు అయిలయ్య, అయిత సాయి, గాజుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

▸▸ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత



హనుమకొండలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సర్వే సంగీత

వరంగల్ మెడికల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంబంధిత ప్రభుత్వవిభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత సూచించారు. శనివారం హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాల వారీగా నమోదవుతున్న మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల వివరాలను సమీక్షించారు. ఎంజీఎంఆస్పత్రిలో నమోదవుతున్న మలేరియా, డెంగీ పాజిటివ్ కేసుల వివరాలను ప్రతీ రోజు 6 గంటలలోపు సంబంధిత జిల్లాల డీఎంహెచ్‌వోలకు అందించాలన్నారు. అలాగే జిల్లాలోని అన్ని సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో హెచ్‌ఎంలతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి అందులో సీజనల్ వ్యాధులు ముఖ్యంగా చేతుల శుభ్రత, ఓఆర్‌ఎస్ ద్రావణం తయారు చేసే విధానం, జ్వరాలు, డయేరియాకు సంబంధించిన ప్రమాదకరమైన లక్షణాల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు.

సామాజిక మాధ్యమాలలో ఈ కార్యక్రమాల గురించి విస్తృత ప్రచారం చేయాలన్నారు. మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా వ్యాధులకు సంబంధించిన సమాచారాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రదేశాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతీ మంగళవారం ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మరింత పటిష్ఠంగా నిర్వహించాలని ఆశాలకు, ఏఎన్‌ఎంలకు సూచించారు. ఉమ్మడివరంగల్ జిల్లాలో బాలికల లింగ నిష్పత్తి చాలా తక్కువగా ఉందని, డీఎంహెచ్‌లో బాధ్యత తీసుకొని తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్, ములుగు, జనగామ, మహబూబాబాద్ డీఎంహెచ్‌వోలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ రవి రాథోడ్, భూపాలపల్లి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక



నర్సంపేటలోని వైద్య కళాశాలలో సమీక్షలో మాట్లాడుతున్న సంగీత

నర్సంపేట : ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సర్వే సంగీతసత్యనారాయణ అన్నారు. నర్సంపేటలోని ప్రభుత్వ వైద్యశాల, వైద్య కళాశాలను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ సత్యశారదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యశారద, ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, వివిధ విభాగాధిపతులు, అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఆస్పత్రి వసతుల కల్పనకు కావలసిన అంశాలపై కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాలలో బోధన, బోధనేతర, ల్యాబ్ సిబ్బందికి కావాల్సిన వసతులపై సమీక్షించారు. వైద్య విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించి వాటి గురించి వివరాలను ప్రిన్సిపాల్ మోహన్‌లాల్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎంసీ నర్సంపేటలో ఉన్న ఆస్పత్రిలోని పలు విభాగాలను కలెక్టర్, వైద్యాధికారులతో కమిషనర్ సందర్శించి అక్కడున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్, ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ఉండాల్సిన సౌకర్యాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు కమిషనర్ సంగీత సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు డాక్టర్ సాంబశివరావు, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీదేవి, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : జడ్జి



మాట్లాడుతున్న జిల్లా మెజిస్ట్రేట్ మరికల్

రాయపర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సీడ్ కంపెనీలు, ఫర్టిలైజర్ షాపులు నాణ్యత లేని, కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా మెజిస్ట్రేట్ మరికల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో రైతులకు, విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన ఎంపిక, కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీల్డ్ ప్యాకెట్‌లో ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ రజిని, సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో వీరభద్రం, రైతులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన రోజే
ఉద్యోగ విరమణ



ఏసీపీ నర్సయ్యకు పూలమొక్క అందిస్తున్న శ్రీనివాస్

వర్ధన్నపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న సున్నాయిల శ్రీనివాస్‌కు శనివారం ఎస్సైగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన శ్రీనివాస్ సోమవారం రోజున ఉద్యోగ విరమణ చేయడం గమనార్హం. పదోన్నతి పొందిన శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్యను కలిసి పూలమొక్క అందజేశారు. శ్రీనివాస్‌ను ఏసీపీ అంబటి నర్సయ్య అభినందించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎఫ్‌డీవో ద్వాలియ

దుసపాటిలొద్ది జలపాతం సందర్శనకు నో పర్మిషన్

వాజేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో ఉన్న దుసపాటిలొద్ది జలపాతం సందర్శనకు అనుమతి లేదని వెంకటాపురం ఎఫ్‌డీవో ద్వాలియ అన్నారు. శనివారం బొగత జలపాతాన్ని సందర్శించిన అనంతరం దుసపాటిలొద్ది జలపాతానికి వెళ్లే కొంగాల మార్గంలో ఏర్పాటు చేసిన ఫారెస్టు చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. దుసపాటిలొద్ది జలపాతానికి పర్యాటకులు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని సూచించారు. జలపాతం వద్ద ఎటువంటి రక్షణచర్యలు లేవనితెలిపారు. శని, ఆదివారాలతో పాటు మిగతా రోజుల్లో కూడా సిబ్బంది చెక్‌పోస్టువద్ద విధులునిర్వర్తించాలని సూచించారు.

ఆభరణాల దొంగ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ సీఐ సురేందర్

గిర్మాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం బంగ్లాతండాకు చెందిన ఇస్లావత్ సురేష్ నగరంలో కూలిపనులు చేస్తున్నాడు. జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో శనివారం జీఆర్‌పిసిబ్బంది రాము, రియాజుద్దీన్, నాగరాజు, ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఎన్.రమేష్ ప్లాట్‌ఫాంపై తనిఖీ చేస్తుండగా సురేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 28.645 గ్రాముల బంగారు ఆభరణాలు లభించాయి. దాంతో పాటు తను నేరాలు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి పోలీసులు బంగారు చైన్, 2 పుస్తెలు, 3 జతల చెవి కమ్మలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.2.86 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

గాజర్ల రవి ఆశయాలు సాధించుకుందాం

● నినదించిన రాజకీయ, పౌర సంఘాల నేతలు, ప్రజలు
● వెలిశాలలో సంస్మరణ సభ
● భారీగా తరలివచ్చిన జనం
● నివాళులర్పించిన ప్రముఖులు



గాజర్ల రవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి

టేకుమట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గాజర్ల రవి ఆశయ సాధనకు కృషి చేద్దామని పలువురు రాజకీయ నేతలు, పౌరసంఘాల నాయకులు, ప్రజలు నినదించారు. బడుగు బలహీన వర్గాలకోసం ప్రాణాలు అర్పించిన రవి జీవితం ఆదర్శమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడిమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మవోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ సంస్మరణ సభ ఆయన స్వగ్రామం భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో శనివారం జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ, పౌర హక్కుల నాయకులు హాజరయ్యారు. గాజర్ల రవి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన సంస్మరణ సభ రోజంతా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు ఆటపాటలతో సంస్మరణ సభ హోరెత్తింది. టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల నుంచి ప్రజలు, గాజర్ల రవి అభిమానులు, మాజీ మావోయిస్టులు, సానుభూతిపరులు పాల్గొని నివాళులర్పించారు. గాజర్ల రవి ఆశయ సాధన కోసం పాటుపడాలని ఈ సందర్భంగా నేతలు పిలుపునిచ్చారు. రవి సోదరుడు గాజర్ల అశోక్ మాట్లాడుతూ పేదలకు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. తన అన్న ఆశయ సాధనకు నిరంతరం పాటుపడతామన్నారు.పేదల కష్టాల్లో పాలుపంచుకొనేందుకు కృషి చేస్తామన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి : గాదె ఇన్నయ్య

మాజీ మావోయిస్టు, భారత్ బచావో జాతీయ నాయకుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ మావోయిస్టు అగ్ర నాయకుడు గాజర్ల రవి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లతో కేంద్రం మావోయిస్టులను పట్టుకొని కాల్చివేస్తోందని దుయ్యబటారు.

నివాళులు అర్పించిన వారిలో..

గాజర్ల రవి సంస్మరణ సభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ, శాసన మండలి బీఆర్‌ఎస్ పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్‌రెడ్డి, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు పద్మిని కుమారి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దొమ్మాటి సాంబయ్య తదితరులుహాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ పాటలతో గాజర్ల రవికి నివాళులర్పించారు.

నేడు స్ట్రీట్ వెండర్స్ ఫుడ్ ఫెస్టివల్

● భద్రకాళి బండ్ వద్ద జన జాతర

వరంగల్ కార్పొరేషన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వరంగల్ మహా నగర పాలక సంస్థ, మెప్మా సంయుక్తాధ్వర్యంలో నగర ప్రజలను నోరూరిస్తున్న స్ట్రీట్ వెండర్స్ ఫుడ్ ఫెస్టివల్ ఆదివారం నిర్వహించనున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భద్రకాళి బండ్‌పై ఈ ఫెస్టివల్ జరుపుతున్నట్టు తెలిపారు. స్ట్రీట్ వెండర్స్ తయారు చేస్తున్న ఆహార పదార్థాల క్రయ, విక్రయాలు జరుగుతాయని చెప్పారు. వరంగల్ నగరంలోని స్ట్రీట్ వెండర్స్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ఈ వినూత్న కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా సహకరించాలని కమిషనర్ తెలిపారు.

ఎంజీఎం ఫార్మసీ సూపర్‌వైజర్ సస్పెన్షన్

వరంగల్ మెడికల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఫార్మసీ విభాగం ఇన్‌చార్జి సూపర్‌వైజర్ వేణును సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27న రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, వైద్య కళాశాలలు, ఆస్పత్రుల మౌలిక సదుపాయాల మానిటరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సంగీత ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించారు. ఈ సమయంలో ఫార్మసీలో ఈ ఔషధి అమలుపై అక్కడున్న ఫార్మసిస్టులను అడిగారు. ఫార్మసీ సూపర్‌వైజర్ వేణు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించారు. ఈ క్రమంలో అతడిని సస్పెన్షన్ చేయాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు. శనివాంరం జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఫార్మసీ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ వేణును సస్పెన్షన్ చేస్తూ ఎంజీఎం సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.

అలా నా కల నెరవేరింది..!

(5వ పేజీ తరువాయి)

విషయాన్ని మరిచిపోయాను. కొద్ది రోజులకు ఆవృద్ధ దంపతులు అనుకోకుండా నాకు కనిపించారు. సార్.. మీరు ఏం చెప్పారో తెలియదు కానీ, నా కొడుకు మమ్మలను బాగా చూసుకుంటున్నారని చెప్పారు. చాలా ఆనందం అనిపించింది. ఇలాంటి సంఘటనలు చాలానే ఉన్నాయి. పేదలకు, సామాన్యులకు సాధ్యమైనంత వరకు నాకున్న పరిధిలో సాయం చేస్తున్నా.

వరంగల్ అద్భుతమైన ప్రాంతం

వరంగల్ ప్రజలు చాలా షార్ప్. అన్ని రంగాల్లో వరంగల్ మేటిగా ఉంది. ఐపీఎస్‌గా శిక్షణ పూర్తయిన తరువాత తొలుత ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో హౌస్ ఆఫీసర్‌గా డ్యూటీ వేశారు. అక్కడి నుంచి 2012లో వరంగల్ ఓఎస్‌డీగా పనిచేశాను. అప్పటి నుంచే ఇక్కడి ప్రజల జీవన విధానాన్ని పరిశీలిస్తున్నాను. ఇతర ప్రాంతాల కంటే వరంగల్ ప్రజలు చాలా షార్ప్‌గా ఉంటారు. ఇక్కడ అనేక ప్రాం తాలు చారిత్రకమైనవి. విద్య, వైద్యం అందుబాటులో ఉంది.

నా సర్వీసులో ఎక్కువ కాలం తెలంగాణలోనే కొనసాగింది. ఏపీలోని నంద్యాల ఏఎస్పీగా 2014లో తొలి పోస్టింగ్ ఇచ్చారు. అదే ఏడాది ఏపీ విభజన జరిగింది. దీంతో తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకోవటంతో 2015లో బెల్లంపల్లి ఏఎస్పీ పోస్టింగ్ ఇచ్చారు. శంషాబాద్ డీసీపీగా, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహించాను. ఎల్‌బీనగర్ డీసీపీగా, ఏజీలో లా అండ్ ఆర్డర్, జగిత్యాల, సూర్యాపేట ఎస్పీగా పని చేశాను. పదోన్నతి రావటంతో వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బదిలీపై రావటం జరిగింది. స్థాయి పెరుగుతున్నకొద్దీ ప్రజలతో సంబంధాలు తగ్గవద్దని, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు చేపడుతున్నాం. యాంటీ డ్రగ్స్‌పై పోరాటం అందులో భాగమే. అంతేకాకుండా ప్రతీ రోజు క్యాంపు కార్యాలయంలో ప్రజలను కలుస్తున్నా. వారి నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారంపై దృష్టి పెడుతున్నా. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇంకా కమిషనరేట్ పోలీసింగ్ వ్యవస్థ రాలేదు. హైదరాబాద్ తరహా పోలీస్ విధానాన్ని ఇక్కడ తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాత పూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టుల్లో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్ల ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్ పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లూ హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోప ముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, పదేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్ల హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురి చేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

తప్పు చేస్తేనే భయపడాలి

- జైలుకు వెళ్తే పొలిటికల్ కింగ్‌లా ఉండాలి
- వర్ధన్నపేట ఎమ్మెల్యేపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వరంగల్ నాని గార్డెన్స్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్షంలో ఉన్న మనల్ని బెదిరిస్తారు.. కేసులు పెడతామని వేధిస్తారు.. తప్పు చేస్తేనే బయపడాలి, జైలుకు వెళ్తే పొలిటికల్ కింగ్‌లా ఉండాలంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శనివారం వరంగల్‌లోని నాని గార్డెన్స్‌లో నిర్వహించిన వర్ధన్నపేట బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యేపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, మూడు సర్వే రిపోర్టులు మనకు అనుకూలంగా వచ్చాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులను తీసుకుందామని, పార్టీని పటిష్ఠం చేయడం కోసం రెండు నెలలు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీలో పనిచేసే వాళ్లకు కచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు తెలంగాణలో ఎమ్మెల్యే ఎన్నికలు పెడితే బీఆర్ఎస్‌కు 100 సీట్లు వస్తాయన్నారు.

రేవంత్ రెడ్డి ఒక మూర్ఖుడని, నోరు తెరిస్తే అన్ని అబద్ధాలే చెబుతారని, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేకపోతున్నాడని ఆరోపించారు. ఇప్పుడు కొన్ని చోట్ల నిధులు, డబ్బులు అందిస్తున్నాడని ఎన్నికలు వస్తున్నాయనే కాంగ్రెస్ కుటిల రాజకీయాలు చేస్తోందన్నారు. వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున సీఎం రేవంత్‌రెడ్డికి డబ్బులు ముడుతున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. సంవత్సర కాలంగా రాహుల్ గాంధీ రేవంత్‌రెడ్డికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు.

ఎమ్మెల్యే, మంత్రులు సీఎం మాట వినడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ ఎప్పుడు కుప్పకూలుతుందో తెలియదంటూ జోస్యం చెప్పారు. ఉద్యమకారులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, సోషల్ మీడియా విధానాన్ని సైతం ప్రోత్సహిస్తూ ఉత్సాహంగా పనిచేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, చింతల యాదగిరి, మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల పార్టీ అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల్లా, నిత్యక్లిన్న అలంకరణలో భద్రకాళి

మూడో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధి గాంచిన వరంగల్ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం 4 గంటలకు నిత్య పూజ, నిత్యాహ్నిక హోమం జరిపించారు. అమ్మవారి దశ మహావిద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి కుల్లా, నిత్యక్లిన్న అలంకరణ చేసి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. అమ్మవారి అలంకరణ గురించి అర్చకుడు భద్రకాళి శేషు వివరిస్తూ.. నారాయణుడు వరహామూర్తి రూపంలో రాక్షసుల బారి నుంచి భూమండలాన్ని కాపాడారని, ఆ వారాహి శక్తే ఈ కుల్లా మాత అని, ఈ తల్లిని ఆరాధించిన వారికి శత్రుబాధ తొలగిపోతుందన్నారు. ఆ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్నతో పాటు సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, శ్యాంసుందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఊరు ఒకటే.. పేర్లు రెండు

- రికార్డులో ఒకలా.. వాడుక భాషలో మరోలా
- లోకల్ పేర్లకే ప్రాధాన్యమిస్తున్న గ్రామీణులు
- చిత్ర విచిత్రంగా ధ్వనించే పదాలు

ఊరు ఒక్కటే.. కానీ పేర్లు మాత్రం రెండు ఉంటాయి.. ఆ రెండు పేర్లలో ఒకటేమో సర్కారు రికార్డులకు పరిమితం కాగా మరోపేరు మాత్రం తరతరాలుగా అక్కడి ప్రజల నాలుకలపై కదలాడుతుంటుంది. ఇలాంటి గ్రామాల వరుస జనగామ జిల్లాలోని ప్రతీ మండలంలో సర్వసాధారణమే.. అయితే రికార్డులోని పేరుతో కాకుండా వాడుక భాషలో పిలిచే పక్కా లోకల్ పేర్లకే స్థానికంగా ప్రాధాన్యమిస్తున్న దానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

లింగాలఘణపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న రఘునాథపల్లి మండల కేంద్రం ఎన్నో ఏళ్లుగా రగంతపల్లెగా వాడుక భాషలో కొనసాగుతోంది. ప్రభుత్వ రికార్డుల్లోనే కాకుండా రైల్వే రికార్డుల్లో సైతం రఘునాథపల్లిగా ప్రభుత్వ గెజిట్ ముద్రితమై అన్ని అధికార పత్రాల్లో కొనసాగుతోంది. కానీ వందలాది ఏళ్ల నుంచి పాతతరం వ్యక్తులకు రగంతపల్లెగానే సుపరిచితం. చుట్టుపక్కల గ్రామాల వారు బస్సెక్కేందుకు బస్టాండ్ వద్దకు వచ్చి నిలబడినప్పుడు మరో పరిచయస్తుడు కలిసి ఎటు వెళ్తున్నావు అని అడిగితే చటుక్కున రగంతపల్లెకు పోతున్నాను అని బదులివ్వడం ఇక్కడ సర్వసాధారణం.



ఇబ్రహీంపురం గ్రామ స్వాగత తోరణం

ఇబ్రహీంపురం.. ఇగురాంపురం

రఘునాథపల్లి మండలంలోనే మరో గ్రామం ఇబ్రహీంపురం.. ఈ గ్రామాన్ని ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పేరుతో కాకుండా 90శాతం మంది ప్రజలు ఇగురాంపురం గ్రామంగా పిలుచుకుంటారు. ఫతేషాపూర్, ఇబ్రహీంపురం గ్రామాలు రెండు పక్కపక్కనే ఉంటాయి. కానీ ఈ రెండు గ్రామాల పేర్లు రికార్డుల్లో ఒక రకంగా ఉండగా స్థానికంగా వ్యవహార భాషలో పేర్లను మార్చుకుని పిలుచుకునే ఆనవాయితీ ఇక్కడ తరతరాలుగా వస్తుండటం గమనార్హం. అదేవిధంగా రఘునాథపల్లి మండలంలోని మరో గ్రామ పంచాయతీ శ్రీమన్నారాయణపురం గ్రామాన్ని స్థానికులు అత్యధికంగా నానపురం గ్రామంగా సంబోధిస్తారు. వాస్తవానికి ఎక్కువశాతం ప్రజలు రికార్డుల్లో ఉన్న పేరుకంటే వ్యవహార బాషలో సాధారణమైంది. నేటి తరం యువతలో మాత్రం ఇప్పుడిప్పుడే కాస్త మార్పు వస్తూ శ్రీమన్నారాయణపురంగా వాడుతున్నారు.

గుమ్మడవెల్లి.. గూడెల్లి

లింగాలఘణపురం మండలం గుమ్మడవెల్లి గ్రామపంచాయతీని చాలామంది ప్రజలు అసలు పేరుతో కాకుండా మా ఊరు గూడెల్లి అంటూ పక్కా లోకల్ పేరుతోనే ఎక్కువగా పిలుస్తుంటారు. గుమ్మడవెల్లి అనే పేరును వాడే వారి సంఖ్య చాలా అరుదు. అదేవిధంగా ఇదే మండలంలోని నేలపోగుల గ్రామాన్ని స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు నాలపోల అని పిల్చుకుంటారు. ఒగ్గు కళాకారుల పుట్టిల్లు మాణిక్యాపురం గ్రామపంచాయతీని చాలా మంది మాన్కపురంగా ప్రజల నాలుకలపై నానుతుంటుంది.



పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామ బోర్డు

ఈరవెన్ను.. ఈరెంటిగా..

పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామాన్ని ఈరెంటి అని పలికితేనే అందరికీ సుపరిచితం.. ఈరవెన్ను గ్రామం ఎలా వెళ్లాలో కాస్త జాడచెప్పండి అని పాతతరాన్ని అడిగితే నోరెళ్లబెడుతారు.. ఈరవెన్నా.. అదెక్కడ అని ఉల్టా ప్రశ్నిస్తారు.. అదే పేరు మార్చి ఈరెంటి ఎక్కడో చెప్పండి అంటే వెంటనే చిరునామాను చెప్పేస్తారు. ఇదే మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామాన్ని స్థానికులతో పాటుగా పరిసర ప్రాంతాల వారు లచ్చినాపురం గ్రామంగా స్థానిక వ్యవహార భాషలో పిలుచుకుంటారు.

ఫతేషాపూర్.. పచ్చాపురం..

రఘునాథపల్లి మండలంలోని ఫతేషాపూర్ గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ దస్త్రాల్లో ఫతేషాపూర్‌గా ఉంటుంది. కాగా అక్కడి స్థానికులు మాత్రం కొత్త వ్యక్తులు కలిసినప్పుడు మీది ఏఊరు అని అడిగితే మాది పచ్చాపురం అని చెబుతారు. ఇదేంటి గ్రామంలోని బోర్డుపై ఫతేషాపూర్ అని ఉంది కదా అని అంటే మేము గిట్లనే పిల్చుకుంటాం.. అని సమాధానమిస్తారు.

ఈరెంటిగానే సుపరిచితం..

మా ఊరుపేరు ఈరవెన్నుగా అన్ని ప్రభుత్వ రికార్డుల్లో ఉంటుంది. కానీ తరతరాలుగా వ్యవహార నామధేయంగా వాడుకలో ఉన్న ఈ రెంటిగా పిలుచుకోవడమే సంతృప్తిగా ఉంటుంది. ఈరవెన్ను అని కొత్త తరం వ్యక్తులే వాడుతుండగా 50ఏళ్ల వయసు పైబడ్డ వాళ్లంతా ఈరెంటి గ్రామంగానే చెప్పుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.



బిర్రు మాణిక్యం, ఈరవెన్ను

గూడెల్లి అంటేనే తెలుస్తుంది..

మా ఊరుకు గుమ్మడవెల్లిగా పేరు ఎలా వచ్చిందో తెలియదు కానీ పూర్వం నుంచి మే మంతా గూడెల్లిగానే పిలుచుకుంటాం.. ఇప్పటి తరం వ్యక్తులు గుమ్మడవెల్లిగా పిలుచుకుంటున్నా గూడెల్లి పిలుపులో ఉన్న మాధుర్యం మాత్రం దొరకదు.



లావు పాపిరెడ్డి, గుమ్మడవెల్లి

దేవరుప్పుల.. దారుప్పుల

జిల్లాలోని అనేక గ్రామాల వ్యవహార భాషలో వాడుకలో ఉన్న లోకల్ పేర్ల వరుసలో ఉన్న గ్రామాల్లో దేవరుప్పుల మండల కేంద్రం సైతం ఉంది. దేవరుప్పులగా ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నా వృద్ధులు, నిరక్షరాస్యులు, గిరిజనులు దారుప్పులగా పిలుచుకుంటారు. ఇదే మండలంలోని పడమటి తండాను పెద్దతండాగా వాడుకలో ఉంది. తరిగొప్పుల మండలంలోని నర్సాపూర్ గ్రామాన్ని రామరాజుపల్లిగా, నర్సింగాపూర్ గ్రామం కొడిశేరుపల్లిగా, మరియాపురం నూతన గ్రామపంచాయతీ అడ్డబాటగా వాడుకలో కొనసాగుతోంది. జఫర్‌గఢ్ మండలంలోని ఏబీ తండా (ఆళ్వార్‌బండ) తండాను శంకర్‌తండాగా, కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామాన్ని ఏనూతుల గా, లక్ష్మక్కపల్లి గ్రామాన్ని లసుమ్‌పల్లిగా జనగామ మం డలం శామీర్‌పేట గ్రామాన్ని శాన్‌పేటగా, పెద్దపహాడ్ గ్రామాన్ని పెద్దపాటిగా, చిల్పూర్ మండలంలోని వెంకటేశ్వరపల్లిని కొత్తపేటగా పిలుచుకోవడం ఇక్కడ స్థానికుల ఆనవాయితీగా వస్తుంటం గమనార్హం.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 19 మందికి జైలు

- కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : గత వారం రోజుల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 19 మంది జైలు శిక్ష అనుభవించారని వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారకులై పలువురు మృత్యువాత పడుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిరంతరం డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించి పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ ట్రెయినింగ్ సెంటర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గత వారం రోజుల్లో ట్రై సిటీలో 368 కేసులు నమోదు కాగా 19 మందికి జైలు శిక్ష, రూ. 5 లక్షల 82 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. 368 కేసుల్లో వరంగల్ ట్రాఫిక్ పరిధిలో 168, హనుమకొండ పరిధిలో 104, కాజీపేట పరిధిలో 95 కేసులు నమోదయ్యాయన్నారు.

సంక్షిప్త సమాచారం..

రిజర్వేషన్లు ప్రకటించాకే ఎన్నికలు జరపాలి

కాజీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరిపించిన తర్వాతే స్థానికసంస్థల ఎన్నికలు జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల పట్ల అన్ని రాజకీయ పార్టీలు సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆవేదన వెలిబుచ్చారు. కాజీపేట ఫాతీమానగర్ వైష్ణవీ గ్రాండ్ హోటల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. నెల రోజుల్లో బీసీల రిజర్వేషన్‌లు నిర్ణయించాలని ఎన్నికల సంఘానికి నివేదించాలన్నారు. బీసీలకు అన్యాయం చేసిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదించకుంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్తుతామన్నారు. మీడియా సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, నాయకులు డా. చిర్ర రాజు, తమ్మెల శోభారాణి, మాదం పద్మజాదేవి, కె. అశోక్ గౌడ్, డా. సంగాని మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూల్చివేత

- వివాదంలో ఉన్న భూమిలో నిర్మించారని ఆరోపణ

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో వివాదంలో ఉన్న భూమిలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును శనివారం గ్రేటర్ మునిసిపల్ అధికారులు కూల్చివేశారు. 2011లో ఏకశిల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే అవుట్ వెంచర్‌లో హనుమకొండకు చెందిన బజ్జూరి శ్యాంసుందర్ సర్వే నంబర్ 1015లో 217 గజాల భూమిని కొనుగోలు చేశారు. అదే సర్వే నంబర్‌లో మోతే సందీప్‌రెడ్డికి తనకు వారసత్వంగా వచ్చిన భూమి అని నోటరీ డాక్యుమెంట్ ద్వారా అదే సర్వే నంబర్ భూమిలో రేకుల షెడ్‌ను నిర్మించారు. అనుమతులు లేకుండా అక్రమంగా షెడ్డు నిర్మించడం పట్ల కోర్టు ఆదేశాలతో బల్దియా అధికారులు షెడ్డును కూల్చివేశారు.

నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆటోలు పార్కింగ్ చేయాలి

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఆటోలను పార్కింగ్ చేయాలని నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారంగా పార్క్ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు హెచ్చరించారు. భీమారంలోని శుభం గార్డెన్‌లో శనివానం హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ సీఐ జి. సీతారెడ్డి, ఎస్సైలు కొంరెల్లి, నారాయణ, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

కల్తీ పచ్చళ్ల పట్టివేత

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి): రసాయనాలు వినియోగించి విక్రయిస్తున్న కల్తీ పచ్చళ్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం ఇంతేజార్ గంజ్ పీఎస్ పరిధిలోని కాశిబుగ్గలో పాడైన, కల్తీ పచ్చళ్లను వివిధ కంపెనీల పేరిట విక్రయించడానికి సిద్ధంగా ఉంచారని సమాచారం మేరకు సోదాలు చేసి సుమారు రూ. 18,29,267 విలువ గల పచ్చళ్లను స్వాధీనం చేసుకొని షాపు యజమానులైన అరుకల శ్రీనివాస్, మార్త శంకర్‌లను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచాలి

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సీసీఈ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ పిలుపునిచ్చారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రాజేందర్‌సింగ్ శనివారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. గైడ్‌షిప్ పొందిన అధ్యాపకులతో పాటు ఇటీవలే ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వెంకన్న, రామకృష్ణారెడ్డి, సమ్మయ్య, సీతారాములు, మహేందర్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఇందిరా దేవి, శ్రీనాథ్, మాజీ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మన్‌కు గాయాలు అనే కథనం ఈ నెల 27న శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో ఎన్‌పీడీసీఎల్ డీఈ సామ్యనాయక్ స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి విద్యుదాఘాతానికి కారకులైన జయగిరి లైన్‌మెన్ కుమారస్వామి, సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఆర్టిజన్ ఉద్యోగి ఎం. యుగేందర్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆర్జేడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ శేషకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, సాయి, హరీష్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ పాఠశాలల ప్రవేశాల ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి) : హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ఎంపిక పోటీలు ముగిశాయి. శనివారం హనుమకొండ జేఎన్ఎస్ వేదికగా ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాల ఎంపిక పోటీలను డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్ఎస్ వేదికగా నిర్వహించిన క్రీడా పాఠశాలల ప్రవేశాల ఎంపిక పోటీల్లో హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 21 మంది బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు త్వరలో హకీంపేటలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్ (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో అప్పయ్య హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టం (పీసీ, పీఎన్‌డీటీ) జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, లింగ వివక్షతో పాటు పీఎన్‌డీటీ, ఎంటీపీ చట్టాల అమలుకు కృషి చేయాలన్నారు. జీఎంహెచ్ గైనకాలజిస్టు రాజేశ్వరి, డాక్టర్లు మంజుల, ఎస్.కవిత పాల్గొన్నారు.

పీవీ సంస్కరణలతోనే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- పలుచోట్ల నరసింహారావు జయంతి వేడుకలు
- పాల్గొన్న నాయకులు, అధికారులు



పీవీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాయిని, తదితరులు

హనుమకొండ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేశాయని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పీవీ జయంతి పురస్కరించుకొని శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వేడుక జరిగింది. నాయినితో పాటు పలువురు జిల్లా కాంగ్రెస్ నాయకులు పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. పీవీ నరసింహారావు సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్నతో పాటు బంక సంపత్, లక్ష్మారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

హనుమకొండ టౌన్ : భారతదేశాన్ని ఆర్థికంగా, శక్తివంతంగా తీర్చిదిద్దిన గొప్ప నేత పీవీ అని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పీవీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిరికొండ మధుసూదనాచారి హాజరై పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీష్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముద్దసాని సహోదర్‌రెడ్డి, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, సీనియర్ నాయకులు జనార్దన్‌గౌడ్, నయీమొద్దీన్, సల్వాజి రవీందర్‌రావు, పున్నం చందర్, దశరథం, విజయ్‌కుమార్, కిరణ్, రాకేష్ యాదవ్,శ్యాంకుమార్, సొరం రఘు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్ : మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు తీసుకున్న ఆర్థిక సంస్కరణలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. శనివారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో పీవీ నాలె డ్జ్ సెంటర్ డైరెక్టర్ జి.కృష్ణయ్య అధ్యక్షత 104వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బైరి నిరంజన్, తెలుగు విభాగాధిపతి మామిడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్‌లో ..

రాంనగర్ : మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 104వ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేటర్ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి సీఎండీ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రభాకర్, మోహన్‌రావు, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

వివరాలు వెల్లడించిన ఏసీపీ నర్సింహారావు


సుబేదారి పీఎస్‌లో నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

హనుమకొండ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సాదిక్ హుస్సేన్ హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఏసీపీ నర్సింహారావు తెలిపారు. శనివారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. సాదిక్ హుస్సేన్ తన పెద్ద నాన్న కుమారుడు ఖాదర్ హుస్సేన్‌కు కుటుంబ అవసరాల కోసం 2016లో రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అందులో కొంత డబ్బులు ఖాదర్ తిరిగి ఇవ్వగా మిగతా డబ్బుల కోసం ఖాదర్ కుమారులైన సోహెల్, బషీర్‌ను సాదిక్ అడిగాడు. ఈక్రమంలో ఇరువురు మధ్య గొడవ జరిగింది. నిత్యం డబ్బుల కోసం వేధిస్తూ మీ మామ షరీఫ్‌ను చంపినట్టి మిమ్మల్ని చంపుతానని సాదిక్ బెదిరించేవాడు. సాదిక్‌తో తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఈ నెల 25న రాత్రి 11 గంటలకు ప్లాన్ ప్రకారం... ద్విచక్ర వాహనంపై సాదిక్ హుస్సేన్ ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపు కొట్టి సాదిక్ హుస్సేన్‌ను బయటకు తీసుకువెళ్లి అతడితో గొడవ పెట్టుకున్న సోహెల్, బషీర్ వాళ్ల బాబాయి అక్రమ్‌కు ఫోన్ చేసి అక్కడికి రప్పించారు. ముగ్గురు కలిసి సాధిక్‌పై ఇటుకలు, రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్టు ఏసీపీ తెలిపారు... సమావేశంలో సీఐ ఎం. రంజిత్‌కుమార్, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలోని ఎంబీఏ విభాగ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాజీపేటలో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

కాజీపేట (ఆంధ్రజ్యోతి) : కాజీపేట నుంచి సోమిడి రోడ్ వైపు సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అంతకు ముందు 63 డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమార స్వామి, సుంచు అశోక్, నాయకులు ఎండీ అంకూస్, భరత్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ పనులతో భద్రకాళి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రకాళి బండ్ పనులను అక్కడి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. భద్రకాళి బండ్‌పై ఇప్పటి వరకు ఏబీసీడీ జోన్ల వారీగా జరిగిన పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అన్నారు. ఇంజనీరింగ్, స్మార్ట్‌సిటీ అధికారులు సమన్వయంలో పను లు చేయాలని అన్నారు. అనంతరం బొంది వాగు నాలాతో పాటు 12 మోరీల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయా జోన్లలో జరుగుతున్న ఎలక్ట్రికల్, సివిల్ వర్క్‌లను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, స్మార్ట్‌సిటి ప్రతినిధులు ఆనందం, శ్రీనివాసరాజు, లక్ష్మారెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డైరెక్టర్లను కలిసిన బీఎంఎస్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్


డైరెక్టర్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఎంఎస్ యూనియన్ నాయకులు

రాంనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్పీడీసీఎల్ నూతన డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌రావు , మధుసూదన్‌లను బీఎంఎస్ అను బంధ సంఘమైన రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్ ఆధ్వర్యంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి రాజయ్య, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌రెడ్డి, సంగీత్‌కుమార్, హనుమకొండ జిల్లా కార్యదర్శి మహేష్, ధనలక్ష్మి, వనజ, వనిత తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు, అధికారుల గుండెల్లో గుబులు

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఇంటెలిజెన్స్ ఆరా ?
- విచారణకు కమిషనర్ ఆదేశం

కార్పొరేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కొత్త కమిషనర్ ఇప్పటికే బల్దియా పరిధిలో పని చేస్తున్న కొందరు అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ఒక వింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన పనుల పురోగతి, జరగాల్సిన పనులు, అవినీతి, అక్రమాలపై కూపీ లాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, శనివారం 'పైసలిస్తేనే 'పాస్' అంటారు' అనే వార్త 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో కొందరు అధికారుల పనితీరుపై కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శనివారం సంబంధిత అధికారులను తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడినట్లు తెలిసింది. గతంలో జరిగిన అవినీతి, అక్రమ బిల్లుల చెల్లింపులపై నివేదిక అందించాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో చెల్లించిన అప్పటి ఎంబీ (మేజర్‌మెంట్ బుక్స్) కూడా తనిఖీ చేయాలన్నారు. కార్పొరేషన్‌లో అవినీతి జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు, రింగు మాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, పాలక వర్గం పెద్దల నుంచి సిఫారసు లెటర్లు పెట్టి బిల్లులు పొందిన వారు జంకుతున్నారు. రెండు సంఘాల నాయకులతో పాటు మరో రెండు బ్యాచ్‌లు ఒకచోట చేరి కొత్త కమిషనర్‌ను నమ్మించడం ఎలా ? పాత పద్ధతి కొనసాగించడం ఎలా ? అని చర్చించుకున్నట్టు తెలిసింది. కార్పొరేషన్‌లో అకౌంట్స్ విభాగం వార్తా కథనం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. కొత్త కమిషనర్ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.. అలాగే ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారులు రహస్యంగా వివరాలు సేకరిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో ఉన్న ఒక్క సీపీఐ ఎమ్మెల్యేనే సమస్యలపై సభలో మాట్లాడుతున్నారన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రోడ్లు వేసినంత మాత్రాన అభివృద్ధి జరిగినట్లు కాదని ప్రజలకు జీవనోపాధి కల్పించినప్పుడే అభివృద్ధి జరిగినట్లని గుర్తు చేశారు.

తెలంగాణకు ముందు తర్వాత ఎలాంటి మార్పులు రాలేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు సాగు నీరు అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దేవాదుల కాలువలు అసంపూర్తిగా ఉండడంతో సాగు నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. గ్రామాల్లో అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా నిరుపేదలను గుర్తించి స్థలంతో పాటు ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కట్టిన డబుల్ బెడ్ రూం ఇండ్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పేదలకు ఇళ్లు కేటాయించడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, నాయకులు తోట భిక్షపతి, ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, రమాదేవి, నకిర్త, ఓదేలు, రాజుగౌడ్, రమేష్, మర్రి శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, మనోహర్, మొండయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కర్కోటక కొడుకు

(5వ పేజీ తరువాయి)

దూరంగా ఉండాలని చెప్పడంతో గత ఏప్రిల్ 1 నుంచి గంగదేవిపల్లిలో ఉంటున్నాడు. బ్యాంకులోని డబ్బును విడిపించి ఇవ్వాలని చెప్పినప్పటికీ తల్లిదండ్రులు వినకపోవడంతో శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటలకు సంగెంలో పెట్రోల్ బంక్‌లో బాటిల్‌లో పెట్రోల్ పోయించుకొని కుంటపల్లిలోని తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వచ్చాడు.

గేటును తొలగించుకొని వచ్చి ఆరుబయట నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోశాడు. దీంతో ఆమె ఉలిక్కి పడి లేచేసరికి నిప్పంటించాడు. పక్కనే నిద్రిస్తున్న తండ్రి లేచి కేకలు వేయడంతో సతీష్ పారిపోయాడు. మంటలను చూసిన స్థానికులు వెంటనే 100కు డయల్ చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గాయాలతో వినోద విలపిస్తుండగా 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు వినోదకు 90 శాతం మేర కాలిన గాయాలయ్యాయని ధ్రువీకరించారు. సతీష్‌పై సాంబయ్య సంగెం ఎస్సై ఎల్.నరేష్‌కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సతీష్ జులాయిగా తిరిగేవాడని గ్రామస్థులు తెలిపారు.

వరంగల్ ఏఎస్పీగా శుభంప్రకాశ్

(5వ పేజీ తరువాయి)

పార్టీలోని గ్రూపు వివాదాలు, మాజీ ఎమ్మెల్సీకి పోలీస్ ఎస్కార్ట్ వ్యవహారం నేపథ్యంలోనే బదిలీ జరిగినట్లు చెబుతున్నారు. కాగా, బదిలీ ఉత్తర్వులు వచ్చిన కొన్ని గంటల్లోనే శుభం ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించడం విశేషం. ఈ సందర్భంగా ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ.షుకూర్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బి.రమేశ్ తదితరులు శుభంప్రకాశ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఐపీఎస్ రాకతో వరంగల్ డివిజన్‌లో శాంతిభద్రతలు చక్కబడతాయని, రాజకీయపరమైన ఆడగాలు సాగవని భావిస్తున్నారు.

కేయూలో ఫీజులు తగ్గించాలని ఆందోళన

కేయూ క్యాంపస్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌డీ స్కాలర్లు ఆందోళనకు దిగారు. శనివారం కేయూ పరిపాలన భవనం ఎదుట తమ రెన్యూవల్ ఫీజులను తగ్గించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గతంలో ఉన్న ఫీజులను ఏకపక్షంగా పెంచడంతో అదనపు భారం పడుతోందని నిరసన వ్యక్తం చేశారు. స్కాలర్లపై ఫీజుల మోత మోపడం సరికాదన్నారు. పెంచిన ఫీజులను తగ్గించి పాత ఫీజులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అలాగే చెల్లింపు గడువును పొడగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కాలర్లు దొగ్గెల తిరుపతి, శంకర్, సుమన్, కె.తిరుపతి, స్వామి, బొచ్చు తిరుపతి, స్వామి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని కోరేవారికే మంచి భవిష్యత్

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది అధికారులు మారినా ప్రజా సంక్షేమాన్ని కోరే ప్రజా నాయకులకే మంచి భవిష్యత్తు ఉంటుందని వారే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదల సంక్షేమాన్ని కోరే కాంగ్రెస్ ప్రభుత్వంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 81 మంది లబ్ధిదారులకు రూ.81,09,396 కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, 25 మందికి రూ.7,20,220 ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చెక్కులను అందజేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో 400 మంది లబ్ధిదారులకు సుమారు రూ.4 కోట్ల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు ఉన్నా వాటికి మిత్తీలు కడుతున్న పేద ప్రజల సంక్షేమాన్ని ఆపకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజల తమ అవసరాల కోసం తమ విలువైన డబ్బును, సమయాన్ని వృథా చేసుకొని తన వద్దకు రావద్దని ఏవైనా సమస్యలుంటే ఎమ్మెల్యే టోల్ ఫ్రీ నంబర్ 80961 07107కు ఫోన్ చేసి సమస్యను వివరించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో తహసీల్దార్ చల్ల ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎండీ.రహీం, ఆర్ఐలు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణిరాజునాయక్, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మని శేఖర్‌రావు, హనుమకొండ కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్ళ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్‌లు బిల్ల ఉదయ్‌కుమార్‌రెడ్డి, మేరుగు రాజేష్‌గౌడ్, చల్ల గోపాల్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు రాజీవ్‌గాంధీ, పల్లె దయాకర్, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, జోరుక పూల, చిర్ర విజయ్, కనపర్తి కిరణ్, మదన్‌గౌడ్, భూక్యా రాజు తదితరులు పాల్గొన్నారు.



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
ప్రైమ్ వీడియో		
హెడ్ ఆఫ్ స్టేట్	ఇంగ్లీష్ చిత్రం	జూలై 2
నెట్‌ఫ్లిక్స్		
బిచ్ వర్సెస్ రిచ్ (సీజన్ 2)	కొరియన్ వెబ్ సిరీస్	జూలై 3
ది శాండ్‌మ్యాన్ (సీజన్ 2)	ఇంగ్లీష్ వెబ్ సిరీస్	జూలై 3
జీ 5		
కాళీధర్ లాపతా	హిందీ చిత్రం	జూలై 4
సోనీ ఎల్‌ఐవీ		
ది హంట్: ది రాజీవ్‌గాంధీ అస్సిస్సినేషన్ కేస్	ఇంగ్లీష్ చిత్రం	జూలై 4
జియో హాట్‌స్టార్		
లా అండ్ ద సిటీ	ఇంగ్లీష్ చిత్రం	జూలై 5

ఓటమి ఎదురైతే...

ఒక్కోసారి అనుకోకుండా ఓటమి ఎదురుకావచ్చు. అంతమాత్రాన నిరాశతో ప్రయత్నాన్ని ఆపకూడదు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ గెలుపు దిశగా ఎలా నడవాలో తెలుసుకుందాం...



- ముందుగా ఓటమిని అంగీకరించాలి. అందుకు దోహదం చేసిన కారణాలను అన్వేషించాలి. దీంతో గెలుపు దిశగా మొదటి అడుగు పడినట్లే.
- గెలుపు కోసం చేసిన ప్రయత్నాలను, పడిన కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. మొదటి ప్రయత్నం మీద గౌరవం ఉంచాలి. ఓటమి బాధ నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి.
- ఓటమికి దారితీసిన కారణాలను విశ్లేషించుకోవాలి. మళ్లీ ఆ తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రతి ఓటమీ ఒక బలమైన పాఠాన్ని నేర్పుతుంది. దాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగడం మొదలుపెట్టాలి.
- ఓటమి బాధతో మానసికంగా కుంగిపోకూడదు. రోజూ యోగా, ధ్యానం, వ్యాయామం చేస్తూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.
- ఓడిపోయామనుకుంటూ ఒంటరిగా ఉండకుండా ఎదురైన సమస్య గురించి మిత్రులు, సన్నిహితులతో చర్చించి పరిష్కారం కోసం ప్రయత్నించాలి. అనుభవజ్ఞులను సంప్రదించాలి.
- స్వీయ నమ్మకాన్ని కోల్పోకుండా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటిని సాధిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి.
- ఓటమి ఎదురైందని అక్కడికక్కడే ఆగిపోకుండా ధైర్యంతో మళ్లీ ప్రయత్నించాలి. ఆగకుండా చేసే ప్రయత్నాలే గెలుపుకు దగ్గర చేస్తాయి.
- అదేపనిగా బాధ పడుతూ సమయాన్ని వృథా చేయకూడదు. పూర్తి సమయాన్ని విజయం సాధించడం కోసమే కేటాయించాలి.
- వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే పుస్తకాలు చదవాలి. సమయానుసారం ఆహారం తీసుకుంటూ సరైన నిద్ర వేళలు పాటించాలి. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఏకాగ్రత కుదురుతుంది. చక్కని పరిష్కార మార్గం దొరుకుతుంది.

ఈ మధ్య విడుదలై... విజయం సాధించిన 'కుబేర' సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ సినిమాలో దాదాపు ప్రతి విభాగంలో అనేకమంది మహిళలు పనిచేశారు. వారిలో ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు వారు కావటం విశేషం. వారిని 'నవ్య' పలకరించినప్పుడు పంచుకున్న అనుభవాలు మీ కోసం...





కుబేర మహిళా విజయం!

ప్రజాస్వామిక వాతావరణంలో...

నా పేరు అమూల్య. డైరక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరక్టర్‌గా పనిచేశా. ఇక్కడ ఒక చిన్న విషయం చెప్పాలి. శేఖర్ కమ్ముల 'హ్యాపీడేస్' విడుదలయినప్పుడు నాకు 12 ఏళ్లు. ఆ సినిమా చూసి డైరక్టర్ కావాలనుకున్నా. పెద్దయిన తర్వాత ఆయన దగ్గర అసిస్టెంట్‌గా పనిచేయటం ఒక గొప్ప అనుభవం. నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లో. ముంబాయిలోని సుభాష్ ఘాయ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో రైటింగ్, డైరెక్షన్‌లలో డిగ్రీ చేశా. ఇండస్ట్రీలో అడుగుపెట్టే సమయానికి నాకు ఎవరూ తెలీదు. పరిచయస్తులు ఇచ్చే సమాచారం ఆధారంగా అవకాశాలు వెతుక్కోవాల్సి వచ్చింది. అయితే అవకాశాలు త్వరగానే వచ్చాయి. 'పరంపర' వెబ్ సిరీస్ డైరక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశా. ఆ తర్వాత శేఖర్‌గారి దగ్గర చేరాను. షూటింగ్ సమయాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా పని చేయాల్సి ఉంటుంది. ఒక విధంగా చూస్తే మహిళలకు అది కష్టమే! కానీ అదృష్టవశాత్తు నేను చేసిన ప్రాజెక్టులలో నాకు పెద్ద కష్టం కాలేదు. 'కుబేర' టీమ్‌లో చాలామంది అమ్మాయిలు ఉండటం దీనికి ఒక కారణం. రెండోది శేఖర్ సార్ అనుసరించే విలువలు. ఆయన దగ్గర మన అభిప్రాయాలను సూటిగా చెప్పవచ్చు. ప్రతి వ్యక్తి అభిప్రాయానికి గౌరవం లభిస్తుంది. ఇలాంటి ప్రజాస్వామిక వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు పెద్దగా ఒత్తిడి అనిపించదు. ఇక ఆయన ఎవరిపైనా చిరాకు పడటం చూడలేదు. డైరక్షన్ అనేది చాలా ఒత్తిడితో కూడుకున్న వ్యవహారం. అంత ఒత్తిడిలోను ఎప్పుడూ ఎవరిపైనా చిరాకు పడేవారు కాదు. ఆయన దగ్గర నుంచి నేను తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన విషయం అది. ఇక 'కుబేర' షూటింగ్ సమయంలో నేను మరచిపోలేని సంఘటన ఒకటి ఉంది. ధనుష్ పాటను 800 మంది జూనియర్ ఆర్టిస్టులతో చిత్రీకరించాం. మా అందరిపైనా విపరీతమైన ఒత్తిడి ఉంది. షూటింగ్ పూర్తయ్యాక... ధనుష్ సర్ వెళ్లిపోయిన వెంటనే అందరం రిలాక్స్ అయిపోయాం. బ్యాండ్ వాళ్లు వాయించటం ఆపలేదు. దాంతో అందరూ డ్యాన్స్ చేయటం మొదలుపెట్టారు. లైట్ బాయ్ నుంచి డైరక్షన్ డిపార్ట్‌మెంట్ వాళ్ల వరకూ అందరూ దాదాపు గంట డ్యాన్స్ చేశారు. నా జీవితంలో మరచిపోలేని సంఘటన అది.



- అమూల్య, డైరక్షన్ డిపార్ట్‌మెంట్

అదే ఆయన ప్రత్యేకత

శేఖర్‌గారు సెట్‌లో పని చేస్తున్నప్పుడు చూడటం నేను మరచిపోలేని అనుభవం. 'కుబేర' నుంచి ఎంతో నేర్చుకున్నా. ఉదాహరణకు... ఒక అసోసియేట్ డైరక్టర్‌ను కాబట్టి నాకు కథ తెలుసు. సీన్లు తెలుసు. కొన్నిసార్లు ఒక షాట్‌ను అనేకసార్లు తీయాల్సి వచ్చేది. శేఖర్ సార్ ఏ షాట్‌ను 'ఓకే' చేశారా?' అని గమనిస్తూ ఉండేదాన్ని. చాలా సందర్భాలలో- ఆయనకు ఒక షాట్ నచ్చేది. కానీ దానితో సంతృప్తి పడేవారు కాదు. నటీనటులకు చిన్న చిన్న మార్పులు సూచించేవారు. ఎడిటింగ్ టేబుల్ మీద చూసినప్పుడు- ఆ మార్పులే మొత్తం సీన్‌ను మార్చేసేవి. శేఖర్ సార్‌కు అంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఎందుకు ఉందో నాకు అప్పుడు అర్థమయ్యేది. అలాగే ఆయనకు జీవితం పట్ల ఉన్న దృక్పథం చాలా గొప్పది. దాని నుంచి చాలా నేర్చుకోవచ్చు. ఎన్ని సవాళ్లు ఎదురైనా- 'వీటిని మనం దాటగలం' అనే ఆత్మవిశ్వాసం ఆయనలో కనిపించేది. ఆఫీసుకు వచ్చిన వెంటనే అందరినీ పలకరించేవారు. పేరు పేరునా "అన్నం తిన్నావా?" అని అడిగేవారు. ఇంకో విషయాన్ని కూడా ఇక్కడ చెప్పాలి. సాధారణంగా షూటింగ్‌లలో మహిళలకు బాత్‌రూమ్‌ల లాంటి సౌకర్యాలు లభించవు. ఎవరైనా డిమాండ్ చేస్తే- "ఇలా అయితే అమ్మాయిలతో పనిచేయటం కష్టం. అడ్జెస్ట్ అయిపోవాలి" అనే కామెంట్‌లు వినిపిస్తూ ఉంటాయి. కానీ 'కుబేర' షూటింగ్‌లో మాత్రం మహిళల కోసం ప్రత్యేకమైన సౌకర్యాలన్నీ కల్పించారు. భవిష్యత్తులో అందరూ ఈ ఒరవడిని పాటిస్తారనుకుంటున్నాను.

- కీర్తి, డైరక్షన్ డిపార్ట్‌మెంట్

అనేక ప్రపంచాలు ఉన్నాయి



నేను పుట్టి పెరిగింది చెన్నైలో. ఇంతకు ముందు ధనుష్ సార్‌కు డిజైనర్‌గా పనిచేశా. శేఖర్ సార్ ఈ సినిమా కథ చెప్పిన వెంటనే వాటిలో ఉన్న ప్రపంచాలు, వాటి మధ్య వైరుధ్యాలు నాకు స్పష్టంగా కనిపించాయి. ఈ వైరుధ్యాలను ఒకేసారి చూపించాలి. ఏ డిజైనర్‌కైనా ఈ చిత్రం ఒక సవాల్ అనే చెప్పాలి. ఇందులో నలుగురు బిచ్చగాళ్లు ఉంటారు. ఒకరు తిరుపతి నుంచి, ఒకరు కేరళ నుంచి, ఒకరు కోల్‌కతా నుంచి, మరొకరు అసోం నుంచి వచ్చిన వారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు దుస్తులు ధరించే విధానం వేరుగా ఉంటుంది. ఈ బిచ్చగాళ్లు వేసుకొనే దుస్తులు వాటిని ప్రతిబింబించాలి. దాని కోసం చాలా రీసెర్చ్ చేయాల్సి వచ్చింది. ఈ నలుగురిలో ఒక అమ్మాయి కూడా ఉంటుంది. ఈ అమ్మాయికి ఎలాంటి దుస్తులు వేయాలనే విషయంపై చాలా చర్చ జరిగింది. సాధారణంగా మనం గ్రామీణ ప్రాంతాల్లో పేదవారిని గమనిస్తే- వారు దుస్తులపైన ఒక గుడ్డను ధరిస్తారు. అది చున్నీ కావచ్చు, తువ్వాలు కావచ్చు. ఈ అమ్మాయికి కూడా అలాంటి దుస్తులనే డిజైన్ చేశాం. వారి దుస్తులు సహజంగా కనిపించటం కోసం చాలా కష్టాలు పడ్డాం. ముందు ఉతికే వాళ్లం. ఎండబెట్టే వాళ్లం. చిరుగులు కోసం రాతి మీద తోమేవాళ్లం. ధనికుల విషయానికి వస్తే మాకు అనేక రిఫరెన్స్‌లు లభించాయి. బాగా ధనికులు గాఢీ రంగులు వేసుకోరు. వారు వేసుకొనే సూట్స్, షర్ట్స్... అన్నీ క్లాసిక్‌గా ఉంటాయి. వారు పెట్టుకొనే వాచ్‌లు, కళ్లజోళ్ల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ సినిమాలో సంక్లిష్టమైన సన్నివేశాలున్నాయి. వాటికి తగ్గట్టుగా దుస్తులను డిజైన్ చేయటం నిజంగా సవాలే! ఒక సీన్‌లో ధనుష్ మడ అడవుల ప్రాంతంలో బాగా తడిసిపోయి రోడ్డు మీదకు వస్తారు. ఆయన దుస్తుల మీద బురద, చిన్న చిన్న ముళ్లు కనిపించాలి. ఇలాంటి చిన్న చిన్న విషయాలలో తీసుకున్న శ్రద్ధ కూడా ఈ చిత్ర విజయానికి కారణమయింది.

- కావ్య శ్రీరాం, కాస్ట్యూమ్ డిజైనర్

పేరు చెప్పినప్పుడు థ్రిల్ అయ్యా...



నేను తోట తరణి గారి దగ్గర పనిచేసేదాన్ని. ఆయన ద్వారానే నాకు 'కుబేర'లో పనిచేసే అవకాశం వచ్చింది. నేను ఇంటర్ దాకా గుంటూరులో చదివాను. ఆ తర్వాత జేఎన్‌టీయూలో... ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేశాను. 'మసుదా' అనే థ్రిల్లర్ సినిమాకు పనిచేశా. ప్రస్తుతం 'ఘాటి', 'హరిహరవీరమల్లు' సినిమాలకు పనిచేస్తున్నా. 'కుబేర' గురించి చెప్పాలంటే- శేఖర్ సార్ గురించి తప్పని సరిగా చెప్పాలి. ఆయన దగ్గర పని చేస్తున్నప్పుడు... 'ఒకరు ఎక్కువ-ఒకరు తక్కువ' అనే తేడా కనిపించదు. అందరికీ తమ అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ లభిస్తుంది. అంతదాకా ఎందుకు... ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో శేఖర్ సార్ మాట్లాడుతూ నా పేరు కూడా ప్రస్తావించారు. నాకు విపరీతమైన థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇక 'కుబేర' షూటింగ్ సమయంలో మేము ఎదుర్కొన్న ఛాలెంజ్ డంప్ యార్డ్ సెట్. దీనిని వీలైనంత సహజంగా తీర్చిదిద్దటానికి ప్రయత్నించాం. స్క్రీన్ మీద నిజంగా డంప్ యార్డ్‌లోనే తీసినంత బాగా వచ్చింది. ఆర్ట్ డిపార్ట్‌మెంట్ అనగానే అంతా మగవాళ్లే అనే అభిప్రాయం ఉంది. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. మహిళా ఆర్ట్ డైరక్టర్లు కూడా వస్తున్నారు. వారందరూ విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

- ఇంద్రాణి, ఆర్ట్ డిపార్ట్‌మెంట్

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఇలా చేస్తే చర్మ రంధ్రాలు కనిపించవు...

చర్మం మీద సహజంగా స్వేద గ్రంథులు అనే సన్నని రంధ్రాలు ఉంటాయి. వీటి ద్వారానే చెమట, జిడ్డు లాంటి మలినాలను చర్మం బయటికి పంపిస్తుంది. కొంతమందిలో ఈ రంధ్రాలు కొద్దిగా పెద్దవిగా తెరచుకుని ఉంటాయి. ముఖ్యంగా ముఖం మీద. వీటివల్ల ముఖం నునుపుగా మెరవదు. వీటిలో మురికి, దుమ్ము లాంటివి చేరి మొటిమలు, గుల్లలు ఏర్పడుతుంటాయి. జిడ్డు చర్మం ఉన్నవారిని ఈ సమస్య అధికంగా వేధిస్తూ ఉంటుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో ఈ రంధ్రాలను శుభ్రం చేసి దగ్గరకు ముడుచుకునేలా చేయవచ్చు.



- చిన్న గిన్నెలో రెండు చెంచాల కలబంద గుజ్జు, మూడు చెంచాల కీరా రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో ముఖమంతా పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి తరవాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే చర్మ రంధ్రాలు పూర్తిగా శుభ్రమవుతాయి. తగినంత తేమ అంది చర్మం బిగుతుగా మారుతుంది. దీంతో చర్మ రంధ్రాలు కుంచించుకుంటాయి.
- గిన్నెలో రెండు చెంచాల ఓట్స్, రెండు చెంచాల పెరుగు వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. దీన్ని ముఖాన్ని పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ మర్దన చేస్తే చర్మం మీద పేరుకున్న మృత కణాలు, రంధ్రాల్లో చేరిన మురికి తొలగిపోతాయి. గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే ముఖం పూర్తిగా శుభ్రపడుతుంది. పెరుగులోని లాక్టిక్ ఆమ్లం చర్మ రంధ్రాలు మూసుకునేలా చేస్తుంది. దీంతో చర్మం నునుపుగా కనిపిస్తుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల ముల్తానీ మట్టిని తీసుకుని దానికి మూడు చెంచాల గులాబీ నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పది నిమిషాల తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే జిడ్డు పూర్తిగా తొలగిపోతుంది. చర్మం నున్నగా మెరుస్తుంది. బాగా పండిన టమాటాలను గుజ్జులా చేసి ముఖానికి ప్యాక్ వేయాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే రంధ్రాలు అసలు కనిపించవు.
- ఒక గిన్నెలో గుడ్డు తెల్ల సొన, ఒక చెంచా నిమ్మరసం వేసి నురుగు వచ్చేలా కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్రష్ సహాయంతో ముఖమంతా పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే చర్మం బిగుతుగా మారుతుంది. రంధ్రాలు కూడా సన్నగా మారతాయి.

సాలె పురుగులతో ఇబ్బందా..?



సాధారణంగా ఇంట్లో పైకప్పు మీద, సామాన్ల మధ్య సాలె పురుగులు గూళ్లు అల్లుతూ ఉంటాయి. ఇవి అంత ప్రమాదకరం కానప్పటికీ వీటివల్ల ఇల్లు అపరిశుభ్రంగా ఉందనే భావన వస్తుంది. ఈ సాలె పురుగులను సులువుగా తొలగించే చిట్కాల గురించి తెలుసుకుందాం...

- అయిదు వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి ఒక స్ప్రే బాటిల్‌లో వేసి నిండుగా నీరు పోయాలి. రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే ఈ నీటిని సాలె పురుగులు గూళ్లు అల్లే ప్రదేశాల్లో పిచికారీ చేస్తే అవి వెంటనే బయటికి వెళ్లిపోతాయి. మళ్లీ రావు.
- కర్పూరం, తులసి, లావెండర్, సిట్రోనెల్లా, పుదీనా నూనెల్లో ఒకదాన్ని తీసుకుని ఒక గ్లాసు నీళ్లలో అయిదు చుక్కలు వేసి బాగా కలపాలి. ఈ నీటిని గది మూలలు, తలుపు సందులు, కిటికీల వద్ద చల్లితే సాలె పురుగులు చేరవు. ఇల్లు సువాసనతో నిండుతుంది.
- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల వెనిగర్ లేదా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ నీటిలో స్పాంజ్ లేదా పలుచని బట్టను ముంచి దానితో ఫర్నిచర్, ఫ్యాన్లు, బల్బులు, తలుపులు తదితరాలను తుడిచేస్తే సమస్య తీరుతుంది.
- గది మూలల్లో, సోఫాకి ఇరుపక్కలా, వంటగది కిటికీలో, బాల్కనీ గోడల మీద పుదీనా, రోజ్‌మేరీ, లావెండర్ మొక్కల కుండీలు ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ మొక్కలు ఇంట్లో తాజాదనాన్ని నింపుతాయి.
- నిమ్మ, కమలాలు, బత్తాయిలాంటి సిట్రస్ పండ్ల తొక్కలను ఎండబెట్టి ఒక గిన్నెలో వేసి గది మూలల్లో ఉంచితే సాలె పురుగులు రావు.
- ఒక చెంచా బేకింగ్ సోడా లేదా పొగాకు పొడి కలిపిన నీళ్లను గది మూలల్లో పిచికారీ చేస్తే వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- కనీసం ఆర్నెలకు ఒకసారి ఇంటిని పూర్తిగా శుభ్రం చేసుకుని అవసరం లేని సామాన్లను తొలగిస్తే సాలెపురుగులు చేరవు.

అందమంతా... బ్లౌజ్ డిజైన్‌లోనే

ఈ మధ్యకాలంలో చీరల కన్నా బ్లౌజ్‌లకు ఎక్కువ ప్రాముఖ్యత లభిస్తోంది. ప్రతి పండుగ సీజన్‌కూ కొత్త కొత్త డిజైన్‌లు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న డిజైన్‌లు ఏమిటో చూద్దాం..



సన్నగా ఉన్నవారికి...

- బ్లౌజ్ చేతులు చిన్నగా ఉంటేనే బాగుంటుంది.
- బోట్ నెక్, కాలర్ నెక్, హైనెక్‌లు బాగా నప్పుతాయి. ఇవి వేసుకుంటే లావుగా కనబడతారు.
- బుట్టచేతులు కూడా బాగుంటాయి. చీరకు ప్రత్యేకమైన అందాన్నిస్తాయి.
- సన్నని చారలు ఉన్న బ్లౌజ్‌లు.... ఆకర్షణీయంగా ఉంటాయి.

బొద్దుగా ఉన్నవారికి..

- డీప్ నెక్ కుట్టించుకుంటే బాగుంటుంది. దీని వల్ల సన్నగా కనబడతారు.
- వీలైనంత వరకు హైనెక్, బోట్‌నెక్‌లు కుట్టించుకోకుండా ఉంటే మంచిది.
- బ్లౌజ్ చేతులు పొడవుగా ఉంటే హుందాగా కనిపిస్తారు.
- వీరికి బుట్టచేతులు నప్పవు.

నెట్టెడ్ బ్లౌజ్‌లు

ఈ తరహా బ్లౌజ్‌లలో చేతులకు.. వెనక భాగానికి నెట్టెడ్ క్లాత్‌ను ఉపయోగిస్తారు. వీటిపై జర్దోసి, జరీ వర్క్‌లను కూడా చేయిస్తారు. సాధారణంగా హైనెక్‌నే కుడతారు. మిగిలిన బ్లౌజ్‌లతో పోలిస్తే వీటి ఖరీదు ఎక్కువ. కుట్టడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది. నెటెడ్ బ్లౌజ్‌లు సన్నగా ఉన్నవారికి బాగా నప్పుతాయి. ఈ బ్లౌజ్‌లపై మెడను పట్టి ఉండే చోకర్స్ కన్నా.. మామూలు నెక్లెస్‌లు అందంగా అమరుతాయి.









ఇండో వెస్ట్రన్ బ్లౌజ్‌లు

ఒక వైపు సంప్రదాయం.. మరో వైపు ఆధునికతలను ఈ ఇండో వెస్ట్రన్ బ్లౌజ్‌లు ప్రతిబింబిస్తాయి. డోరీ, హాల్టర్‌నెక్, మహారాణి నెక్, కాలర్‌నెక్‌లు ఈ బ్లౌజ్‌ల ప్రత్యేకత. బ్యాక్‌లెస్ బ్లౌజ్‌లు ఈ మధ్య బాగా ప్రచారంలోకి వచ్చాయి. హల్దీ, మెహందీ ఫంక్షన్లలో వీటిని ఎక్కువగా ధరిస్తున్నారు.



రాసిల్క్ బ్లౌజ్‌లు

రాసిల్క్ బ్లౌజ్ గుడ్డలు.... అనేక రంగుల్లో మనకు లభిస్తాయి. వీటిని తెచ్చుకుని బ్లౌజ్‌లు కుట్టించి వాటిపై జర్దోసి, జరీ, కర్దానా, స్టోన్ వర్క్‌లను చేయిస్తున్నారు. సాధారణంగా పెళ్లి సమయంలో ఇలాంటి బ్లౌజ్‌లను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. ఈ బ్లౌజ్ డిజైన్‌లలో రాళ్లు, జరీదారాల పనితనం ఉంటుంది కాబట్టి ఖరీదు కూడా ఎక్కువే!



• ఖ్యాతి, హైదరాబాద్, 6300386749

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ట్రైలర్ సిద్ధం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతికృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. జూలై 24న చిత్రం విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. జూలై 3న చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస, సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి.

ఇదో అద్భుతమైన వేదిక

విజయ్ దేవరకొండ



సరికొత్త ప్రతిభను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో నిర్మాత దిల్ రాజు ఏర్పాటు చేసిన వేదిక 'దిల్ రాజు డ్రీమ్స్' వెబ్‌సైట్‌ను శనివారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ఒక అవకాశం ఎంత గొప్పదో నాకు తెలుసు. 'దిల్ రాజు' డ్రీమ్స్ లక్షలాది మందికి ఒక హోప్ ఇచ్చింది. కొత్తవారికి ఇదో అద్భుతమైన వేదిక" అని అన్నారు. మరో ముఖ్య అతిథి, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ "ఇలాంటి వెబ్‌సైట్‌ను నేనింతవరకూ చూడలేదు. కొత్తవారి కోసం ఇలాంటిది లాంచ్ కావడం ఆనందంగా ఉంది" అని చెప్పారు. దిల్‌రాజు మాట్లాడుతూ "ఇండస్ట్రీలోకి రావాలనుకుంటున్న కొత్తవారికి సరైన గైడెన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతో చేసిన ఆలోచనే 'దిల్ రాజు డ్రీమ్స్'. ఇది సినీ ఔత్సాహికులకు సరైన వేదిక అవుతుందని ప్రారంభిస్తున్నాం. అప్లై చేసుకునే వారికి ఆల్ ది బెస్ట్" అని తెలిపారు. నిర్మాత శిరీష్ మాట్లాడుతూ "మీ ప్రతిభతో ఎదిగిన తర్వాత ఇండస్ట్రీని మర్చిపోవద్దు" అని కోరారు.

సోషియో ఫాంటసీ ప్రేమకథ



సోషియో ఫాంటసీ ప్రేమకథతో రూపుదిద్దుకున్న 'దీర్ఘాయుష్మాన్ భవ' చిత్రం జులై 11న విడుదల కానుంది. కార్తీక్‌రాజు, మిస్తీ చక్రవర్తి జంటగా నటించిన ఈ చిత్రానికి పూర్ణానంద్ దర్శకుడు. వంకాయల పాటి మురళీకృష్ణ నిర్మించారు. చక్కటి ఫ్యామిలీ కథతో రెండున్నర గంటలపాటు ప్రేక్షకుల్ని అలరించే వినోదంతో సినిమా ఉంటుందని ఆయన చెప్పారు. సోషియో ఫాంటసీ కావడంతో గ్రాఫిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. 'మా సినిమాలో సీనియర్ నటి ఆమని నటన ఓ హైలైట్. హీరోహీరోయిన్లు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. 'జబర్దస్త్' ఆర్టిస్టుల కామెడీ ఆద్యంతం అలరిస్తుంది' అని దర్శకుడు పూర్ణానంద్ చెప్పారు.

టైటిల్ ఖరారు



అంకిత్ కొయ్య, మానస చౌదరి జంటగా గోపీనాథ్ రెడ్డి దర్శకత్వంలో యూజీ ప్రొడక్షన్స్ బేనర్‌పై కంకణాల ప్రవీణ్‌రెడ్డి నిర్మిస్తోన్న చిత్రానికి 'లవ్ జాతర' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మేరకు టైటిల్ అనౌన్స్‌మెంట్‌పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, సిద్ధార్థ్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

'కన్నప్ప' నిర్మాణం పరమేశ్వరుడి ఆజ్ఞ

- మోహన్‌బాబు



'ఆ పరమేశ్వరుడే 'కన్నప్ప' సినిమా తీయాలని నన్ను ఆజ్ఞాపించాడు. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. నా కుటుంబానికి పరమేశ్వరుడి ఆశీస్సులుండాలి' అని అన్నారు సీనియర్ నటుడు, నిర్మాత మోహన్‌బాబు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'కన్నప్ప' ఇటీవలె విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశంలో మోహన్ బాబు మాట్లాడుతూ 'మా టైమ్‌లో ఓ సినిమాకు ఇన్ని సభలు పెట్టేవాళ్లం కాదు. నటుడిగా 50 ఏళ్లు అవుతోంది. భగవంతుని ఆశీస్సులు ఉండబట్టే ఈ విజయం దక్కింది. అందుకు నా అభిమానులకు ధన్యవాదాలు. నేను చేసిన ప్రతి పాత్రను వారు ఆదరించారు. వారికి నేను రుణపడి ఉంటాను. మా బావ ప్రభాస్ సహా ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు' అని అన్నారు. హీరో మంచు విష్ణు మాట్లాడుతూ 'మా నటీనటులకు కనిపించే దేవుళ్లు ప్రేక్షకులే. 'కన్నప్ప' పెద్ద విజయాన్ని సాధిస్తుంది. ఇదంతా శివలీల. నాకిది భావోద్వేగ ప్రయాణం. ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పాలనే ఈ రోజు మీ ముందుకు వచ్చాను' అని పేర్కొన్నారు.

'కాంటా లగా' షఫాలీ ఆకస్మిక మృతి



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మికంగా మరణించారు. శుక్రవారం రాత్రి అస్వస్థతతో ఉన్న షఫాలీని తన భర్త పరాగ్ త్యాగి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఆమె గుండెపోటుతో మరణించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ విషయాన్ని షఫాలీ కుటుంబ సభ్యులు ధృవీకరించలేదు. ఆమె మరణానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని.. ఈ కేసును అనుమానాస్పదంగానే పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. కాగా, 2002లో వచ్చిన 'కాంటా లగా' అనే రీమిక్స్ పాటతో గుర్తింపు తెచ్చుకున్నారు షఫాలీ. ఆ తర్వాత 'ముజ్సే షాదీ కరోగీ', 'హుడుగరు' సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించారు. 'నాచ్ బలియే', 'బిగ్‌బాస్ సీజన్ 13' వంటి టీవీ రియాలిటీ షోల్లో భాగమయ్యారు.

స్వచ్ఛమైన వంట నూనె ఉత్పత్తే లక్ష్యం

» అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పెడతాం

» ఆయిల్ పామ్ పిప్పితో కరెంటు తయారీ: తుమ్మల



చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లిలో ఆయిల్ పామ్ మొక్కలను నాటుతున్న మంత్రి తుమ్మల

రంగారెడ్డి అర్బన్ జూలై 28 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వచ్ఛమైన, కల్తీ లేని వంట నూనెను అందించడమే లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం దేవుని ఎర్రవల్లిలో 550 ఎకరాల విస్తీర్ణంలో శనివారం మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర హార్టికల్చర్, సెరికల్చర్ డైరెక్టర్ యాస్మిన్‌బాషా, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి మంత్రి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడారు. భూమి ఉన్న ప్రతి రైతు ఆయిల్‌పామ్‌పై దృష్టి సారించాలని సూచించారు. అన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీల ఏర్పాటు, అక్కడే విద్యుత్ తయారీ ఉంటుందని వెల్లడించారు. కర్మాగారానికి కావాల్సిన కరెంటును ఆయిల్ పామ్ పిప్పితోనే తయారు చేయనున్నట్టు ఆయన చెప్పారు.

గడువులోగా ప్రాజెక్టులు నిర్మించాలి: భట్టి



హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సింగరేణి కాలరీస్ సంస్థ నిర్మించతలపెట్టిన పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లకు నిర్ణీత గడువులోగా సంబంధిత శాఖల అనుమతులు తీసుకు ని నిర్మాణ పనులు ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సంస్థ యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రజాభవన్‌లో శనివారం పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. లోయర్ మానేరు డ్యామ్‌లో 300 మెగావాట్లు, మల్లన్నసాగర్‌లో 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి నీటిపారుదలశాఖ అనుమతులు వీలైనంత త్వరగా తీసుకోవాలని ఆదేశించారు. అయిదు జిల్లాల్లో నిర్మించతలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్ల డీపీఆర్‌ను జూలై నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కాగా, ఇటీవల ఓ ప్రమాదంలో సింగరేణి కార్మికుడు పెండ్రి రంజిత్ కుమా ర్ మృతి చెందగా అతడి కుటుంబానికి రూ.1.20 కోట్ల ప్రమాద బీమా చెక్కును ఉప ముఖ్యమంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం నీలాక్షి సింగ్, రీజినల్ మేనేజర్ సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖకు ప్రతి నెలా 536 కోట్లివ్వండి

» ఆర్థిక మంత్రికి వైద్యశాఖ మంత్రి దామోదర వినతి

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖకు ప్రతి నెలా రూ.536 కోట్లు ఇవ్వాలని వైద్యశాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం సచివాలయంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాఖలో ప్రతి నెలా చెల్లించాల్సిన బిల్లులు రూ.536 కోట్ల వరకు ఉంటున్నాయని భట్టి దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ఆరోగ్యశ్రీకి రూ.100 కోట్లు, ఔషధాల కొనుగోలుకు రూ.50 కోట్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.186 కోట్లు, రోగుల డైట్‌కు రూ.6.50 కోట్లు, డీఎంఈ పరిధిలోని ఐఎఫ్‌హెచ్‌ఎస్ సేవలకు రూ.22 కోట్లు, విద్యుత్ చార్జీలకు రూ.10 కోట్లు, డాక్టర్ల స్టైపెండ్ (పీజీ, ఎస్ఆర్)కు రూ.47 కోట్లు, సివిల్ వర్క్స్‌కు రూ.100 కోట్లు, ఇతరత్రాలకు కలిపి మొత్తం రూ.536 కోట్లు అవుతున్నాయని భట్టికి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆర్థిక మంత్రి ప్రతి నెలా ఈ కనీస మొత్తాన్ని విడుదల చేసేందుకు అంగీకరించినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి.

ముగ్గురు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు

» ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏఓగా మహేందర్

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముగ్గురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులను జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంకకు తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతికి గనులు, భూగర్భ వనరుల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. సెర్ప్ అదనపు సీఈఓ పి.కాత్యాయనీ దేవికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో కేటీఆర్ వద్ద ఓఎస్‌డీగా పనిచేసిన ఖమ్మం జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, నాన్ ఐఏఎస్ పి.మహేందర్‌ను, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి గరిమా నరులాను కేంద్ర ప్రభుత్వం రాజస్థాన్ క్యాడర్‌కు బదిలీ చేసింది.

44 మంది డీఎస్పీల బదిలీలు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 44 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. చాలా కాలం నుంచి వెయిటింగ్‌లో ఉన్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. లా అండ్ ఆర్డర్ విభాగానికి సంబంధించి కేవలం ఐదుగురికి మాత్రం పోస్టింగ్‌లు లభించాయి. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆసిఫ్‌నగర్ ఏసీపీగా బి.కిషన్ కుమార్, మీర్‌చౌక్ ఏసీపీగా జి.శ్యామ్ సుందర్, కల్వకుర్తి ఎస్‌డీపీఓగా సాయిరెడ్డి వెంకటరెడ్డి, యాదగిరిగుట్ట ఏసీపీగా విజయ్‌కుమార్, మహదేవ్‌పూర్ ఎస్‌డీపీఓగా సూర్యనారాయణలను నియమించారు. మిగతా వారికి ఇంటిలిజెన్స్, ఎస్‌బీ, ట్రాఫిక్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, సీఐడీ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోలో పోస్టింగులు ఇచ్చారు.

స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు..ఇక అదనపు కలెక్టర్లు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న 33 మందికి అదనపు కలెక్టర్ హోదా(పదోన్నతి) ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానాల తీర్పునకు లోబడి ఈ నిర్ణయం ఉంటుంది. పదోన్నతితోపాటు వీరిని ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగిస్తూ రెవెన్యూశాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్‌కుమార్ శనివారం జీవో జారీ చేశారు. రెవెన్యూశాఖ చరిత్రలోనే తొలిసారిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పించారని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ తెలిపారు. అందుకు హర్షం వ్యక్తం చేస్తూ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం రెవెన్యూశాఖలో మైలురాయిగా నిలవనుందని తెలంగాణ సివిల్ సర్వీస్(ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) డిప్యూటీ కలెక్టర్ల సంఘం పేర్కొంది. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆ సంఘం అధ్యక్షుడు కె.చంద్రమోహన్, చంద్రారెడ్డి కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి సంఘం ధన్యవాదాలు తెలిపింది.

ఎక్సైజ్ స్టేషన్ల రిబ్బన్ కటింగ్ నాలుగో 'సారీ'

» శుక్రవారం అర్ధరాత్రి తర్వాత హడావుడి ప్రకటన

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవా (రిబ్బన్ కటింగ్)నికి నాలుగోసారి ఆటంకం ఏర్పడింది. దీనికి ప్రొటోకాల్ విషయమై మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేల మధ్య తలెత్తిన వివాదాల వల్లే వాయిదా వేశామని ఎక్సైజ్‌శాఖ అధికారి ఒకరు చెప్పారు. రాష్ట్రంలో 134 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లుండగా, 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా 14 ఎక్సైజ్ స్టేషన్లను ఏర్పాటుకు జారీ చేసిన ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా పదేపదే వాయిదా వేయడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే వివిధ కారణాలతో మూడు సార్లు వాయిదా పడిన ఈ కార్యక్రమాన్ని శనివారం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమైనా ప్రారంభిస్తారనుకున్నారు. అందుకనుగుణంగా ఏర్పాట్లు కూడా చేశారు. కానీ నాలుగోసారి కూడా వాయిదా వేస్తూ శుక్రవారం అర్ధరాత్రి తర్వాత సర్కారు నిర్ణయం తీసుకున్నది.

ఫ్యూచర్ సిటీ, నిమ్జ్ భూసేకరణ పూర్తి చేయండి

» డేటా సెంటర్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టండి

» పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. జహీరాబాద్ నిమ్జ్‌కు సంబంధించి మిగిలి ఉన్న భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తి చేయాలన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తలు ఎవ్వరూ వెనక్కి వెళ్లకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు పరిశ్రమల శాఖపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శనివారం నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి వివిధ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. జహీరాబాద్ నిమ్జ్‌లో మిగిలి ఉన్న భూసేకరణను తక్షణమే పూర్తి చేయాలని, భూములు ఇచ్చేలా రైతులను ఒప్పించాలని ఆదేశించారు. డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ ఏర్పాటుకు అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ ఆర్కిటెక్ట్‌ను నియమించుకోవాలని అన్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, గోల్ఫ్ సహా అన్ని రకాల క్రీడలకు స్పోర్ట్స్ క్యాంప్లెక్స్‌లో స్థానం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతున్న మెగా ప్రాజెక్టులపై మంత్రివర్గ ఉపసంఘం 15 రోజులకు ఒకసారి సమావేశం నిర్వహించి చర్చించాలని సీఎం ఆదేశించారు. 2024లో 70 గ్లోబల్ కెపబులిటీ సెంటర్(జీసీసీ)లు రాష్ట్రానికి వచ్చాయని, ఈ ఏడాదిలో ఇప్పటికే 25 రాగా ఆ సంఖ్య పెంపునకు కృషి చేయాలని కోరారు. రాబోయే 100 రోజులకు ప్రణాళిక సిద్ధం చేసుకొని పని చేయాలని పరిశ్రమల అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సంచాలకులు నిఖిల్ చక్రవర్తి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) విభాగము
ఫారం-6
(చట్టం-30/2013లోని సెక్షన్ 11(1) లోని షెడ్యూల్-1 19 ప్రకారం)
ప్రాథమిక నోటిఫికేషన్

ఫైల్ నెం. జి2/800/2025-R&R తేది: 18.06.2025
గెజిట్ నెం. 86/2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ గారి ఆదేశానుసారం నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలము, మన్నేవారి పల్లి గ్రామ పరిధిలోని మర్లపాడు తండలోని నివాస గృహములు (223) భూమి విస్తీర్ణం 30861.79 చదరపు మీటర్లు గల భూమి ప్రజా ప్రయోజనార్థం నిమిత్తం అనగా డిండి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణము నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.ఎస్ నెం. 118 ఇరిగేషన్ & కాడ్ (ఎల్.ఎ. & ఆర్ & ఆర్/ఎ2) డిపార్ట్‌మెంట్ తేది. 01.12.2017న జారీ చేసినారు. అట్టి జి.ఓ నందు సెక్షన్ 10 A(b) చట్టం నెంబర్ 21/2017, భూసేకరణ పునరావాస & పునరుపాధి కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 లోని చాప్టర్- II మరియు చాప్టర్ III లను మినహాయించనైనది.

నిర్వాసిత కుటుంబాల పునరావాస, పునరుపాధి అంశాలను అదనపు కలెక్టర్ మరియు అదనపు జిల్లా మెజిస్ట్రేట్, నాగర్ కర్నూల్ గారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 19, రెవెన్యూ (జె.ఎ & ఎల్.ఎ) తేది: 11.02.2015 ప్రకారం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమించబడినారు.

కావున పునరావాస & పునఃనిర్మాణం కొరకు నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం, మన్నేవారి పల్లి గ్రామ పరిధిలోని మర్లపాడు తండాలోని నివాస గృహములు (223) భూమి విస్తీర్ణం 30861.79 చదరపు అడుగులు గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము: మర్లపాడు తండా మండలము: అచ్చంపేట

క్రమ సంఖ్య	సర్వే నెం.	ప్రతిపాదిత ఇంటి సంఖ్య	ఇంటి నెం.	ఇంటి యజమాని మరియు తండ్రి/భర్త పేరు	మొత్తం స్థలం (నిర్మాణ స్థలంతో కలుపుకుని) స్క్వేర్ మీ.	గృహము యొక్క స్వభావం	నిర్మాణ స్థలము (స్క్వేర్ మీ.)	కట్టడ ములు, నిర్మాణ ములు మరియు చెట్లు
1	2	3	4	5	6	7	8	9
1	101,102, 103,159,148	1	3-114	సబావత్ లక్ష్మీ భర్త లక్ష్య	200	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం, వరండా	43.63	
2	101,102, 103,159,148	2	3-113	సబావత్ జమ్ము తండ్రి బోడియా	119.52	పక్కా ఇల్లు, వరండా-కామ్-కిచెన్, బాత్‌రూం	43.28	వేప-1 తుమ్మ-1
3	101,102, 103,159,148	3	3-113	సబావత్ జమ్ము తండ్రి బోడియా	81.5	సెమి పక్కా ఇల్లు	20.74	
4	101,102, 103,159,148	4	3-115	సబావత్ సీతారాం తండ్రి బాల్‌రామ్	156.45	పక్కా ఇల్లు, వరండా-కామ్-కిచెన్, బాత్‌రూం	72.13	
5	101,102, 103,159,148	5	3-110	సబావత్ లాలూ తండ్రి బిక్క్య	279.45	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్ రూం, వరండా	21.87	
6	101,102, 103,159,148	6	3-110	సబావత్ పాండు తండ్రి బిక్క్య	-	పక్కా ఇల్లు	27.03	
7	101,102, 103,159,148	7	3-110	సబావత్ చాంది తండ్రి బాల్‌రామ్	93.09	గుడిసె, వరండా	41.76	
8	101,102, 103,159,148	8	3-112	సబావత్ దేబ్లి భర్త బోడియా	133.91	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం, వరండా	43.76	
9	101,102, 103,159,148	9	3-94	సబావత్ బుజ్జి తండ్రి ఖండియా	365.8	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	53.76	తుమ్మ-3 సుబ బుల్-1
10	101,102, 103,159,148	10	3-95	సబావత్ జమ్ములు భర్త గోప్య	195.36	పక్కా ఇల్లు వరండా కామ్-కిచెన్, బాత్‌రూం	82.2	
11	101,102, 103,159,148	11	3-95	సబావత్ రవి తండ్రి చిన్యా	187.2	పక్కా ఇల్లు వరండా కామ్-కిచెన్, బాత్‌రూం	105.09	
12	101,102, 103,159,148	12	3-91	సబావత్ సరియ తండ్రి టీక్‌రామ్	22.11	పక్కా ఇల్లు వరండా కామ్-కిచెన్, బాత్‌రూం	60.06	వేప-1
13	101,102, 103,159,148	13	3-92	సబావత్ పాండు తండ్రి టిక్‌రామ్	329.64	సెమి పక్కా ఇల్లు, గుడిసె, కిచెన్, బాత్‌రూం	100.03	వేప-1
14	101,102, 103,159,148	14	3-93	సబావత్ ఖండియా తండ్రి బోడియా	195	సెమి పక్కా ఇల్లు, బాత్‌రూం	89.47	వేప-1
15	101,102, 103,159,148	15	3-93	సబావత్ రమేష్ తండ్రి ఖండియా	212.3	సెమి పక్కా ఇల్లు	22.4	
16	101,102, 103,159,148	16	3-96	సబావత్ చిన్యా తండ్రి ఆమరియా	164.05	సెమి పక్కా ఇల్లు	24.46	
17	101,102, 103,159,148	17	3-95	సబావత్ గోపి తండ్రి చిన్యా	167.91	సెమి పక్కా ఇల్లు	17	
18	101,102, 103,159,148	18	3-72	సబావత్ హన్మంతు తండ్రి రెడ్యా	127.41	సెమి పక్కా ఇల్లు ప్రహరీ గోడ	21.45	
19	101,102, 103,159,148	19	3-73	సబావత్ సీలమ్మ తండ్రి సుక్య	220	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, కిచెన్, వరండా బాత్‌రూం	86.26	వేప-1 మేడి-1
20	101,102, 103,159,148	20	3-74	సబావత్ రెడ్యా తండ్రి వాలియా	207.14	పక్కా ఇల్లు,సెమి పక్కా ఇల్లు, గుడిసె	42.87	వేప-1
21	101,102, 103,159,148	21	3-75	సబావత్ దర్శ తండ్రి వాలియా	194.31	పక్కా ఇల్లు,సెమి పక్కా ఇల్లు, గుడిసె, కిచెన్, వరండా, బాత్‌రూం	75.28	
22	101,102, 103,159,148	22	3-76	సబావత్ హమియా తండ్రి పంతులు	118.69	సెమి పక్కా ఇల్లు		39.31
23	101,102, 103,159,148	23	3-76	సబావత్ బారతి భర్త బాలు	147.08	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, కిచెన్	77.73	
24	101,102, 103,159,148	24	3-60	మహాలక్ష్మీ గుడి	163.85	గుడిసె	11.38	
25	101,102, 103,159,148	25	3-68	సబావత్ విజయ భర్త జగన్	227.52	పక్కా ఇల్లు, గుడిసె కిచెన్, వరండా, బాత్‌రూం, పశువుల కొట్టం	64.04	
26	101,102, 103,159,148	26	3-62	సబావత్ సుజాత భర్త శివ	191.4	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	78.13	
27	101,102, 103,159,148	27	3-111	సబావత్ పద్మ భర్త మోతీలాల్	118.42	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం, ప్రహరీ గోడ	46.22	
28	101,102, 103,159,148	28	3-63	సబావత్ నీల భర్త హరిలాల్	93.75	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	56.43	
29	101,102, 103,159,148	29	3-61	సబావత్ వసంత భర్త మల్లేష్	112.19	పక్కా ఇల్లు, వరండా	34.78	వేప-1
30	101,102, 103,159,148	30	3-65	సబావత్ లక్ష్మి భర్త శంకర్	13.86	పక్కా ఇల్లు సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు	50.89	[illegible]-1
31	101,102, 103,159,148	31	3-65	సబావత్ బోడి భర్త నందు	164.25	పక్కా ఇల్లు, బాత్‌రూం	20.8	
32	101,102, 103,159,148	32	3-66	సబావత్ శివ కుమార్ తండ్రి రాజు	173.89	పక్కా ఇల్లు, వరండా ప్రహరీ గోడ	108.75	వేప-1
33	101,102, 103,159,148	33	3-67	సబావత్ దేవుల తండ్రి టిక్ రామ్	460	పక్కా ఇల్లు, కిచెన్ వరండా, బాత్‌రూం	124.53	వేప-3 కానుగ-1 సీతాఫలం-1 [illegible]-1
34	101,102, 103,159,148	34	3-67	సమాజి నరసింహ తండ్రి నారాయణ	24	సెమి పక్కా ఇల్లు	16.08	
35	101,102, 103,159,148	35	3-65	సబావత్ తులస్య తండ్రి బోడియా	16.8	సెమి పక్కా ఇల్లు, గుడిసె, బాత్‌రూం	47.83	
36	101,102, 103,159,148	36	3-46	సబావత్ శంకర్ తండ్రి లక్ష్మీరామ్	143.78	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం ప్రహరీగోడ, పశువుల కొట్టం	74.025	
37	101,102, 103,159,148	37	3-46	సబావత్ శ్రీను తండ్రి లక్ష్మీరామ్	74.4	సెమి పక్కా ఇల్లు	38.2	
38	101,102, 103,159,148	38	3-47	సబావత్ జబ్బార్ లాల్ తండ్రి లక్ష్మీరామ్	-	కిచెన్, వరండా, బాత్‌రూం	119.25	వేప-1
39	101,102, 103,159,148	39	3-43	సబావత్ లక్ష్మణ్ తండ్రి ఈశ్వర్	-	సెమి పక్కా ఇల్లు	113.93	
40	101,102, 103,159,148	40	3-66	సబావత్ రాజు తండ్రి పంతులు	-	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం	316.93	
41	101,102, 103,159,148	41	3-66	కేతవత్ చాంది భర్త శంకర్	-	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం	85.71	
42	101,102, 103,159,148	42	3-50	కేతవత్ తులసి భర్త దాన్య	-	పక్కా ఇల్లు	111.15	
43	101,102, 103,159,148	43	3-51	సబావత్ లాలు తండ్రి హమియా	-	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, కిచెన్	86.31	
44	101,102, 103,159,148	44	3-51	సబావత్ లింగ తండ్రి హమియా	-	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూమ్	89.56	
45	101,102, 103,159,148	45	3-40	సబావత్ మంగిలి తండ్రి వాలియా	63.44	సెమి పక్కా ఇల్లు, గుడిసె	156.45	
46	101,102, 103,159,148	46	3-41	సబావత్ లోకా తండ్రి చిన్యా	160.93	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, వరండా, బాత్‌రూం	87.94	
47	101,102, 103,159,148	47	3-32	రామావత్ సునీత భర్త సక్రు	31.82	పక్కా ఇల్లు	17.93	
48	101,102, 103,159,148	48	3-41	రామావత్ దేవి భర్త దుబల	29.61	పక్కా ఇల్లు	27.51	
49	101,102, 103,159,148	49	3-48	రామావత్ కోమటి భర్త బాల్యా	88.53	సెమి పక్కా ఇల్లు	-	
50	101,102, 103,159,148	50	3-43	సబావత్ బారతి భర్త ఈశ్వర్	189.15	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	55.61	వేప-1
51	101,102, 103,159,148	51	3-00	ప్రాథమిక స్కూల్	399	పక్కా ఇల్లు, బాత్‌రూం	82.71	
52	101,102, 103,159,148	52	3-23	సబావత్ నాజీ భర్త పంతులు	98.35	సెమి పక్కా ఇల్లు	22.4	[illegible]-1
53	101,102, 103,159,148	53	3-24	సేనావత్ నార్య తండ్రి పీర్య	73.12	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, కిచెన్, వరండా బాత్‌రూం	60.88	
54	101,102, 103,159,148	54	3-25	సేనావత్ పల్య తండ్రి పీర్య	85.2	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు కిచెన్, వరండా బాత్‌రూం, ప్రహరీగోడ	19.53	
55	101,102, 103,159,148	55	3-26	సేనావత్ పీర్య తండ్రి హమియా	107.9	సెమి పక్కా ఇల్లు, బాత్‌రూం	29	
56	101,102, 103,159,148	56	3-28	మూడావత్ లక్ష్మణ్ తండ్రి టిక్య	27.39	సెమి పక్కా ఇల్లు	23.76	
57	101,102, 103,159,148	57	3-28	సేనావత్ బోడి భర్త దేవుల	120.94	సెమి పక్కా ఇల్లు వరండా	52.36	వేప-1
58	101,102, 103,159,148	58	3-28	సేనావత్ ఆలివేల భర్త మోతియా	-	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు బాత్‌రూం, ప్రహరీగోడ	57.78	
59	101,102, 103,159,148	59	3-28	సేనావత్ బుజ్జి భర్త లక్ష్మణ్	-	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు గుడిసె, కిచెన్, వరండా, బాత్‌రూం	39.5	
60	101,102, 103,159,148	60	3-29	సబావత్ పద్మ భర్త బాలు	229.6	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు వరండా, బాత్‌రూం	79.14	గోరింట-1
61	101,102, 103,159,148	61	3-30	సబావత్ లక్ష్మి భర్త రవి	59.8	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్ రూం, పశువుల కొట్టం	64.8	
62	101,102, 103,159,148	62	3-31	సబావత్ చంద్రకళ భర్త దేవుల	50.35	పక్కా ఇల్లు, వరండా, బాత్ రూం	38.35	వేప-1
63	101,102, 103,159,148	63	3-31	సబావత్ గోంతి భర్త సక్రియ	50.35	పక్కా ఇల్లు, కిచెన్, వరండా	35.23	వేప-1
64	101,102, 103,159,148	64	3-18	మూడావత్ లక్ష్మి భర్త బిచ్య	19.8	పక్కా ఇల్లు, వరండా	36.85	
65	101,102, 103,159,148	65	3-18	మూడావత్ నీల భర్త వెంకటేష్	19.08	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	38.78	
66	101,102, 103,159,148	66	3-19	జరుపుల చాంది భర్త రెడ్యా	23.06	పక్కా ఇల్లు, కిచెన్ వరండా	36.8	
67	101,102, 103,159,148	67	3-20	జరుపుల లక్ష్మి భర్త పద్య	11.6	పక్కా ఇల్లు, కిచెన్ వరండా, బాత్‌రూం	41.58	
68	101,102, 103,159,148	68	3-20	మూడావత్ హాసలి భర్త హన్మ	17.05	సెమి పక్కా ఇల్లు, కిచెన్, వరండా	38.34	
69	101,102, 103,159,148	69	3-20	రామావత్ మల్లీశ్వరి భర్త సంతోష్	33.55	సెమి పక్కా ఇల్లు	22.14	
70	101,102, 103,159,148	70	3-20	రామావత్ చిట్టి భర్త ఖండియా	116.6	సెమి పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం	42.65	
71	101,102, 103,159,148	71	3-20	సబావత్ చిచ్చి భర్త లాచ్య	57.5	సెమి పక్కా ఇల్లు పక్కా ఇల్లు,బాత్‌రూం	31.15	
72	101,102, 103,159,148	72	3-58	సబావత్ సాలి భర్త సాయిరాం	80.64	సెమి పక్కా ఇల్లు కిచెన్, వరండా	46.97	
73	101,102, 103,159,148	73	3-58	మూడావత్ శాంతి భర్త నోముల నాయక్	94.58	పక్కా ఇల్లు కిచెన్, వరండా	35.86	
74	101,102, 103,159,148	74	3-58	సేనావత్ విజయ భర్త లాలు	83.02	పక్కా ఇల్లు, కిచెన్ వరండా, బాత్‌రూం, ప్రహరీ గోడ	52.31	
75	101,102, 103,159,148	75	3-01	సేనావత్ విజయ భర్త శంకర్	95.73	పక్కా ఇల్లు, కిచెన్ వరండా, బాత్‌రూం, ప్రహరీ గోడ	42.96	
76	101,102, 103,159,148	76	3-02	సేనావత్ సరోజ భర్త హన్మ	97.9	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	41.7	
77	101,102, 103,159,148	77	3-03	సేనావత్ జంకి భర్త పత్య	241.68	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు	74.46	[illegible]-1
78	101,102, 103,159,148	78	3-04	సేనావత్ పద్మ భర్త బాలు నాయక్	226.4	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు	62.96	మర్రి-1
79	101,102, 103,159,148	79	3-05	సేనావత్ సునీత భర్త గోపిసింగ్	181.52	సెమి పక్కా ఇల్లు, వరండా	32.38	గోరింట-1
80	101,102, 103,159,148	80	3-05	సేనావత్ సుగుణ భర్త అమర్‌సింగ్	121.45	పక్కా ఇల్లు,కిచెన్ వరండా	41.14	
81	101,102, 103,159,148	81	3-05	సేనావత్ లక్ష్మి భర్త రాములు	126	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	21.1	
82	101,102, 103,159,148	82	3-06	సేనావత్ సునీత భర్త జయరాం	17.01	సెమి పక్కా ఇల్లు	14.95	కొబ్బరి-1
83	101,102, 103,159,148	83	3-06	సేనావత్ మంగి భర్త బిచ్య	90.55	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, వరండా బాత్‌రూం	40.45	వేప-1
84	101,102, 103,159,148	84	3-06	సేనావత్ బుజ్జి భర్త రవికుమార్	-	పక్కా ఇల్లు, వరండా	23.65	
85	101,102, 103,159,148	85	3-06	సేనావత్ రుక్కి భర్త బిచ్య	-	పక్కా ఇల్లు, కిచెన్	17.87	
86	101,102, 103,159,148	86	3-07	మూడావత్ సుక్కి భర్త లోక్య	93.1	పక్కా ఇల్లు	24.85	
87	101,102, 103,159,148	87	3-08	సేనావత్ జర్పలి భర్త పాండు	195.62	సెమి పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం,ప్రహరీగోడ	50.24	కొబ్బరి-3 వేప-1
88	101,102, 103,159,148	88	3-09	జరుపుల లక్ష్మి భర్త శంకర్	137.35	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం	66.02	కొబ్బరి-1
89	101,102, 103,159,148	89	3-10	జరుపుల అనురాధ భర్త కృష్ణ	63.53	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం, ప్రహరీగోడ	48.61	ఉసిరి-1
90	101,102, 103,159,148	90	3-11	మూడావత్ మల్లమ్మ భర్త బాలోజీ	59.94	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం,ప్రహరీగోడ	20.87	
91	101,102, 103,159,148	91	3-11	మూడావత్ సారిబాయి భర్త సక్రు నాయక్	62.6	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం, ప్రహరీగోడ	23.98	
92	101,102, 103,159,148	92	3-12	మూడావత్ లక్ష్మీ భర్త తావు	67.94	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం,ప్రహరీగోడ	23.76	
93	101,102, 103,159,148	93	3-15	సేనావత్ మౌనిక భర్త సుమన్	109.96	సెమి పక్కా ఇల్లు	20.21	
94	101,102, 103,159,148	94	3-15	సేనావత్ బారతి భర్త చిన్యా	87.68	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, వరండా, బాత్‌రూం, ప్రహరీగోడ	84.73	
95	101,102, 103,159,148	95	3-14	సేనావత్ తార భర్త చరణియా	67.5	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం	39.48	వేప-1 [illegible]-1
96	101,102, 103,159,148	96	3-14	సేనావత్ పద్మ భర్త బిచ్య	77.35	పక్కా ఇల్లు, కిచెన్ వరండా	40.06	
97	101,102, 103,159,148	97	3-13	సేనావత్ అజయ్ తండ్రి కిషన్	759.12	పక్కా ఇల్లు, పశువుల కొట్టం	46.98	
98	101,102, 103,159,148	98	3-13	సేనావత్ రవికుమార్ తండ్రి కిషన్	81.9	సెమి పక్కా ఇల్లు	16.83	
99	101,102, 103,159,148	99	3-14	సేనావత్ లక్ష్మి భర్త లక్ష్య	73.14	సెమి పక్కా ఇల్లు	15.35	
100	101,102, 103,159,148	100	3-14	సేనావత్ మౌనిక భర్త హనుమంతు	81.2	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, వరండా బాత్‌రూం	51.2	
101	101,102, 103,159,148	101	3-17	మూడావత్ కమల భర్త సంజీవియా	29.58	పక్కా ఇల్లు	16.15	
102	101,102, 103,159,148	102	3-17	మూడావత్ లలిత భర్త లాలు	29.9	పక్కా ఇల్లు	16.33	
103	101,102, 103,159,148	103	3-16	మనవలు రేనమ్మ భర్త యాదయ్య	-	పక్కా ఇల్లు, వరండా, బాత్‌రూం	125.78	
104	101,102, 103,159,148	104	3-16	మనవలు ముత్యమ్మ భర్త పోచయ్య	-	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు కిచెన్	26.58	
105	101,102, 103,159,148	105	3-15	మనవలు లక్ష్మమ్మ భర్త ముత్తయ్య	-	సెమి పక్కా ఇల్లు	46	జామ-2
106	101,102, 103,159,148	106	3-35	మూడావత్ శాంతి భర్త దేవ	-	సెమి పక్కా ఇల్లు, Pacca	56.08	
107	101,102, 103,159,148	107	3-35	మూడావత్ నాన్కు భర్త	-	సెమి పక్కా ఇల్లు	55.08	
108	101,102, 103,159,148	108	3-88	సేనావత్ రవిత భర్త వెంకటేష్	1174.6	సెమి పక్కా ఇల్లు, వరండా,ప్రహరీగోడ	55.68	
109	101,102, 103,159,148	109	3-88	మూడావత్ సునీత భర్త చందు	67.9	సెమి పక్కా ఇల్లు	18.73	
110	101,102, 103,159,148	110	3-34	మూడావత్ ద్యాలి భర్త హీర్య	33.05	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు బాత్‌రూం	46.85	
111	101,102, 103,159,148	111	3-33	మూడావత్ సునీత భర్త సేవ్య	22	పక్కా ఇల్లు	29.44	
112	101,102, 103,159,148	112	3-33	మూడావత్ శాంతా భర్త సుక్య	82.32	సెమి పక్కా ఇల్లు, పక్కా	21.78	
113	101,102, 103,159,148	113	3-32	మూడావత్ సోని భర్త లోక్య	31.71	పక్కా ఇల్లు, వరండా	35.79	
114	101,102, 103,159,148	114	3-32	మూడావత్ చంద్రకళ భర్త జగన్	34.88	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు,పక్కా ఇల్లు	30.37	
115	101,102, 103,159,148	115	3-32	మూడావత్ బుజ్జి భర్త ముద్య	15.9	పక్కా ఇల్లు, వరండా బాత్‌రూం	42.93	
116	101,102, 103,159,148	116	3-36	మూడావత్ మంగిలి భర్త చలియా	74.58	సెమి పక్కా ఇల్లు, వరండా,బాత్‌రూం	42.14	
117	101,102, 103,159,148	117	3-36	మూడావత్ సేవలి భర్త బోజ్య	79.95	పక్కా ఇల్లు,సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	34.08	
118	101,102, 103,159,148	118	3-37	మూడావత్ సునీత భర్త బాలరాజ్	47.47	సెమి పక్కా ఇల్లు వరండా	51	
119	101,102, 103,159,148	119	3-39	సబావత్ చిట్టి భర్త మల్లేష్	11.95	పక్కా ఇల్లు,కిచెన్, వరండా	32.66	
120	101,102, 103,159,148	120	3-39	సబావత్ శాంతి భర్త నిరంజన్	19.24	పక్కా ఇల్లు,వరండా బాత్‌రూం	53.63	
121	101,102, 103,159,148	121	3-52	రామావత్ సునీత భర్త నందు	31.57	పక్కా ఇల్లు,సెమి పక్కా ఇల్లు, వరండా బాత్‌రూం	38.54	[illegible]-1
122	101,102, 103,159,148	122	3-52	రామావత్ జ్యోతి భర్త దేవ్లా	34.69	పక్కా ఇల్లు,కిచెన్ వరండా, బాత్‌రూం ప్రహరీగోడ	46.7	
123	101,102, 103,159,148	123	3-53	రామావత్ శారద భర్త బిచ్య	48.51	పక్కా ఇల్లు, బాత్‌రూం	23.87	
124	101,102, 103,159,148	124	3-54	మూడావత్ బుజ్జి భర్త చత్రు	113.1	పక్కా ఇల్లు, కిచెన్ బాత్‌రూం	67.05	
125	101,102, 103,159,148	125	3-55	మూడావత్ బారతి భర్త లక్ష్మణ్	67.1	పక్కా ఇల్లు, కిచెన్ వరండా, బాత్‌రూం ప్రహరీ	52.25	
126	101,102, 103,159,148	126	3-56	మూడావత్ నారి భర్త రెడ్యా	13.44	సెమి పక్కా ఇల్లు	18.44	
127	101,102, 103,159,148	127	3-56	మూడావత్ వర్ష భర్త లక్ష్మణ్	45.4	పక్కా ఇల్లు, వరండా	53.28	
128	101,102, 103,159,148	128	3-56	మూడావత్ సువర్ణ భర్త సాయిరాం	74.55	పక్కా ఇల్లు, వరండా	49.21	
129	101,102, 103,159,148	129	3-57	మూడావత్ సరోజ భర్త రవికుమార్	58	సెమి పక్కా ఇల్లు, బాత్‌రూం	32.84	
130	101,102, 103,159,148	130	3-13	సేనావత్ కళ్యాణి భర్త చందు	131.21	సెమి పక్కా ఇల్లు, పశువుల కొట్టం	29.25	
131	101,102, 103,159,148	131	3-13	మూడావత్ జమిని భర్త పకీరా	81.39	సెమి పక్కా ఇల్లు	29.15	
132	101,102, 103,159,148	132	3-14	రామావత్ బిచ్చి భర్త దుల్యా	60.84	సెమి పక్కా ఇల్లు	25.56	
133	101,102, 103,159,148	133	3-15	మూడావత్ లక్ష్మి భర్త మల్లేష్	62.53	సెమి పక్కా ఇల్లు	23.04	
134	101,102, 103,159,148	134	3-16	మూడావత్ స్వప్న భర్త నరసింహ	54.5	సెమి పక్కా ఇల్లు	19.62	
135	101,102, 103,159,148	135	3-62	సబావత్ బిచ్చి భర్త టీక్‌రాం	57.48	సెమి పక్కా ఇల్లు	24.48	
136	101,102, 103,159,148	136	3-62	సేనావత్ సోని భర్త బోజ్య	94.17	సెమి పక్కా ఇల్లు ప్రహరీగోడ	22.58	
137	101,102, 103,159,148	137	3-61	సబావత్ అంజలి భర్త బాద్యన్	27.15	సెమి పక్కా ఇల్లు పక్కా ఇల్లు, వరండా	37.1	వేప-1
138	101,102, 103,159,148	138	3-61	సబావత్ అనూష భర్త వెంకటేష్	-	పక్కా ఇల్లు, వరండా	38	
139	101,102, 103,159,148	139	3-61	సబావత్ మంజుల భర్త తావు	-	సెమి పక్కా ఇల్లు, వరండా, బాత్‌రూం పశువుల	37.2	
140	101,102, 103,159,148	140	3-69	సబావత్ రాజ భర్త హరిలాల్	4.36	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు,పక్కా ఇల్లు వరండా	87.73	వేప-1
141	101,102, 103,159,148	141	3-69	సబావత్ సోని భర్త చంటి	45.12	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం	20.2	వేప-1
142	101,102, 103,159,148	142	3-79	సబావత్ లక్ష్మి భర్త శ్రీను	26.44	సెమి పక్కా ఇల్లు కిచెన్, వరండా ప్రహరీగోడ	45.26	
143	101,102, 103,159,148	143	3-80	మూడావత్ సాలి భర్త దేవుల	50.88	పక్కా ఇల్లు కిచెన్, వరండా బాత్‌రూం	83.38	
144	101,102, 103,159,148	144	3-71	సేనావత్ సరస్వతి భర్త నిరంజన్	19.16	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు	19.08	
145	101,102, 103,159,148	145	3-70	సేనావత్ గోరి భర్త రెడ్యా	46.74	పక్కా ఇల్లు, కిచెన్, వరండా	167.02	
146	101,102, 103,159,148	146	3-71	సేనావత్ చంద్రకళ భర్త కృష్ణ	203.99	సెమి పక్కా ఇల్లు	27.16	
147	101,102, 103,159,148	147	3-70	సేనావత్ లలిత భర్త జయరాం	86.9	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, బాత్‌రూం	27.51	
148	101,102, 103,159,148	148	3-60	సబావత్ దేవి భర్త హీరు	21.6	పక్కా ఇల్లు, వరండా	39.42	
149	101,102, 103,159,148	149	3-60	సబావత్ లక్ష్మి ప్రసన్న భర్త	24.52	పక్కా ఇల్లు, వరండా	44.74	
150	101,102, 103,159,148	150	3-61	సబావత్ నీల భర్త తావునాయక్	24.57	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు	44.73	
151	101,102, 103,159,148	151	3-60	సబావత్ నిర్మల భర్త రమేష్	26.85	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	45	
152	101,102, 103,159,148	152	3-59	సబావత్ సునీత భర్త పకీరాం	105.45	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	56.24	
153	101,102, 103,159,148	153	3-59	సబావత్ సాలి భర్త సేవ్య	82.18	సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	34.84	గోరింట-1
154	101,102, 103,159,148	154	3-59	మూడావత్ లక్ష్మి భర్త దీప్లా	75.123	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	112.13	
155	101,102, 103,159,148	155	3-59	రామావత్ విజయ భర్త దేవుల	111.13	సెమి పక్కా ఇల్లు, బాత్‌రూం, ప్రహరీ గోడ	139.04	
156	101,102, 103,159,148	156	3-81	రామావత్ లక్ష్మి భర్త సేవలాల్	41.56	పక్కా ఇల్లు, వరండా	58.14	
157	101,102, 103,159,148	157	3-81	రామావత్ నారి భర్త బాబు	-	సెమి పక్కా ఇల్లు, బాత్‌రూం	31	
158	101,102, 103,159,148	158	3-82	మూడావత్ బుజ్జి భర్త చందులాల్	33.9	పక్కా ఇల్లు, కిచెన్ వరండా, బాత్‌రూం	52.6	
159	101,102, 103,159,148	159	3-83	మూడావత్ హాసలి భర్త హన్మ	54.08	పక్కా ఇల్లు, కిచెన్ వరండా	45	
160	101,102, 103,159,148	160	3-88	సేనావత్ అంజలి భర్త లక్ష్య	128.27	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, వరండా, బాత్‌రూం, పశువుల కొట్టం	96.16	
161	101,102, 103,159,148	161	3-80	రామావత్ లక్ష్మి భర్త బిక్క్య	56.65	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	102.2	కొబ్బరి-1
162	101,102, 103,159,148	162	3-99	సబావత్ చంద్రకళ భర్త వినయ్‌కుమార్	-	పక్కా ఇల్లు, వరండా	51.12	
163	101,102, 103,159,148	163		సబావత్ బోడి భర్త రమేష్	-	పక్కా ఇల్లు, వరండా	45.66	
164	101,102, 103,159,148	164	3-90	సబావత్ సేవలి భర్త తావురియా	163.7	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం	21.6	వేప-1
165	101,102, 103,159,148	165	3-97	సబావత్ మోతి భర్త బిల్యా	262.88	సెమి పక్కా ఇల్లు, గుడిసె, కిచెన్, వరండా, బాత్‌రూం	87.66	వేప-1
166	101,102, 103,159,148	166	3-98	సబావత్ భాగ్యలక్ష్మి భర్త మోతీలాల్	68.25	పక్కా ఇల్లు, గుడిసె వరండా, బాత్‌రూం పశువుల కొట్టం	56.08	
167	101,102, 103,159,148	167	3-98	సబావత్ బిచ్చి భర్త ఇద్య	17.25	సెమి పక్కా ఇల్లు	12.42	
168	101,102, 103,159,148	168	3-98	సబావత్ రజిత భర్త లాలు	35.77	పక్కా ఇల్లు, వరండా	57.31	
169	101,102, 103,159,148	169	3-100	సబావత్ బారతి భర్త సోమ్లా	100.88	పక్కా ఇల్లు, సెమి పక్కా ఇల్లు, పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	82.22	వేప-1
170	101,102, 103,159,148	170	3-106	మూడావత్ కృష్ణవేణి భర్త దామోదర్	-	సెమి పక్కా ఇల్లు, కిచెన్, వరండా	45.4	
171	101,102, 103,159,148	171	3-106	సబావత్ మానిక భర్త సోమయ్య	51.5	పక్కా ఇల్లు, వరండా	36.25	
172	101,102, 103,159,148	172	3-101	సబావత్ రేణుక భర్త మల్లేష్	33.75	పక్కా ఇల్లు, వరండా, బాత్‌రూం	36.64	
173	101,102, 103,159,148	173	3-86	సబావత్ రుక్క భర్త శంకర్	74.51	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	58.28	
174	101,102, 103,159,148	174	3-87	రామావత్ కౌసల్య భర్త జగన్	86.43	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం	62.4	వేప-1
175	101,102, 103,159,148	175	3-85	సబావత్ బిచ్చి భర్త రాములు	187.72	పక్కా ఇల్లు, కిచెన్, వరండా, బాత్‌రూం ప్రహరీ గోడ	120.65	వేప-1 [illegible]-1
176	101,102, 103,159,148	176	3-84	సబావత్ బారతి భర్త సత్తయ్య	71.39	పక్కా ఇల్లు, వరండా, ప్రహరీ గోడ	217.42	
177	101,102, 103,159,148	177		సబావత్ పద్మ తండ్రి నార్య		సెమి పక్కా ఇల్లు	16.65	
178	101,102, 103,159,148	178	3-104	సబావత్ సక్కి భర్త లక్ష్య	16.58	పక్కా ఇల్లు	20.36	
179	101,102, 103,159,148	179	3-104	సబావత్ బుజ్జి భర్త బద్య	72.9	పక్కా ఇల్లు వరండా	48.26	
180	101,102, 103,159,148	180	3-104	సబావత్ సక్రి భర్త లోకా	64.89	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం	61.88	
181	101,102, 103,159,148	181	3-60	సబావత్ గమ్మి భర్త సేవలా	155.19	సెమి పక్కా ఇల్లు పశువుల కొట్టం	33	
182	101,102, 103,159,148	182	3-60	సబావత్ లక్ష్మి భర్త గోప్య	17.5	సెమి పక్కా ఇల్లు	17	
183	101,102, 103,159,148	183	3-60	సబావత్ దేవి భర్త హీరు	17.5	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం	20.84	
184	101,102, 103,159,148	184	3-101	సబావత్ బిచ్చి భర్త రాములు	56.48	పక్కా ఇల్లు	24.82	
185	101,102, 103,159,148	185	3-101	సబావత్ బిచ్చి భర్త చందు	77.1	పక్కా ఇల్లు ప్రహరీగోడ	19.8	
186	101,102, 103,159,148	186	3-102	సబావత్ బుజ్జి భర్త నార్య	57.67	సెమి పక్కా ఇల్లు బాత్‌రూం	22.9	
187	101,102, 103,159,148	187	3-102	సబావత్ సునీత భర్త మని	31.8	పక్కా ఇల్లు	19.98	
188	101,102, 103,159,148	188	3-102	సబావత్ చిట్టి భర్త లక్ష్మణ్	31.8	పక్కా ఇల్లు	18.94	
189	101,102, 103,159,148	189	3-104	సబావత్ సక్రి భర్త లోకా	31.35	సెమి పక్కా ఇల్లు	25.63	
190	101,102, 103,159,148	190	3-104	సబావత్ సక్కి భర్త లక్ష్మణ్	26.5	సెమి పక్కా ఇల్లు ప్రహరీగోడ	18.08	
191	101,102, 103,159,148	191	3-104	సబావత్ ఆలివేల భర్త నరేష్	82.25	సెమి పక్కా ఇల్లు ప్రహరీగోడ	13.9	
192	101,102, 103,159,148	192	3-105	రమావత్ లక్ష్మి భర్త శంకర్	166.93	సెమి పక్కా ఇల్లు వరండా, బాత్‌రూం	63.67	వేప-1
193	101,102, 103,159,148	193	3-105	రమావత్ చాంది భర్త గుబ్య	-	సెమి పక్కా ఇల్లు	24.65	
194	101,102, 103,159,148	194	3-89	రమావత్ జ్యోతి భర్త భాస్కర్	280	సెమి పక్కా ఇల్లు	44.85	
195	101,102, 103,159,148	195	3-89	సబావత్ సుజాత భర్త శ్రీను	112.38	సెమి పక్కా ఇల్లు	33.35	
196	101,102, 103,159,148	196	3-37	మూడావత్ జయ భర్త రమేష్	28.06	సెమి పక్కా ఇల్లు	20.74	
197	101,102, 103,159,148	197	3-37	రమావత్ జగ్గు భర్త ఖండియా	38.43	సెమి పక్కా ఇల్లు	29.1	
198	101,102, 103,159,148	198	3-107	రమావత్ సాలి భర్త శ్రీను	80.85	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం ప్రహరీ గోడ	70.15	కొబ్బరి-2
199	101,102, 103,159,148	199	3-108	సబావత్ లలిత భర్త శంకర్	129.64	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం	50.38	
200	101,102, 103,159,148	200	3-109	సబావత్ లక్ష్మి భర్త నార్య	147.59	పక్కా ఇల్లు కిచెన్, వరండా, బాత్‌రూం, ప్రహరీ గోడ, పశువుల కొట్టం	92.48	
201	101,102, 103,159,148	201	3-109	మూడావత్ శారద భర్త శ్రీరాములు	43.37	సెమి పక్కా ఇల్లు	20.95	
202	101,102, 103,159,148	202	3-110	మూడావత్ లక్ష్మి భర్త శంకర్	43.37	సెమి పక్కా ఇల్లు	20.65	
203	101,102, 103,159,148	203	3-111	మూడావత్ కవిత భర్త కిషన్	39.83	సెమి పక్కా ఇల్లు	20.65	
204	101,102, 103,159,148	204	3-112	మూడావత్ జంకి భర్త దేశ్య	39.83	సెమి పక్కా ఇల్లు	20.65	
205	101,102, 103,159,148	205	3-113	మూడావత్ బుజ్జి భర్త ముద్య	45.24	సెమి పక్కా ఇల్లు	19.43	
206	101,102, 103,159,148	206	3-114	మూడావత్ పార్వతి భర్త హన్మంతు	46.02	సెమి పక్కా ఇల్లు	19.76	
207	101,102, 103,159,148	207	3-115	మూడావత్ దానమ భర్త పుల్య	45.43	సెమి పక్కా ఇల్లు	20.06	
208	101,102, 103,159,148	208	3-116	మూడావత్ సౌందర్య భర్త పవన్	45.43	సెమి పక్కా ఇల్లు	20.06	
209	101,102, 103,159,148	209	3-117	జక్కుల అంజమ్మ భర్త చెన్నయ్య	27.25	సెమి పక్కా ఇల్లు	21.26	
210	101,102, 103,159,148	210	3-118	జక్కుల మల్లయ్య తండ్రి సాయిలు	27.25	సెమి పక్కా ఇల్లు	21.26	
211	101,102, 103,159,148	211	3-119	మూడావత్ సోని భర్త లోక	54.59	పశువుల కొట్టం, ప్రహరీ గోడ	42.2	
212	101,102, 103,159,148	212	3-120	సబావత్ నిరంజన్ తండ్రి చంద్రయ్య	110.32	పశువుల కొట్టం, ప్రహరీ గోడ	37.35	
213	101,102, 103,159,148	213	3-121	సబావత్ లాలి భర్త జగ్గు	19.25	సెమి పక్కా ఇల్లు	20.06	
214	101,102, 103,159,148	214	3-122	సబావత్ బోడి భర్త లాకీపతి	77.55	సెమి పక్కా ఇల్లు	29.26	
215	101,102, 103,159,148	215	3-123	సబావత్ బోడి భర్త లాకీపతి	83.49	సెమి పక్కా ఇల్లు	28.64	
216	101,102, 103,159,148	216	3-124	సబావత్ పుష్పలత భర్త లక్ష్మణ్	90.75	సెమి పక్కా ఇల్లు పక్కా ఇల్లు	31.13	
217	101,102, 103,159,148	217	3-125	బస్తావత్ బుజ్జి భర్త రవీందర్	66.55	సెమి పక్కా ఇల్లు	22.83	
218	101,102, 103,159,148	218	3-126	సబావత్ సోమ్ల తండ్రి ఇద్య	113.35	సెమి పక్కా ఇల్లు పశువుల కొట్టం, ప్రహరీ	50.22	
219	101,102, 103,159,148	219	3-127	చర్చి	120.25	సెమి పక్కా ఇల్లు	25.2	
220	101,102, 103,159,148	220	3-128	మూడావత్ లక్ష్మి భర్త దీప్లా	184.8	సెమి పక్కా ఇల్లు పశువుల కొట్టం	32.76	టేకు-5 [illegible]-1
221	101,102, 103,159,148	221	3-129	మూడావత్ వర్ష భర్త లక్ష్మణ్	102.8	సెమి పక్కా ఇల్లు పశువుల కొట్టం	38.16	టేకు-5
222	101,102, 103,159,148	222	3-130	మూడావత్ బుజ్జి భర్త చందులాల్	129.1	సెమి పక్కా ఇల్లు పశువుల కొట్టం ప్రహరీ గోడ	43.7	టేకు-2 కానుగ-1
223	101,102, 103,159,148	223	3-131	గుడి	131.25	సెమి పక్కా ఇల్లు	11.39	
				మొత్తం విస్తీర్ణం	30861.798		10568.29	

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం, 2013 (నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ (11) 1 ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ మరియు భూసేకరణ అధికారి/ రాజస్వ మండలాధికారి, అచ్చంపేట గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైన పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ గారు భూసేకరణ అధికారి మరియు/రాజస్వ మండలాధికారి, అచ్చంపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ (12) ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.


సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయంలో సంబంధిత భూ యజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్ మరియు భూసేకరణ అధికారి/రాజస్వ మండలాధికారి, అచ్చంపేట గార్లకు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు లిఖిత పూర్వకంగా తెలియచేయవలసి ఉన్నది.

సం/-	సం/-	సం/-
భూసేకరణ అధికారి/ రాజస్వ మండలాధికారి అచ్చంపేట	అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్	జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO.NO:319/LA-PP/ADVT/PUBLICATION/2024-25

నీరజ్‌కు మళ్లీ టాప్ ర్యాంక్



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకొన్నాడు. శనివారం విడుదల చేసిన తాజా ర్యాంకుల జాబితాలో నీరజ్ మొత్తం 1445 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. గతేడాది సెప్టెంబరులో చోప్రాను వెనక్కినెట్టి గ్రెనడా త్రోయర్ అండర్సన్ పీటర్స్ టాప్ ర్యాంక్‌ను అందుకొన్నాడు. కానీ, ఆ తర్వాత నిలకడగా రాణిస్తున్న చోప్రా ఇటీవలే వరుసగా పారిస్ డైమండ్ లీగ్, ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ ఈవెంట్లు గెలిచాడు. దీంతో మళ్లీ నెంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. అండర్సన్ (1431) రెండో ర్యాంక్‌కు పడిపోగా, జులియన్ వెబెర్ (జర్మనీ, 1412) మూడు, పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ అర్షద్ నదీమ్ (పాకిస్థాన్, 1370) నాలుగో ర్యాంక్‌లో ఉన్నారు. జాకుబ్ (చెక్, 1366) ఐదో స్థానంతో టాప్-5లో నిలిచాడు.

నిఖత్ శుభారంభం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ మహిళల ఎలీట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్టార్ నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన ఈ పోటీల్లో 48-51 కిలోల విభాగంలో నిఖత్ 4-1తో రాశీ శర్మ (ఉత్తరప్రదేశ్)పై గెలిచింది. 60-65 కిలోల విభాగంలో మరో తెలంగాణ బాక్సర్ యషి శర్మ 5-0తో నిషా (తమిళనాడు)పై గెలిచింది. మిగతా తెలంగాణ బాక్సర్లలో 65-70 కిలోల విభాగంలో పూజ, 75-80 కిలోల కేటగిరీలో కీర్తి ఓటమి పాలయ్యారు.

దక్షిణాఫ్రికా 418/9

- ప్రిటోరియస్, బాష్ సెంచరీలు
- జింబాబ్వేతో తొలి టెస్టు



బులవాయో: అరంగేట్ర ఆటగాడు లువాన్ డ్రి ప్రిటోరియస్ (153)తోపాటు కార్బిన్ బాష్ (100 బ్యాటింగ్) శతక మోత మోగించడంతో జింబాబ్వేతో శనివారం మొదలైన తొలి టెస్టు మొదటి రోజు దక్షిణాఫ్రికా 400కు పైగా పరుగులు చేసింది. 55/4తో ఉన్న దశలో మరో అరంగేట్ర ఆటగాడు బ్రేవిస్ (51)తో కలిసి ఐదో వికెట్‌కు ప్రిటోరియస్ 95 రన్స్ జోడించాడు. అనంతరం బాష్ జతగా ఏడో వికెట్‌కు 108 రన్స్ జత చేశాడు. దాంతో ఆట ముగిసేసరికి సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 418/9 స్కోరు చేశారు. చివంగ 4 వికెట్లు పడగొట్టాడు. కాగా.. 19 ఏళ్ల 93 రోజుల్లో శతకం బాదిన ప్రిటోరియస్ అతి పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన దక్షిణాఫ్రికా క్రికెటర్‌గా 61 ఏళ్ల రికార్డును బద్దలుగొట్టాడు. 1964లో గ్రేమ్ పొలాక్ (19 ఏళ్ల 317 రోజులు) రికార్డును అధిగమించాడు.

బుమ్రా సిద్ధమేనా!

రెండోరోజు నెట్స్‌లో చెమటోడ్చిన పేసర్



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు భారత్ సన్నాహకాల్లో శనివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. పేస్ దళపతి బుమ్రా రెండో రోజు తీవ్రంగా సాధన చేయడమే ఆ పరిణామం. పని భారం నిర్వహణలో భాగంగా..వచ్చే నెల 2 నుంచి ఇక్కడ జరిగే రెండో టెస్టుకు బుమ్రాకు విశ్రాంతి ఇస్తారని విస్తృతంగా వార్తలు వస్తున్నాయి. వీటికి బలం చేకూరుస్తూ శుక్రవారం, తొలిరోజు మిగిలిన జట్టంతా ప్రాక్టీస్ చేసినా బుమ్రా పాల్గొనలేదు. బుమ్రాతోపాటు మరో పేసర్ ప్రసిద్ధ్ కూడా మొదటి రోజు సాధనకు దూరంగా ఉన్నాడు. దాంతో పనిభారం నిర్వహణలో భాగంగా బుమ్రా వైదొలగుతాడని, తొలి టెస్టులో అంతగా ఆకట్టుకోలేకపోయిన ప్రసిద్ధ్‌పై రెండో టెస్టుకు వేటు పడుతుందనే చర్చ మొదలైంది. అయితే ఈ సిరీస్‌లో 0-1తో భారత్ వెనుకంజలో ఉన్న నేపథ్యంలో రెండో టెస్టులో బుమ్రా ఆడాల్సిన అవసరం ఎంతో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక..శనివారంనాటి ప్రాక్టీస్‌లో పేస్ త్రయం బుమ్రా, సిరాజ్‌తోపాటు ప్రసిద్ధ్ శ్రమించారు. మొత్తంగా బుమ్రా ప్రాక్టీస్ చేయడంతో జట్టులో ఉత్సాహం నిండింది. కానీ రెండో టెస్టుకు తుది జట్టులో బుమ్రా ఉంటాడా అనే విషయమై స్పష్టత రాలేదు. ఇక.. బ్యాటర్ సాయి సుదర్శన్ రెండో రోజు సాధనలో తొలుత బ్యాటింగ్‌కు దిగాడు.

శతక్కొట్టిన మంధాన

- తెలుగమ్మాయి శ్రీచరణి విజృంభణ
- అరంగేట్ర మ్యాచ్‌లోనే 4 వికెట్లు





2 టీ20ల్లో భారత మహిళల జట్టుకిది రెండో అత్యధిక స్కోరు (210). గతేడాది వెస్టిండీస్‌పై 217 పరుగులు సాధించింది.

భారత్ తరఫున మహిళల టీ20ల్లో అత్యధిక స్కోరు (112) సాధించిన స్మృతీ మంధాన. హర్మన్‌ప్రీత్ (103)ను అధిగమించింది. అలాగే మూడు ఫార్మాట్లలోనూ శతకం బాదిన తొలి భారత ప్లేయర్‌గా స్మృతి నిలిచింది.

1 అంతర్జాతీయ మహిళల టీ20ల్లో ఏ వికెట్‌కైనా ఎక్కువ (21) 50+ భాగస్వామ్యాలు నమోదు చేసిన జోడీగా మంధాన-షఫాలీ. గతంలో అలీసా హీలీ-బెథ్ మూనీ (20) పేరిట ఈ రికార్డు ఉండేది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 210/5 (స్మృతీ మంధాన 112, హర్లీన్ డియోల్ 43, షఫాలీ 20; బెల్ 3/27).
ఇంగ్లండ్: 14.5 ఓవర్లలో 113 ఆలౌట్. (సివర్ 66; శ్రీచరణి 4/12, రాధా యాదవ్ 2/15, దీప్తి శర్మ 2/32).

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు ఘనంగా బోణీ చేసింది. తాత్కాలిక కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతీ మంధాన (62 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 112) తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీతో అదరగొట్టింది. ప్రత్యర్థి బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం చూపిన స్మృతి ఆఖరి ఓవర్‌లో వెనుదిరగగా, హర్లీన్ డియోల్ (23 బంతుల్లో 7 ఫోర్లతో 43) అద్భుత సహకారం అందించింది. ఇక, తెలుగమ్మాయి, కడప జిల్లాకు చెందిన శ్రీచరణి తన అరంగేట్ర మ్యాచ్‌లోనే సత్తా చాటుతూ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టింది. ఫలితంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 97 రన్స్‌తో ఘన విజయం సాధించింది. టీ20ల్లో ఇంగ్లండ్‌కిదే అతిపెద్ద ఓటమి. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 1-0తో పైచేయి సాధించింది. రెండో మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. లారెన్ బెల్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. తొలి అంతర్జాతీయ టీ20 ఆడిన యువ స్పిన్నర్ శ్రీచరణి (3.5-0-12-4) అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో ఇంగ్లండ్ 14.5 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ జట్టులో కెప్టెన్ సివర్ బ్రంట్ (42 బంతుల్లో 10 ఫోర్లతో 66) మినహా ఎవరూ రాణించలేదు. రాధా యాదవ్, దీప్తి శర్మలకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మంధాన నిలిచింది. వామప్ మ్యాచ్‌లో తలకు గాయం కావడంతో ముందు జాగ్రత్తగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు విశ్రాంతినిచ్చారు.

మంధాన, హర్లీన్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ మంధాన, వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరును అందించారు. అయితే చివర్లో పుంజుకున్న ఇంగ్లండ్ బౌలర్లు కాస్త కట్టడి చేయగలిగారు. ఆరంభంలో మరో ఓపెనర్ షఫాలీ (20) తడబడినా.. మంధాన సహజశైలిలో బ్యాట్ ఝుళిపించింది. మైదానం నలువైపులా భారీ షాట్లు ఆడేస్తూ చకచకా స్కోరును పెంచింది. తొలి వికెట్‌కు షఫాలీతో కలిసి 77 పరుగులు అందించింది. ఆ తర్వాత హర్లీన్ రాకతో భారత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. పదో ఓవర్‌లో ఆమె మూడు ఫోర్లు సాధించింది. అలాగే మంధాన సిక్సర్‌తో స్కోరు 11వ ఓవర్‌లోనే వందకి చేరింది. అయితే హర్లీన్ 26 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను వ్యాట్ హాడ్జ్ వదిలేసింది. అటు అవలీలగా బౌండరీలు బాదేసిన మంధాన 51 బంతుల్లోనే టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ పూర్తి చేసుకుంది. 16వ ఓవర్‌లో హర్లీన్‌ను పేసర్ లారెన్ బెల్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 94 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అనంతరం భారత్ వేగంగా వికెట్లను కోల్పోయింది. రిచా (12), జెమీమా (0) 18వ ఓవర్‌లో వెనుదిరిగారు. ఆఖరి ఓవర్‌లో ఫోర్‌తో స్కోరును 200కి చేర్చిన స్మృతి మంధాన ఆ వెంటనే అవుటైంది. మొత్తంగా చివరి మూడు ఓవర్లలో జట్టు 26 పరుగులే సాధించింది.

ఆసియా స్నూకర్‌లో భారత్‌కు స్వర్ణం

కొలంబో: ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంప్ భారత్ స్వర్ణాన్ని నిలబెట్టుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో పంకజ్ అడ్వాణీ, బ్రిజేష్ దమానిలతో కూడి భారత జట్టు 3-1తో బలమైన మలేసియాను ఓడించింది. రెండేళ్ల క్రితం ఇరాన్‌లో జరిగిన టోర్నీలో భారత్ పసిడిని సొంతం చేసుకొంది. తొలి సింగిల్స్‌లో బ్రిజేష్ ఓడినా.. తర్వాత పంకజ్ నెగ్గి సమం చేశాడు. డబుల్స్‌లో పంకజ్/దమాని జంట గెలిచి భారత్‌కు బంగారు పతకాన్ని అందించింది.

సెమీస్‌కు తన్వీ, ఆయుష్

లోవా (యూఎస్): భారత వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఆయుష్ శెట్టి యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో సెమీస్‌కు చేరుకొన్నారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో తన్వీ 21-13, 21-16తో కరుపతేవన్ లెట్స్‌హానా (మలేసియా)పై నెగ్గింది. కాగా, పురుషుల సింగిల్స్‌లో జూనియర్ వరల్డ్ చాంపియన్ కుయో కువాన్ లిన్ (చైనీస్ తైపీ)పై ఆయుష్ 22-20, 21-9తో సంచలన విజయం సాధించాడు.

ఒక్క సెషన్‌లోనే కూల్చారు

విండీస్ చిత్తు ● 159 రన్స్‌తో ఆసీస్ గెలుపు



బ్రిడ్జిటౌన్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టును ఆస్ట్రేలియా మూడు రోజుల్లోనే ముగించింది. 301 పరుగుల లక్ష్య ఛేదన కోసం శుక్రవారం చివరి సెషన్‌లో విండీస్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే పేసర్ హాజెల్‌వుడ్ (5/43) ధాటికి కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్ 159 పరుగులతో భారీ విజయం దక్కించుకుంది. మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. షామర్ జోసెఫ్ (44), గ్రీవ్స్ (38 నాటౌట్) రాణించారు. అంతకుముందు ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 310 పరుగులు చేసింది. షామర్‌కు 5 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 180, విండీస్ 190 రన్స్ చేశాయి. మరోవైపు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ చరిత్రలో పదిసార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాధించిన ఏకైక బ్యాటర్‌గా ట్రావిస్ హెడ్ రికార్డు నెలకొల్పాడు.

శ్రీలంక ఇన్నింగ్స్ విజయం

రెండో టెస్టులో బంగ్లా ఓటమి ● కెప్టెన్సీకి షంటో గుడ్‌బై


కొలంబో: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 1-0తో గెలుచుకుంది. తొలి టెస్టు డ్రాగా ముగియగా.. చివరిదైన కొలంబో టెస్టులో లంక ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో నెగ్గింది. 211 పరుగుల లోటుతో శనివారం నాలుగో రోజు 115/6 ఓవర్‌నైట్ స్కోరుతో బంగ్లా రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. అయితే లెఫ్టామ్ స్పిన్నర్ ప్రబాత్ జయసూరియ 5 వికెట్లతో దెబ్బతీయడంతో బంగ్లా 133 పరుగులే చేసింది. అంతకుముందు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 247, శ్రీలంక 458 రన్స్ సాధించింది. అటు బంగ్లా చిత్తుగా ఓడడంతో కెప్టెన్ నజ్ముల్ షంటో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించాడు. 2023లో బాధ్యతలు తీసుకున్న అతడి ఆధ్వర్యంలో బంగ్లా 14 టెస్టులు ఆడగా నాలుగింట్లో నెగ్గింది.

ప్రొ హాకీ లీగ్ నుంచి భారత్ అవుట్

బెర్లిన్: ఎఫ్ఐహెచ్ ప్రొ హాకీ లీగ్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0-3తో చైనా చేతిలో చిత్తయింది. వరుసగా ఏడో ఓటమితో అట్టడుగున నిలిచిన భారత్.. 2025-26 సీజన్‌లో ప్రొ హాకీ లీగ్ నుంచి నిష్క్రమించింది.

ఆరోగ్య బీమా... జాగ్రత్తలతో

మరింత ధీమా...



వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరిగిపోతున్నాయి. ఈ ఖర్చుల భారం తప్పించుకోవాలంటే ఆరోగ్య బీమానే గతి. లేకపోతే ఇల్లూ,ఒళ్లూ గుల్లే. అలా అని ఏజెంట్లు చెప్పే మాటలు నమ్మి ఎడాపెడా ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోకూడదు. అలా చేస్తే కష్ట సమయాల్లో అక్కరకు రాకపోగా మన జేబుకే చిల్లు పడే ప్రమాదం ఉంది.

చాలా మంది ఏ మాత్రం ఆలోచించకుండానే ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటున్నారు. పాలసీ షరతులు, పరిమితుల గురించి పెద్దగా తెలుసుకోకుండానే ఏజెంట్లు చెప్పే మాటలు నమ్మి పాలసీలు తీసుకుంటున్నారు. పాలసీ తీసుకున్నాం, ఇక ఏ ఆరోగ్య సమస్య వచ్చినా బీమా కంపెనీనే భరిస్తుందనే భ్రమల్లో ఉంటున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ ఆరోగ్య బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి.

దీంతో చాలా మంది స్విగ్గీ, జొమాటాలో బిర్యానీ లేదా ఇతర తినుబండారాలు ఆర్డర్ చేసినంత ఈజీగా ఆరోగ్య బీమా పాలసీలు కొనేస్తున్నారు. ఆ పాలసీ షరతులు ఏంటి? కవరేజీ పరిమితులు, మినహాయింపుల గురించి ఏమాత్రం అర్థం చేసుకోవడం లేదు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రిలో చేరేటప్పుడు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిమితులు, మినహాయింపులను అడ్డుపెట్టుకుని బీమా కంపెనీలూ క్లెయిమ్స్‌కు సారీ చెబుతున్నాయి. ఈ సమస్యలు రాకుండా ఉండాలంటే ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడే జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి. అవేమిటంటే..

అవగాహన

ఆరోగ్య బీమా అనేది ఒక భరోసా. అయితే వ్యాపారం పెంచుకునేందుకు కంపెనీల ఏజెంట్లు ఇప్పుడు దీన్ని కూడా వస్తువులను అమ్మినట్టు అమ్మేస్తున్నారు. పాలసీ తీసుకునే వ్యక్తికి పెద్దగా అవగాహన లేకపోతే లేని ప్రయోజనాలను ఉన్నట్టు చెప్పి మరీ అంటగడుతున్నారు. కాబట్టి కొత్తగా ఆరోగ్య బీమా తీసుకునే వ్యక్తి లేదా వ్యక్తులు పాలసీ గురించి పూర్తిగా అవగాహన చేసుకున్నాకే పాలసీ తీసుకోవడం మంచిది. ఇందుకోసం పాలసీ షరతులు, కవరేజీ పరిమితులు, మినహాయింపులను ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకోవాలి. ఒకవేళ అర్థంగాకపోతే ఎవరైనా ఆర్థిక సలహాదారుని సంప్రదించడం మంచిది.

ఇప్పటికే ఉన్న వ్యాధులు

దాదాపు అన్ని బీమా కంపెనీలు ఇప్పటికే ఉన్న వ్యాధులకు వెంటనే కవరేజీ అనుమతించవు. కనీసం రెండు మూడేళ్ల తర్వాతే ఇందుకు అనుమతిస్తాయి. ఒకవేళ ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు కూడా వెంటనే కవరేజీ కావాలంటే ప్రీమియం కొద్దిగా ఎక్కువ చెల్లించాలి.

మెటర్నిటీ ట్రీట్‌మెంట్లు

ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడే మెటర్నిటీ ట్రీట్‌మెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. లేకపోతే బీమా కంపెనీలు ఇందుకు అనుమతించవు. ఒకవేళ అనుమతించినా అందుకు సవాలక్ష పరిమితులు, ఆంక్షలు పెడుతుంటాయి.

ఆధునిక ట్రీట్‌మెంట్లు

ఆరోగ్య సమస్యలతో పాటు ట్రీట్‌మెంట్లు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. టెక్నాలజీ అభివృద్ధితో ఇప్పుడు అధునాతన రోబోటిక్ సర్జరీలు, జన్యు (జెనెటిక్) పరీక్షలూ అందుబాటులోకి వచ్చాయి. పాలసీ తీసుకునేటప్పుడే ఇవి కూడా కవరయ్యేలా జాగ్రత్త పడాలి.

మానసిక రుగ్మతలు

మానసిక రుగ్మతలకు కూడా ఆరోగ్య బీమా వర్తింప చేయాలని బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఆదేశాలు జారీ చేసింది. అయినా ఈ ఆప్షన్ ఒకటి ఉందనే విషయాన్ని బీమా కంపెనీలు పెద్దగా పాలసీదారులకు చెప్పడం లేదు. మానసిక ఒత్తిళ్లు పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఆరోగ్య బీమా పాలసీ కింద ఈ రుగ్మతలకు కూడా కవరేజీ ఉండేలా చూసుకోవాలి.

గదుల అద్దె

కొన్ని ఆరోగ్య సమస్యలకు ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరక తప్పదు. అయితే ఇందుకు అయ్యే రూమ్ రెంట్‌పై బీమా కంపెనీలు అనేక పరిమితులు పెడుతుంటాయి. ఆ పరిమితికి మించి రూమ్ రెంట్ ఉంటే ఆ అదనపు మొత్తాన్ని పాలసీదారులే భరించాలి. కొన్ని బీమా కంపెనీలు రూమ్ రెంట్ ఎంత ఉన్నా, అది పాలసీ కవరేజీకి లోబడి ఉంటే చాలని చెబుతున్నాయి. పాలసీ తీసుకునేటప్పుడే పాలసీదారులు ఈ విషయంలో జాగ్రత్త పడాలి. లేకపోతే జేబుకు చిల్లు పడుతుంది.

ఓపీడీ, వ్యాధి నిర్ధారణ

ఇవాళ ఔట్ పేషెంట్ సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా పెద్దభారంగా మారాయి. పెద్దపెద్ద ఆస్పత్రుల్లో డాక్టర్ కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడే ఈ ఖర్చులకూ కవరేజీ ఉండేలా జాగ్రత్త పడాలి. అయితే బీమా కంపెనీలు ఒక పరిమితి వరకే ఈ ఖర్చులను అనుమతిస్తాయి.

ఇతర జాగ్రత్తలు

- పాలసీ తీసుకునే ముందే పాలసీ బ్రోచర్‌ను కాకుండా పాలసీ పూర్తి డాక్యుమెంట్ తీసుకుని చదివి పూర్తిగా అర్థం చేసుకోవాలి.
- పాలసీ ద్వారా ఏయే సమస్యలకు కవరేజీ లభించదో ముందుగానే పూర్తిగా తెలుసుకోవాలి.
- బీమా కంపెనీల పరిభాష అందరికీ అర్థం కాదు. పాలసీలో పేర్కొనే సబ్ లిమిట్స్, కో-పే, వెయిటింగ్ పీరియడ్ అంటే ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకోవాలి.
- వివాహం, పిల్లలు పుట్టినప్పుడు, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నప్పుడు మీరు తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీ మీ అవసరాలకు సరిపోతుందా? లేదా? అనే విషయాన్ని సమీక్షించుకోవాలి.
- మీ ఆరోగ్య బీమా పాలసీ కంపెనీ, పాలసీ వివరాలపై కుటుంబసభ్యులకు ముందుగానే పూర్తిగా తెలియజేయాలి. ఎందుకంటే ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే అన్ని విషయాలు చక్కబెట్టాల్సిందే వారే.

ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే ముందే ఈ జాగ్రత్తలు తీసుకుంటే, అవసరమైనప్పుడు జేబులో పైసా ఖర్చు చేయకుండా ఆరోగ్య సమస్యల నుంచి తేలిగ్గా గట్టెక్కవచ్చు. లేకపోతే ఆరోగ్య పరంగానే కాకుండా ఆర్థికంగానూ దెబ్బతినే ప్రమాదం ఉంది.

బిజినెస్ ప్లస్

హాస్పిటల్ సేవలపై జీఎస్‌టీ వర్తిస్తుందా?

మన దేశంలో ఆరోగ్య రంగం ఈ మధ్య కాలంలో బాగా విస్తరించింది. మన దగ్గర వైద్య సేవలు పొందేందుకు విదేశాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. మరి ఇంత ప్రాముఖ్యత కలిగిన హెల్త్‌కేర్ రంగానికి సంబంధించి జీఎస్‌టీ ప్రభావం ఏమిటో తెలుసుకుందాం.

ఏ ప్రభుత్వమైనా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించాలనే ప్రయత్నిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సంరక్షణకు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. దీన్ని బట్టి ఏదేనీ ఒక క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అందించే అన్ని రకాల ఆరోగ్య సంరక్షణ సేవలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభిస్తుంది. మరి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఆరోగ్య సంరక్షణ సేవలు అంటే ఏమిటి?

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అంటే ఏదేనీ ఒక వైద్యశాల అంటే హాస్పిటల్, క్లినిక్, నర్సింగ్ హోమ్ లేదా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే లాబ్స్ మొదలైనవి. అలాగే హెల్త్‌కేర్ సర్వీస్ అంటే అన్ని రకాల వ్యాధులకు చేసే వైద్యం. అంటే ఏదేనీ ఒక హాస్పిటల్ రోగులకు అందించే మొత్తం వైద్యంతో పాటుగా ఒక మెడికల్ ప్రాక్టీషనర్, పారామెడికల్స్ అందించే వైద్య సేవలకు కూడా జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంది. అంతేకాకుండా, ఇన్‌పేషెంట్ ట్రీట్‌మెంట్‌కు కూడా మినహాయింపు ఉంది. అంటే, వైద్యం కోసం ఏదేనీ ఒక వ్యక్తి హాస్పిటల్‌లో అడ్మిట్ అయినప్పుడు అతను చెల్లించే మొత్తం బిల్లు మీద అంటే చికిత్సతో పాటు రూమ్‌రెంట్, డాక్టర్ కన్సల్టింగ్ చార్జీలు, అతనికి సమకూర్చే భోజనం, మందులు మొదలైన వాటి మీద జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇవే కాకుండా అంబులెన్స్‌కు సంబంధించి ఏదైనా సర్వీస్ పొందినా దానికి కూడా జీఎస్‌టీ వర్తించదు.



రాంబాబు గొండాల

అయితే, రూమ్ రెంట్‌కు సంబంధించి 2022 జూలై నుంచి ఒక మార్పు చేయటం జరిగింది. దీని ప్రకారం రూమ్ అద్దె రోజుకు రూ.5,000 దాటే పక్షంలో దాని మీద 5 శాతం జీఎస్‌టీని చెల్లించాల్సి ఉంటుంది. కానీ, దీనికి సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునే సౌలభ్యం సదరు హాస్పిటల్‌కు లేదు. ఇకపోతే, ఈ 5 శాతం జీఎస్‌టీ అనేది సాధారణ రూమ్‌లకు మాత్రమే. అంటే ఐసీయూ లాంటి వాటికి అద్దె ఎంత ఉన్నా జీఎస్‌టీ వర్తించదు.

అలాగే ఈ మధ్య కాలంలో సౌందర్యం ఇనుమడించటానికి కాస్మెటిక్, ప్లాస్టిక్ సర్జరీ, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ మొదలైన సేవలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వీటికి జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభించదు. కానీ ఏదేనీ ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఇవి చేయాలంటే మాత్రం మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు అందం కోసం ఒక వ్యక్తి ముక్కు లేదా ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే మినహాయింపు లభించదు. ఒకవేళ ఆ వ్యక్తి ఏదేనీ ప్రమాదానికి గురయి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాల్సి వస్తే మాత్రం జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభిస్తుంది. పైన చెప్పినవన్నీ హాస్పిటల్ అందించే సేవలు. మరి హాస్పిటల్ పొందే సేవల మాటేమిటి? ఉదాహరణకు హౌస్ కీపింగ్, మెయింటెనెన్స్, సెక్యూరిటీ మొదలైన సేవలను బయటి వ్యక్తుల నుంచి పొందినప్పుడు వాటికి ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు. అలాగే హాస్పిటల్‌లో నిర్వహించే మెడికల్ షాప్, క్యాంటీన్ అమ్మకాలకు కూడా జీఎస్‌టీ నుంచి మినహాయింపు లేదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

మార్కెట్లోకి వీ-గార్డ్ స్మార్ట్ వాటర్ హీటర్స్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ సంస్థ వీ-గార్డ్ మార్కెట్లోకి స్మార్ట్ వాటర్ హీటర్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వీ-గార్డ్ ఎండీ మిథున్ చిట్టిలపిల్లి మాట్లాడుతూ.. లగ్జరీ, స్మార్ట్ లివింగ్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఈ సరికొత్త వాటర్ హీటర్స్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ కొత్త వాటర్ హీటర్ల శ్రేణిని వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా డిజైన్ చేసినట్లు ఆయన తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) కనెక్టివిటీతో ఈ ప్రీమియం శ్రేణి వాటర్ హీటర్ మోడల్స్‌ను రూపొందించినట్లు మిథున్ చెప్పారు. వారంటీతో పాటు అందుబాటు ధరలతో వీటిని మార్కెట్లోకి తెచ్చామన్నారు.

రెయిన్‌బో గూటికి ప్రశాంతి హాస్పిటల్

వరంగల్‌కు చెందిన ప్రశాంతి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రశాంతి హాస్పిటల్)ను రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్) చేజిక్కించుకుంది. ప్రశాంతి హాస్పిటల్‌లో 76 శాతం వాటాను రూ.24.85 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆర్‌సీఎంఎల్ శనివారం ప్రకటించింది



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,420 ▼	89,200 ▼	1,17,800 ▼
విజయవాడ	98,650 ▼	92,600 ▼	1,09,000 ▲
విశాఖపట్నం	97,420 ▼	89,300 ▼	1,17,800 ▼
రాజమండ్రి	97,420 ▼	89,300 ▼	1,08,900 ▼
ప్రొద్దుటూరు	96,450 ▼	88,730 ▼	1,00,070 ▼
ముంబై	95,784 ▼	87,738 ▼	1,05,193 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	575
వరంగల్	562	గోదావరి	565
చిత్తూరు	633	విశాఖపట్నం	580
		డజను గుడ్లు రూ.	78



ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	95
వరంగల్	90	గుంటూరు	100
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	90
కర్నూలు	90	నెల్లూరు	95
విశాఖపట్నం	84	అనంతపురం	95
గోదావరి	95		

స్కూల్లో జుంబా డ్యాన్స్ చేయాల్సిందే!

» కేరళ విద్యామంత్రి శివన్‌కుట్టి స్పష్టీకరణ

కోచి, జూన్ 28: కేరళ పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల దేహదారుఢ్యాన్ని పెంచే జుంబా డ్యాన్స్‌ను ప్రవేశపెట్టాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ నిర్ణయాన్ని అక్కడి ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జుంబా పేరుతో ఆడ, మగ కలిసి మెలిసి వ్యవహరించడాన్ని, కురచ దుస్తుల్లో కలిసి నృత్యం చేయడాన్ని సహించేది లేదని హెచ్చరించాయి. అయితే, కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఈ విషయంలో పట్టుదలతో ఉంది. మాదక ద్రవ్యాల కన్నా జుంబా నృత్యం పట్ల వ్యతిరేకతే ప్రమాదకరంగా ఉందని కేరళ విద్యామంత్రి శివన్‌కుట్టి వ్యాఖ్యానించారు. జుంబాను వ్యతిరేకించడం ద్వారా మతతత్వాన్ని ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల కరిక్యులమ్‌లో జుంబా నృత్యాన్ని భాగంగా చేసినందున దాన్ని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. జుంబాకు పంపడం, పంపక పోవడం లాంటి చాయిస్ తల్లిదండ్రులకు లేదని తేల్చిచెప్పారు. స్కూల్ డ్రస్‌తోనే జుంబా నృత్యం చేయవచ్చని అన్నారు.

ఘర్షణ పడ్డ విద్యార్థిపై ఎన్ఎస్ఏ చట్టమా: సుప్రీం

న్యూఢిల్లీ, జూన్ 28: మధ్యప్రదేశ్‌కు చెందిన న్యాయ శాస్త్ర విద్యార్థిని జాతీయ భద్రత చట్టం(ఎన్ఎస్ఏ) కింద ముందస్తుగా నిర్బంధంలోకి తీసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వెంటనే ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. ఆ విద్యార్థిని ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవాలంటూ 2024 జులై 11న మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తప్పుపట్టింది. బేతుల్‌లోని విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అనికేత్ అలియాస్ అన్ను అనే లా విద్యార్థి ఓ ప్రొఫెసర్‌తో ఘర్షణకు దిగడంతో ఆయనపై కేసు నమోదయింది. హత్యాయత్నం, ఇతర సెక్షన్ల కింద కేసులు పెట్టారు. అతనిపై ఇతర క్రిమినల్ కేసులు కూడా ఉండడంతో ఎన్ఎస్ఏ కింద ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అనంతరం భోపాల్‌లోని సెంట్రల్ జైలుకు పంపించారు. ఆ ఆదేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి మొత్తం నాలుగుసార్లు పొడిగిస్తూ వచ్చారు. దీంతో సదరు విద్యార్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి..16మంది మృతి

పెషావర్, జూన్ 28: ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా రాష్ట్రంలో శనివారం తాలిబన్ అనుకూల హఫీజ్ గుల్ బహదూర్ సంస్థ జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది భద్రతా సిబ్బంది మృత్యువాత పడగా, మరో 24 మందికి పైగా గాయపడ్డారని పాకిస్థాన్ సైన్యాధికారులు తెలిపారు. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలోని ఖాద్దీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో అక్కడికక్కడే 13 మంది మృతి చెందగా, మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పేలుడు దాటికి రెండిళ్లపై కప్పు కూలిపోవడంతో ఆరుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు.

బుద్ధి మారని పాక్..ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణం

న్యూఢిల్లీ, జూన్ 28: ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్ర శిబిరాలను పునర్నిర్మించేందుకు ఏకంగా పాకిస్థాన్ ప్రభుత్వమే ముందుకు వచ్చింది. నిధులు సమకూర్చడంతోపాటు నిపుణుల సహకారాన్ని కూడా అందిస్తోంది. ఉగ్రవాద శిబిరాలను తిరిగి నిర్మించడంతోపాటు, వారి లాంచ్‌ప్యాడ్లను మరింత ఆధునీకరిస్తోంది. ఈ మేరకు భారత ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. ఆయా నిర్మాణాలకు నేరుగా పాక్ ప్రభుత్వంతోపాటు, పాక్ ఇంటెలిజెన్స్.. ఐసిస్, ఆ దేశ ఆర్మీ సహకరిస్తున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. పునర్నిర్మాణం చేస్తున్న వాటిలో కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ, బహవాల్‌పూర్‌లోని జైషే మహమ్మద్ కేంద్ర కార్యాలయం కూడా ఉందని పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా సరిహద్దు ప్రాంతాల్లో చిన్న, సాంకేతిక వ్యవస్థలతో కూడిన శిబిరాల పునర్నిర్మాణానికి పాక్ ఆర్మీ సహా ఐసిస్ నిధులు సమకూరుస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వీటిని ఎవరూ గుర్తించని తరహా అంటే ఎలాంటి సెన్సార్‌లకు చిక్కని వ్యవస్థలతో నిర్మిస్తున్నారని తెలిపాయి. అదేవిధంగా అంతర్జాతీయ సరిహద్దుల్లో 4 లాంచ్ ప్యాడ్స్‌ను తిరిగి ఆధునీకరిస్తున్నారు.

ముంబైలో 8 రోజులు 'డిజిటల్ అరెస్ట్'లో డాక్టర్

» రూ.3 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

ముంబై, జూన్ 28: 'డిజిటల్ అరెస్ట్' అనేదే ఉండదంటూ ఎంతగా ప్రచారం చేస్తున్నప్పటికీ అనేక మంది దీని బారిన పడుతూ కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ దోచుకుంటున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే ముంబైలో వెలుగుచూసింది. 70 ఏళ్ల వయసున్న ఓ డాక్టర్‌ను సైబర్ నేరగాళ్లు ఏకంగా 8 రోజులు డిజిటల్ అరెస్ట్ చేశారు. అంతేకాకుండా ఆ డాక్టర్ నుంచి రూ.3 కోట్లు కొల్లగొట్టారు. బాధితురాలికి గత నెలలో అమిత్ కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. టెలికం ఆపరేటర్‌ను అని చెప్పి వివరాలను సేకరించాడు. తర్వాత పోలీసునని మరో వ్యక్తి ఫోన్ చేసి మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదైందని చెప్పి భయపెట్టాడు. ఆ తర్వాత ఆమెపై ఎనిమిది రోజుల పాటు వీడియో నిఘా పెట్టారు. ఈ క్రమంలో తీవ్ర భయాందోళనలకు గురైన ఆమె.. నేరగాళ్లు ఇచ్చిన పలు బ్యాంకు ఖాతాలకు రూ.3 కోట్లు బదిలీ చేశారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత కార్తీక్ మహారాజ్ నన్ను రేప్ చేశారు.. అబార్షన్ చేయించారు!

» బెంగాల్ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు

కోల్‌కతా, జూన్ 28: పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారత్ సేవాశ్రమ సంఘానికి చెందిన సాధువు కార్తీక్ మహారాజ్ (స్వామీ ప్రదీప్తానంద) టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తనపై 2013 నుంచి అనేకసార్లు అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ ఆరోపించింది. ఆయన వల్ల గర్భం దాల్చిన తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని తెలిపింది. కార్తీక్ మహారాజ్ పశ్చిమ బెంగాల్‌లోని ముషీరాబాద్ జిల్లా బేల్‌డాంగా ఆశ్రమానికి అనుబంధంగా ఉన్నారు. 2012 డిసెంబరులో ఆయనను కలిశానని, ఆశ్రమానికి చెందిన ఆదివాసీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారని బాధితురాలు నబాగ్రామ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. 2013 జనవరిలో తనకు పాఠశాల హాస్టల్‌లో బస కల్పించారని, అప్పటి నుంచి కార్తీక్ మహారాజ్ పలుమార్లు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించింది. ఈ ఆరోపణలను కార్తీక్ మహారాజ్ ఖండించారు.

2029 ప్రపంచ పోలీస్ క్రీడలు భారత్‌లో

న్యూఢిల్లీ, జూన్ 28: మరో నాలుగేళ్ల తర్వాత 2029లో నిర్వహించబోయే ప్రతిష్ఠాత్మక ప్రపంచ పోలీస్, అగ్నిమాపక క్రీడలకు భారత్ తొలిసారి ఎంపికైంది. అహ్మదాబాద్ వేదికగా ఈ క్రీడలు నిర్వహించనున్నారు. 1985 నుంచి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ పోటీల్లో భారత్ 2007లో తొలిసారి పాల్గొంది. నాటి నుంచి ఇప్పటివరకు భారత్ 1400కు పైగా పతకాలు గెలుచుకుంది. ఇప్పటివరకు ఈ క్రీడలను అమెరికా 8 సార్లు, కెనడా 5, యూరప్ 4, యూకే 2, చైనా ఒకసారి నిర్వహించాయి. సర్వీసులో ఉన్న వారితో పాటు రిటైరైన పోలీస్, అగ్నిమాపక దళ సిబ్బంది, విపత్తు సేవల సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులు. ఈసారి 50 అంశాల్లో క్రీడలు నిర్వహిస్తారు. 2029 ప్రపంచ పోలీస్ క్రీడలకు ఎంపిక కావడం భారత్‌కు గర్వకారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

భారత్‌కు పంపే సొమ్ముపై రెమిటెన్స్ పన్ను లేనట్టే!

వాషింగ్టన్, జూన్ 28: అమెరికాలోని భారతీయులకు భారీ ఊరట లభించింది. అక్కడ సంపాదించి స్వదేశాలకు పంపే సొమ్ము (రెమిటెన్స్‌)పై ప్రతిపాదించిన పన్నును.. అమెరికా చట్టసభ సెనేట్ 3.5 శాతం నుంచి ఒక శాతానికి తగ్గించింది. అంతేకాదు అమెరికాలోని బ్యాంకు ఖాతాలు, అక్కడ జారీ అయిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బదిలీ చేసే సొమ్మును ఈ పన్ను నుంచి మినహాయించింది. కేవలం నగదు, మనీ ఆర్డర్, చెక్కుల రూపంలో పంపే రెమిటెన్సులకే పన్ను వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు 'బిగ్ బ్యూటీఫుల్ చట్టం' ముసాయిదాలో సెనేట్ మార్పులు చేసింది. అంటే సాంకేతికంగా రెమిటెన్సులపై పన్ను దాదాపుగా లేనట్టే! అమెరికాకు వలస వచ్చిన ఉద్యోగులు, వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తున్నవారు అక్కడ సంపాదించి స్వదేశాలకు పంపే సొమ్ము (రెమిటెన్సు)లపై 5 శాతం పన్ను వేస్తామని ట్రంప్ యంత్రాంగం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' బిల్లు ప్రతినిధుల సభ ఆమోదం కూడా పొందింది.

డిశ్చార్జికి ముందే బర్త్ సర్టిఫికెట్!

» మంజూరు చేయాలని రాష్ట్రాలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నిర్దేశం

న్యూఢిల్లీ, జూన్ 28: ఆస్పత్రుల్లో జన్మించిన నవజాత శిశువులకు వారు డిశ్చార్జి కావడానికి ముందే తల్లులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) రాష్ట్రాలను కోరింది. ప్రధానంగా 50 శాతం పైగా జననాలు జరిగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. జనన నమోదు పూర్తయిన తర్వాత రిజిస్ట్రార్ వీలైనంత త్వరగా బర్త్ సర్టిఫికెట్‌ను ఎలక్ట్రానిక్ లేదా ఏ ఇతర ఫార్మాట్‌లోనైనా మంజూరు చేయాలని తెలిపింది. ఇందుకు ఏడు రోజుల కంటే సమయం మించరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్‌జీఐ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రిజిస్ట్రేషన్ యూనిట్లుగా పనిచేస్తున్నాయని పేర్కొంది. బర్త్ సర్టిఫికెట్‌కు పెరిగిన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, దాన్ని తక్షణం జారీ చేయాల్సిన అవసరాన్ని ఆయా యూనిట్ల రిజిస్ట్రార్‌లు గుర్తించాలని సూచించింది. 2023, అక్టోబరు 1 నుంచి విద్యాసంస్థల్లో అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలు, వివాహ నమోదు తదితర అవసరాలకు డిజిటల్ బర్త్ సర్టిఫికెట్ అనేది పుట్టిన తేదీకి ఒకేఒక్క ఆధారంగా ఉంది. జనన, మరణాల నమోదు చట్టం- 1969 ప్రకారం జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీచేస్తూ వస్తున్నారు. అన్ని జననాలు, మరణాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయడాన్ని 2023, అక్టోబరు 1 నుంచి తప్పనిసరి చేశారు.

టూవీలర్లకు రెండు హెల్మెట్లు తప్పనిసరి!

» కొనుగోలు సమయంలోనే వాటిని వాహన తయారీదారులు అందించాలి

» కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన

న్యూఢిల్లీ, జూన్ 28: ద్విచక్రవాహన తయారీదారులు వాహనం కొనుగోలు సమయంలోనే వినియోగదారులకు రెండు హెల్మెట్లు అందించడం తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ కొత్త నియమాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్ర మోటార్ వాహనాల రూల్స్-1989కు పలు ముఖ్యమైన మార్పులను ప్రతిపాదించింది. కొత్త సవరణ నియమాల తుది నోటిఫికేషన్ అధికారిక గెజిట్‌లో ప్రచురించిన తర్వాత మూడు నెలల్లోపు ఈ రూల్ తప్పనిసరి అవుతుందని ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారి భద్రత కోసం కొత్త నిబంధనను తీసుకురానున్నట్లు తెలిపింది. హెల్మెట్ నిబంధనతో పాటు ప్రభుత్వం మరో భద్రతా చర్యను కూడా ప్రతిపాదించింది. 2026, జనవరి 1 నుంచి 50 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం లేదా గంటకు 50 కిలోమీటర్ల వేగం దాటే మోటార్ సైకిళ్లు, స్కూటర్లు సహా అన్ని కొత్త ఎల్2 క్యాటగిరీ ద్విచక్ర వాహనాలకు యాంటీ-లాక్ బ్రేకింగ్ వ్యవస్థ(ఏబీఎస్)లను అమర్చాల్సి ఉంటుంది. ఇది ముఖ్యంగా వాహనానికి ఆకస్మికంగా బ్రేక్ వేసిన సమయంలో మెరుగైన నియంత్రణ కల్పించడంతో పాటు జారిపోయే అవకాశాలను తగ్గిస్తుంది.

ఎంతో గొప్పది నా దేశం!

అంతరిక్షం నుంచి చాలా ఘనంగా కనిపిస్తోంది

» భూగోళాన్ని చూస్తుంటే ఏ సరిహద్దులూ లేని ఏకత్వ భావన కలుగుతోంది

» ఐఎస్ఎస్ నుంచి శుభాన్షు శుక్లా

» వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని

» మీ యాత్ర కొత్త శకానికి శుభారంభం

» గగన్‌యాన్‌కు తొలి అడుగు: మోదీ



ఐఎస్ఎస్‌లో ఇతర వ్యోమగాములతో శుభాన్షు శుక్లా

న్యూఢిల్లీ, జూన్ 28: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 18 నిమిషాలపాటు సాగిన ఈ సంభాషణలో.. 'ఎలా ఉన్నారు? అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఐఎస్ఎస్‌లోకి వెళ్లగానే ఏమనిపించింది?' అని మోదీ శుక్లాను ఆరా తీశారు. తాను క్షేమంగా ఉన్నానని, ఐఎస్ఎస్ నుంచి చూసినప్పుడు భారత్ ఎంతో గొప్పగా, చాలా పెద్దగా కనిపించిందని శుక్లా చెప్పారు. మొదటిసారి బయటి నుంచి భూగోళాన్ని చూస్తే ఏ ఎల్లలూ లేవనిపించిందని, ఏకత్వ భావన కలిగిందని తెలిపారు. ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుక్లా చరిత్ర సృష్టించారు. శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు ఈ నెల 25న అమెరికాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ఎక్స్ వ్యోమనౌకలో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. శుక్లా బృందం అక్కడ 14 రోజుల పాటు వివిధ అంశాలపై పరిశోధనలు చేయనుంది. 1984లో రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యానం చేసిన రెండో భారతీయ వ్యోమగామి శుక్లా.

మోదీ, శుక్లా మధ్య సంభాషణ ఇలా..

మోదీ: మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరు మన జాతీయ పతాకాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన క్షణం భారతీయులకు గర్వకారణం. ప్రతి భారతీయుడి ఉద్వేగం, అభిమానం, ఆశలకు ప్రతినిధిగా మీతో మాట్లాడుతున్నాను.

శుక్లా: అంతరిక్షంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. మీతో పాటు 140 కోట్ల మంది భారతీయుల శుభాకాంక్షలకు ధన్యవాదాలు. భూమి నుంచి అంతరిక్షానికి సాగిన 400 కిలోమీటర్ల ప్రయాణం నా ఒక్కడిదే కాదు. యావత్ దేశానిది. నేను వ్యోమగామిని అవుతానని చిన్నప్పుడు ఎప్పుడూ అనుకోలేదు. మీ నాయకత్వంలో దేశం కలలు నెరవేరడానికి ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయి.

మోదీ: మీరెలా ఉన్నారు? అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

శుక్లా: నేను బావున్నాను. నాకిదో కొత్త అనుభవం. ఐఎస్ఎస్‌లో గడిపేందుకు వీలుగా మేం ఏడాది పాటు శిక్షణ పొందాం. కానీ ఇక్కడికి వచ్చాక అంతా మారిపోయినట్లుంది. చిన్నపాటి విషయాలు కూడా పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ నిద్రపోవడం ఒక సవాల్. ఈ వాతావరణానికి అలవాటు పడడానికి కొంత సమయం పడుతుంది.

మోదీ: అక్కడ మీకెలాంటి అనుభూతి కలుగుతోంది?

శుక్లా: భారత్ ఎంతో గొప్పగా చాలా పెద్దగా కనిపించింది. నిజానికి మనం మ్యాప్‌లో చూసేదాని కంటే చాలా చాలా పెద్దగా! ఇక మొదటిసారిగా బయటి నుంచి భూమిని చూసినప్పుడు రాష్ట్రాలు, దేశాలు, ఏ సరిహద్దులు లేవనిపించింది. ఏకత్వ భావన కలిగింది. పైనుంచి చూసినప్పుడు భిన్నత్వంలో ఏకత్వమనే ఆదర్శం ఎంత అర్థవంతమైనదో తెలిసింది.

మోదీ: మీ ప్రయాణ విశేషాలు చెప్పండి!

శుక్లా: కాసేపటి క్రితం... నేను కిటికీ నుంచి బయటకు చూస్తుంటే.. మేం హవాయి మీద నుంచి వెళుతున్నాం. రోజుకు 16 సార్లు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు చూస్తున్నాం. మన దేశం ఎంతో వేగంగా ముందుకువెళుతోంది!

మోదీ: మీతో ఏ భారతీయ వంటకాలను తీసుకెళ్లారు? ఇతర దేశాలకు చెందిన తోటి వ్యోమగాములకు రుచి చూపించారా?

శుక్లా: మన గాజర్ కా హల్వా, మూంగ్ కా దాల్ హల్వా, మామిడిపళ్ల రసం తీసుకొచ్చాను. అందరం కలిసి తిన్నాం. వాళ్లకెంతో నచ్చాయి.

మోదీ: ఇవాళ, మీరు మన మాతృభూమికి దూరంగా ఉండొచ్చు. కానీ భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ పేరులో 'శుభ' ఉంది. మీ యాత్ర కొత్త శకానికి శుభారంభం'. భారత్ చేపట్టే మానవసహిత యాత్ర 'గగన్‌యాన్'కు తొలి అడుగు. మీ తోటి వ్యోమగాములకు కూడా శుభాకాంక్షలు.

శుక్లా: మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు.

ఎప్పుడు రద్దయ్యేది.. ఎప్పుడు వెళ్లేదీ తెలియదు!

» ఎయిర్ ఇండియా సర్వీసులతో ప్రయాణికుల ఇబ్బందులు

పుణె, జూన్ 28: అమెరికాకు చెందిన అనీశ్ అగర్వాల్ తల్లి, తండ్రి.. అనీశ్ సోదరుడు ఈనెల 27న ఎయిర్ ఇండియా విమానం (ఏ1-190)లో టొరంటో నుంచి ఢిల్లీ మీదుగా పుణె రావాల్సి ఉంది. అయితే ఉన్నట్టుండి ఎయిర్ ఇండియా సంస్థ వారి ప్రయాణ తేదీలను మార్చేసింది! ముగ్గురూ వేర్వేరు విమానాల్లో.. వేర్వేరు తేదీల్లో వెళ్లాల్సి ఉంటుందని నిర్దేశించింది. ఆ మేరకు తన సోదరుడు 27న, తండ్రి 28న, తల్లి 30న టొరంటో నుంచి విమానాల్లో భారత్‌కు బయలుదేరాల్సి ఉంటుందంటూ సందేశం వచ్చిందని అనీశ్ పేర్కొన్నారు. దీనిపై తాను ఎయిర్ ఇండియా కస్టమర్ సపోర్టు నంబరుకు ఫోన్ చేసినా ఫలితం లేకపోయిందని.. తనకాల్‌ను నాలుగు గంటలపాటు హోల్డ్‌లో పెట్టి, ఆ తర్వాత కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో అదనంగా మూడు రోజుల పాటు టొరంటో హోటల్ గదుల్లో ఉండిపోయామని చెప్పారు. ఇక పుణె నుంచి ముంబై మీదుగా అమెరికా వెళ్లాల్సిన నలుగురు కుటుంబ సభ్యులకూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఎయిర్ ఇండియా విమానాల్లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు ఇటీవల ఇలాంటి చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. విమానాల నిర్వహణ, ప్రయాణికుల భద్రతకు సంబంధించి తమ అంతర్జాతీయ సర్వీసులను 15శాతం మేర తాత్కాలికంగా కుదించినట్లు సంస్థ పేర్కొంది. దేశీయంగా కొన్ని సర్వీసులనూ తగ్గించినట్లు వెల్లడించింది. ఎయిర్ ఇండియాలో సింగపూర్‌కు వెళ్లిన ఓ ప్రయాణికుడు తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. తాను.. జూన్ 23న సింగపూర్‌కు బయలుదేరాల్సి ఉండగా 12 గంటల ముందు విమానం రద్దయిందని సమాచారం ఇచ్చారని, తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసినా ముందు సర్వీసు కన్నా 8గంటలు నిరీక్షించాల్సి వచ్చిందని చెప్పారు.

'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

» ఆపరేషన్ సిందూర్‌లో ఆయనది కీలక పాత్ర



న్యూఢిల్లీ, జూన్ 28: పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై పక్కాగా నిఘా పెట్టి, ఆపరేషన్ సిందూర్‌తో గట్టి దెబ్బకొట్టడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్.. భారత అంతర్జాతీయ నిఘా సంస్థ 'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)'కు నూతన చీఫ్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం 'రా' కార్యదర్శిగా ఉన్న రవి సిన్హా పదవీ విరమణ చేస్తుండటంతో.. జూలై 1వ తేదీ నుంచి పరాగ్ జైన్ ఆ బాధ్యతలు స్వీకరిస్తారు. రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. భారత్ ధ్వంసం చేసిన ఉగ్ర స్థావరాలను పాకిస్థాన్ మళ్లీ పునరుద్ధరిస్తోందంటూ వార్తలు వస్తున్న వేళ పరాగ్ జైన్ నియామకం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 1989 పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్.. సుమారు 20 ఏళ్లకుపైగా నిఘా, డిటెక్టివ్ విభాగాల్లో పనిచేశారు. 'రా' లో పాకిస్థాన్ డెస్క్, జమ్మూకశ్మీర్ వ్యవహారాల బాధ్యతలు పర్యవేక్షించారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సమయంలోనూ కీలక పాత్ర పోషించారు. లష్కరేతాయిబా ప్రధాన కార్యాలయం సహా పాకిస్థాన్‌లోని కీలక ఉగ్రవాద స్థావరాలపై నిఘా పెట్టి కీలక సమాచారం సేకరించారు. ఈ డేటా ఆధారంగానే మన వైమానిక దళం అత్యంత కచ్చితత్వంతో పౌరులకు ఎలాంటి హానీ జరగకుండా ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయగలిగిందని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

వ్యవసాయ భూముల్లోని వృక్షాల నరికివేత రూల్స్‌లో మార్పు

న్యూఢిల్లీ, జూన్ 28: ఆగ్రోఫారెస్ట్రీ(వ్యవసాయ భూముల్లో వృక్షాల పెంపకం)ని ప్రోత్సహించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ భూముల్లోని వృక్షాల నరికివేతను సులభతరం చేస్తూ నమూనా నిబంధనలు జారీ చేసింది. దీనికి సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ ఈనెల 19న అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు పంపింది. వ్యవసాయ భూముల్లోని వృక్షాలను నరికేందుకు స్పష్టమైన సమన్వీకృత నియమాలు లేకపోవడమే ఆగ్రోఫారెస్ట్రీకి కీలకమైన అవరోధంగా కేంద్రం గుర్తించినట్లు తెలిపింది. కలప ఆధారిత పరిశ్రమలు(ఏర్పాటు, నియంత్రణ) మార్గదర్శకాలు-2016 కింద ఇప్పటికే ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కమిటీ(ఎస్ఎల్‌సీ)లే తాజా నిబంధనలనూ అమలయ్యేలా చూస్తాయి. ఈ కమిటీ వ్యవసాయ భూముల నుంచి కలప రవాణాకు, దరఖాస్తుల పరిశీలనకు ఏజెన్సీలను ఏర్పాటు చేస్తుంది. రైతులు చెట్లు నాటే తమ భూమి వివరాలను ఎన్‌టీఎంఎస్(జాతీయ టింబర్ మేనేజ్‌మెంట్ సిస్టం) పోర్టల్‌లో తప్పక నమోదు చేయాలి. ఆ ప్రదేశం, చెట్లు నాటిన తేదీ, ఆ చెట్ల సగటు ఎత్తు తదితర ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేయాలి. ప్రతి చెట్టును ఫొటో తీసి, జియోట్యాగ్ చేయాలి. తర్వాత చెట్లను నరకాలంటే ఆ చెట్ల ఫొటోలను ఎన్‌టీఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలి. నరికే తేదీని తెలపాలి. ఆ తర్వాత ఆటోమేటిక్‌గా నిరభ్యంతర సర్టిఫికెట్‌ను పోర్టల్‌లో జారీ చేస్తారు.

బిహార్‌లో మొబైల్ ఈ-ఓటింగ్

యాప్ ద్వారా ఓటు వేసే అవకాశం.. దేశంలోనే తొలిసారి ప్రారంభం

» మునిసిపల్ ఎన్నికల్లో అందుబాటులోకి

» వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసమే

» రిజిస్టర్ చేసుకున్న 10వేల మంది



పాట్నా, జూన్ 28: దేశంలో ఓటర్ల సౌకర్యం కోసం ఎన్నికల కమిషన్ ఎన్నో సదుపాయాలు కల్పిస్తోంది. అందులో నూతనంగా తీసుకొచ్చిన మొబైల్ ఈ-ఓటింగ్ ఒకటి. దీనిని దేశంలోనే తొలిసారి బిహార్‌లో ప్రారంభించారు. దీంతో మొబైల్ యాప్ ద్వారా ఓటు వేసే అవకాశం బిహార్ ఓటర్లకు దక్కింది. ఈ పైలట్ ప్రాజెక్టును స్థానిక మునిసిపల్ ఎన్నికల్లో ఆరు కౌన్సిల్స్ పరిధిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మొబైల్ యాప్‌ను వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, వలస కార్మికులతో పాటు పోలింగ్ స్టేషన్‌కు రాలేని విధంగా జబ్బు పడ్డ వ్యక్తుల కోసం అభివృద్ధి చేశారు. ఈ యాప్ ద్వారా ఓటు వేసే ప్రక్రియను పాట్నాలో మూడు, రోహతాస్‌లో రెండు, తూర్పు చంపారన్‌లోని ఓ కౌన్సిల్‌లో ప్రారంభించామని బిహార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ తెలిపారు. పోలింగ్ స్టేషన్‌కు రాకుండానే 50 వేల మంది ఈ ఓటింగ్ యాప్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉందని, అయితే 10 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు.

ఎలా పనిచేస్తుంది..?

+ ట్యాంపర్ చేయడానికి వీలులేని టెక్నాలజీతో అత్యంత రక్షణ ప్రమాణాలతో ఈ మొబైల్ యాప్‌ను రూపొందించారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో రికార్డు అయిన ఓట్లు అత్యంత భద్రతతో, మార్పుచేయడానికి వీల్లేకుండా స్టోర్ అవుతాయి.
+ ఫేస్ రికగ్నిషన్, మ్యాచింగ్ టెక్నాలజీ యాప్ లాగిన్, ఓటింగ్ సమయంలో ఓటర్ల గుర్తింపును ధ్రువీకరిస్తుంది. డిజిటల్ స్కానింగ్, ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్).. ఓట్లను కచ్చితంగా లెక్కించడానికి సహాయ పడుతుంది.
+ ఆడిట్ ట్రెయిల్స్‌తో.. ఈవీఎంలో వీవీప్యాట్ లాగానే ఓట్లను సరిపోల్చే అవకాశం ఉంటుంది.
+ ఒక మొబైల్ నంబర్ నుంచి ఇద్దరు ఓటర్లు మాత్రమే రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఓటర్ ఐడీతో ప్రతి ఓటు నిర్ధారణ చేసుకున్నాకే ఓటు రికార్డు అవుతుంది.

బిహార్‌లో ఇలా మొదలైంది..

మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్, ఓటింగ్ ప్రక్రియ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుందని, మొదటిసారి డిజిటల్ ఓటర్లయినా ఏవిధమైన గందరగోళం లేకుండా ఓటు వేయవచ్చని ఎన్నికల అధికారులు చెప్పారు. ఈ-ఓటు ఎలా వేయాలంటే..

+ మొదట ఈ-ఎస్ఈసీబీహెచ్ఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. (ప్రస్తుతం ఇది ఆండ్రాయిడ్ ఫోన్లలో మాత్రమే అందుబాటులో ఉంది). ఎలక్టోరల్ రోల్‌లో రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్‌తో యాప్‌ను లింక్ చేయాలి. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ద్వారా లేదా ఈ-ఎస్ఈసీబీహెచ్ఆర్ యాప్ ద్వారా ఎలక్షన్ రోజు ఓటు వేయవచ్చు.

ఓటర్ల జాబితా పునఃపరిశీలన

బిహార్‌లో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పునఃపరిశీలించే ప్రత్యేక పక్రియ ప్రారంభమైందని ఎన్నికల కమిషన్ తెలిసింది. కేవలం భారతీయులు మాత్రమే ఓటు వేసేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఓటర్లను తొలిగిస్తున్నారన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో ఈసీ ఈ ప్రకటన జారీ చేసింది. ఈఏడాది బిహార్‌తో మొదలుపెట్టి ఆరు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను ఈసీ చేపట్టింది. పుట్టిన ప్రాంతాన్ని పరిశీలించడం ద్వారా అక్రమంగా వలస వచ్చిన విదేశీయులను జాబితా నుంచి తొలిగించేందుకు కసరత్తు చేస్తోంది.

వివాహేతర సంబంధం పెట్టుకుందని..

» మహిళ జననాంగంలో జీడి పోశారు » ఇద్దరికీ శిరోముండనం » భార్యతో పాటు ఆమె బంధువుల క్రూర చర్య

వరంగల్ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అతడు వివాహితుడు.. భార్య ఇద్దరు పిల్లలున్నారు. ఆమె కూడా వివాహితే.. ఆమెకూ భర్త పిల్లలున్నారు. ఇద్దరివీ వేర్వేరు కుటుంబాలు. ఒకే ఊరు కావడంతో ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. కొన్ని రోజుల క్రితం ఇద్దరూ అదృశ్యమయ్యారు. వీరి తీరు రెండు కుటుంబాల్లో చిచ్చు రేపింది. ఎంత చెప్పినా తీరు మారడం లేదనే కోపంతో వివాహితుడి భార్య, బంధువులు ఇద్దరినీ పట్టుకొని చితకబాదారు. సదరు మహిళను వివస్త్రను చేసి ఆమె జననాంగంలో జీడి పోశారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో జరిగింది. వారం క్రితం జరిగిన ఈ హేయమైన ఘటన సోషల్ మీడియా పుణ్యమా అని వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళ్లితే.. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన గంగతో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బొల్లోనిపల్లికి చెందిన చిక్కుడు రాజుకు 20 ఏళ్ల కింద వివాహం జరిగింది. వీరికి 18 ఏళ్ల బాబు, 15 ఏళ్ల పాప ఉన్నారు. ఆరేళ్ల క్రితం రాజు తమ సమీప బంధువైన వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకు కూడా భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. అనేకసార్లు పంచాయితీలు నిర్వహించారు. ఇంకోసారి కలుసుకోమని రాసిచ్చారు. కానీ తీరు మార్చుకోక యథావిధిగా సంబంధం కొనసాగిస్తున్నారు. దీంతో విసిగివేసారిన రాజు భార్య గంగ ఈ నెల 13న నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇరు కుటుంబాలు మాట్లాడుకోవాలని చెప్పగా పంచాయితీకి మరో తేదీని ఖరారు చేసుకున్నారు. ఈ లోపే రాజు, అతడి ప్రియురాలు ఎవరికీ తెలియకుండా వెళ్లిపోయారు. దీంతో గంగ తాటికాయలకు వచ్చి తోబుట్టువులు, బంధువులకు ఆవేదన చెప్పుకుంది. రాజుతో పాటు అతడి ప్రియురాలిని వెతికి ఈ నెల 22న తాటికాయల గ్రామానికి తీసుకొచ్చారు. సదరు మహిళను తాళ్లతో కట్టేసి చితకబాదారు. ఈ క్రమంలో రాజు భార్య గంగ.. సదరు వివాహితను వివస్త్రను చేసి ఇంకోసారి తన భర్తతో శారీరకంగా కలవొద్దని యోనిలో జీడి (సైన్స్‌లో శాస్త్రీయ నామం సెమికార్పస్ అనకార్డియమ్-ఇది మొక్కకు కాసే కాయ. ఇది విషపూరితమైనది) కరగదీసి దాని రసం పోసింది. భర్తను సైతం బంధువుల సహాయంతో చితకబాది ఇద్దరికీ గుండు చేయించింది. 'మరోసారి రాజును కలువను వదిలిపెట్టండి..' అని సదరు వివాహిత బతిమిలాడింది. దీంతో ఆమెను రాత్రి వదిలిపెట్టగా, రాజు తెల్లవారు జామున వెళ్లిపోయినట్లుగా తెలుస్తోంది. కాగా, వారం రోజుల కింద జరిగిన ఈ ఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో స్పందించిన పోలీసులు దాడికి పాల్పడిన రాజు భార్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులను కస్టడీకి తీసుకొని విచారిస్తున్నారు. దాడికి గురైన జంట అజ్ఞాతంలోకి వెళ్లడంతో వారి కోసం పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. ప్రస్తుతానికి సోషల్ మీడియా వీడియోల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.



మహిళను కట్టేసిన దృశ్యం

వైద్య కళాశాలల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

» నోటిఫికేషన్ విడుదల చేసిన రిక్రూట్‌మెంట్ బోర్డు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. తగిన అర్హతలు ఉన్న అభ్యర్థులు జూలై 10 నుంచి 17వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు వైద్య విద్యలో పీజీ లేదా సూపర్ స్పెషాలిటీ కోర్సు చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేవారు ఎక్స్‌పీరియెన్స్ సర్టిఫికెట్ జత చేయాలి. ఎంపికైనవారు ప్రైవేటు ప్రాక్టీస్ చేయడానికి వీల్లేదు. అభ్యర్థులకు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 ఏళ్లకు మించి వయసు ఉండకూడదు. మరోవైపు మెడికల్ కాలేజీలకు ప్రభుత్వం కొత్తగా 715 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను మంజూరు చేసింది. దీనికి ఆర్థికశాఖ అనుమతులు ఇచ్చింది. ఆ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష ఉండదు. పీజీ మార్కులు, వెయిటేజీ మార్కుల ఆధారంగా పాయింట్స్ కేటాయిస్తారు. వివరాలను www.mhsrb.telangana.gov.inలో తెలుసుకోవచ్చని బోర్డు పేర్కొంది.

భర్తీ చేసే పోస్టులు ఇవే..

34 వైద్య విద్య కళాశాలల్లో మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మల్టీజోన్-1లో 379 పోస్టులు, మల్టీజోన్-2లో 228 పోస్టులున్నాయి. గైనకాలజీ విభాగంలో అత్యధికంగా 90 పోస్టులుండగా.. జనరల్ మెడిసిన్ 47, జనరల్ సర్జరీ 43, అనస్థీషియా 44, పీడియాట్రిక్స్‌లో 28, రేడియో డయాగ్నసిస్ 21, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ 21, ఫార్మకాలజీ 28, ఫోరెన్సిక్ మెడిసిన్ 21, కమ్యూనిటీ మెడిసిన్ 25, బయోకెమిస్ట్రీ 18, ఫిజియాలజీ 29, అనాటమీ 22, మైక్రోబయాలజీ 15, పాథాలజీ 15, ఎమర్జెన్సీ మెడిసిన్ 15, సీటీ సర్జరీ 14, ఆర్థోపెడిక్స్ 12 పోస్టులతోపాటు మరికొన్ని విభాగాల్లోనూ భర్తీ చేయనున్నారు.

వైద్య విద్య అధ్యాపకులకు పదోన్నతులు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) వైద్యవిద్య సంచాలకుల పరిధిలో 44 మంది అధ్యాపకులకు అదనపు వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ)గా పదోన్నతులు కల్పించినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అలాగే 308 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో ఉన్న వారిలో అర్హత కలిగిన 231 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించినట్లు పేర్కొంది. తొలుత అడిషనల్ డీఎంఈలకు రెండ్రోజుల్లో పోస్టింగ్స్ ఇవ్వనున్నారు. వారిలాగే అసోసియేట్ ప్రొఫెసర్లకు కూడా పోస్టింగ్ విషయంలో వెబ్ ఆప్షన్లు ఇవ్వనున్నట్లు వైద్యవర్గాలు పేర్కొన్నాయి.

రేవంత్‌ది జాబ్‌లెస్ క్యాలెండర్

» 12 వేలకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదు: హరీశ్‌రావు



హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. 20 నెలల్లో 12 వేలకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం.. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఊరించారని.. అది జాబ్ క్యాలెండర్ కాదని.. జాబ్‌లెస్ క్యాలెండర్, దగా క్యాలెండర్ అని మండిపడ్డారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీ నిరుద్యోగులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు శనివారం హరీశ్‌ను కలిశారు. తాము చేపట్టనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. నిరుద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

మంత్రి అడ్లూరికి తప్పిన పెను ప్రమాదం

» మంత్రి కారును ఢీకొన్న మరో వాహనం

మెట్‌పల్లి రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు శనివారం జగిత్యాల జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. జగిత్యాల జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి ప్రయాణిస్తున్న కారును మెట్‌పల్లి మండలం మారుతీనగర్ గ్రామ శివారులో స్క్రాప్ కారును తరలిస్తున్న టోయింగ్ వాహనం ఢీకొట్టడంతో కారు టైర్ ఊడిపోయింది. వెంటనే మంత్రి అడ్లూరి కారు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. మంత్రి మెట్‌పల్లిలో తన పర్యటనను ముగించుకొని ధర్మపురికి ల్యాండ్ క్రూజర్ వాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కమ్మరిపల్లికి చెందిన వ్యక్తి కోరుట్లలో కొనుగోలు చేసిన స్క్రాప్ వాహనాన్ని టోయింగ్ వాహనం సహాయంతో మెట్‌పల్లికి తరలిస్తుండగా మారుతీనగర్ గ్రామ శివారులో మంత్రి కారును ఎదురుగా ఢీకొట్టింది. దీంతో మంత్రి ప్రయాణిస్తున్న కారు ముందు టైరు ఊడిపోయింది. మంత్రి వేరే కారులో ధర్మపురికి బయలుదేరి వెళ్లిపోయారు. సంవత్సరం క్రితం విప్ హోదాలో ఉన్నప్పుడు జరిగిన కారు ప్రమాదంలోనూ స్వల్ప గాయాలతో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బయటపడ్డారు.

మహా టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్వీ దాడి

» కేటీఆర్‌పై ప్రసారమైన కథనానికి నిరసన

» ఫర్నిచర్, కార్లపై రాళ్లు, ఓ ఉద్యోగికి గాయాలు



బీఆర్ఎస్వీ దాడిలో ధ్వంసమైన కార్లు

బంజారాహిల్స్, హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, ఫిలింనగర్‌లో ఉన్న మహా టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్వీ కార్యకర్తలు శనివారం దాడి చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై ప్రసారం చేసిన కథనానికి నిరసనగా రాళ్లు, కర్రలతో దాడి చేశారు. సుమారు 20 మంది కార్యకర్తలు కార్యాలయంలోని సామగ్రి, బయట ఉన్న కార్లు ధ్వంసం చేశారు. దాడిలో ఓ ఉద్యోగికి గాయాలయ్యాయి. దాడి సంగతి తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం తదితరులు ఆ కార్యాలయాన్ని సందర్శించి దాడిని ఖండించారు. మహాటీవీ ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్వీ నేత గెల్లు శ్రీనివాస్‌తోపాటు ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, కేసీఆర్‌పై తప్పుడు వార్తలు ప్రసారం చేశారని పేర్కొంటూ మహా టీవీకి బీఆర్ఎస్ లీగల్ నోటీసులు పంపింది. మహా టీవీ విధానం మార్చుకోకపోతే పరువు నష్టం దావా, క్రిమినల్ డెఫమేషన్ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

మహబూబ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. ప్రాజెక్టుల నిర్వహణను తుంగలో తొక్కింది. ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం మంచి ప్రాజెక్టు (జూరాల) కూలిపోవాలని భావిస్తోంది" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో శనివారం పర్యటించిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ముందుగా ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలను పరిశీలించారు. ఆ తర్వాత జూరాల వద్ద రోప్‌లు, గ్యాంటీ క్రేన్ పరిస్థితిని పరిశీలించి గద్వాల కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. జూరాల ప్రాజెక్టు అధికారులు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే గేట్ల రోప్‌లు తెగిపోయే ప్రమాదం ఉందని, గ్యాంటీ క్రేన్, ఇతర మరమ్మతులపై నిధుల కోసం నివేదిక అందించారని, కానీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత సమస్యకు గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తాము కొత్త రోప్‌లు వేయిస్తున్నామని, రూ.3.5కోట్లతో కొత్తగా మరో గ్యాంటీ క్రేన్‌ను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. గత ప్రభుత్వంలో ఎస్ఆర్ఎస్పీ నుంచి నాగార్జునసాగర్ వరకు అన్ని ప్రాజెక్టులు 20 నుంచి 25% నీటి సామర్థ్యాన్ని కోల్పోయాయని, పూడిక పేరుకుపోవడం వల్ల ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టుల్లో పూడిక తీసి నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. అన్ని ప్రాజెక్టుల నిర్వహణ కోసం నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తామని చెప్పారు. ర్యాలంపాడు రిజర్వాయర్ నీటి లీకేజీలను అరికట్టేందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని, నివేదిక అందిన వెంటనే పనులు ప్రారంభించి ప్రస్తుతం 2 టీఎంసీల నీటి నిల్వను 4 టీఎంసీలకు పెంచుతామని తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా అంచనాలను రూ.2753 కోట్లకు పెంచామని, డిసెంబరు నాటికి పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలోని మల్లమ్మకుంట రిజర్వాయర్, మక్తల్, అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో భూసేకరణను త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. రామన్‌పాడు రిజర్వాయర్ గేట్ల మరమ్మతులను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు రాజకీయ కారణాలతో జూరాల ప్రాజెక్టు భద్రతపై ప్రజలు, రైతుల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నిర్మించిన జూరాల 2009లో 12 లక్షల క్యూసెక్కుల వరద వస్తే తట్టుకొని నిలబడిందని, ఇప్పుడు కూలిపోయే ప్రసక్తే లేదన్నారు. భీమా నది నుంచి ముందస్తుగా వరద రావడం వల్ల గేట్ల మరమ్మతులు ఆలస్యమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఏ ప్రాజెక్టు కూడా కూలిపోదని, కానీ బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కుంగిపోయిందన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. జూరాలలో పూడికతీతకు నిధులు మంజూరు చేయాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్; చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి

జూరాల దిగువన రూ.100 కోట్లతో వంతెన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్/మహబూబ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు రక్షణలో భాగంగా ఆ ప్రాజెక్టుపై నుంచి భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యేకంగా వంతెన నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'జూరాల భద్రత ప్రశ్నార్థకం' అనే శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్(ఎస్‌డీఎస్‌వో) మూడేళ్ల కిందట జూరాల రక్షణ నేపథ్యంలో ప్రాజెక్టుపై నుంచి వాహనాల రాకపోకలు నియంత్రించాలని ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం విదితమే. ఎస్‌డీఎస్‌వో నివేదికను అనుసరించి రూ.100 కోట్లతో జూరాల ప్రాజెక్టు దిగువన ప్రత్యేక వంతెనను నిర్మించనున్నారు. దీనికి పరిపాలనపరమైన అనుమతినిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఈ వంతెనను రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో కట్టనున్నారు.

1న గోదావరి-బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానంపై శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులకు జూలై 1వ తేదీన ప్రజాభవన్‌లో అవగాహన కార్యక్రమం జరగనుంది. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే నష్టం గురించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నారు. ఈ ప్రాజెక్టుకు 2016లో తొలి అపెక్స్‌కౌన్సిల్ సమావేశంలో బీజం పడిందని, ఆ తర్వాత 2018లో 'గోదావరి-పెన్నార్' పథకం పేరుతో ప్రతిపాదించారని వివరించనున్నారు. ఆ తర్వాత 2018 ఏపీ శాసనసభలో గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలోనూ ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని గుర్తు చేయనున్నారు. 2019లో ఈ పథకాన్ని పల్నాడు మిటిగేషన్ ప్లాన్ కింద నామకరణం చేసి, మూడు ప్యాకేజీలకు టెండర్లు కూడా పిలిచారని గుర్తు చేస్తూ.. ఆ జీవోలను చూపించనున్నారు. గోదావరిలో ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటి వినియోగానికి తెలుగు రాష్ట్రాలు ప్రయత్నించాలని అప్పటి సీఎం కేసీఆర్ ప్రతిపాదించిన విషయాన్ని అపెక్స్ కౌన్సిల్ మినిట్స్ ద్వారా వివరించనున్నారు.

స్వేచ్ఛ ఆత్మహత్యకు పూర్ణచందరే కారణం!

» పోలీసులకు స్వేచ్ఛ తండ్రి శంకర్ ఫిర్యాదు.. అతణ్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్

» లొంగిపోయిన పూర్ణచందర్

చిక్కడపల్లి/ముషీరాబాద్/అడ్డగుట్ట/నల్లకుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ ఆత్మహత్యకు పూర్ణచందర్‌రావే కారణమని.. అతణ్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ మృతురాలి తండ్రి శంకర్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ చానల్‌లో న్యూస్ యాంకర్‌గా పనిచేసే స్వేచ్ఛ శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, శంకర్ కథనం ప్రకారం 2017లో భర్తతో విడిపోయిన స్వేచ్ఛ కొంతకాలంగా పూర్ణచందర్‌తో ఉంటున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య విభేదాలు మొదలైనట్లు శంకర్ తెలిపారు. "ఈ నెల 26న స్వేచ్ఛ నాకు ఫోన్ చేసి తాను పూర్ణచందర్ విడిపోతున్నట్లు తెలిపింది. నన్ను వెంటనే ఇంటికి రావాలని కోరింది. ఇక పై పూర్ణచందర్‌తో కలిసి ఉండలేనని స్పష్టం చేసింది" అని ఆయన చెప్పారు. పూర్ణచందర్ గతంలో స్వేచ్ఛ పనిచేసే టీవీ చానల్‌లో సాంస్కృతిక కార్యక్రమాల ఇన్‌చార్జిగా పనిచేశారని, ఆ సమయంలోనే స్వేచ్ఛకు పరిచయమైనట్లు చెప్పారు. "పూర్ణచందర్ దుర్మార్గుడు. ఆడపిల్లల జీవి తాలను నాశనం చేస్తున్న అతన్ని కఠినంగా శిక్షించాలి" అని డిమాండ్ చేశారు. కాగా..శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామ చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు. అటు శనివారం రాత్రి పోలీసులకు లొంగిపోయిన పూర్ణచందర్.. అంతకు ముందు మీడియాకు ఓ లేఖను విడుదల చేశారు. చిన్నతనం నుంచి స్వేచ్ఛ ఒంటరితనాన్ని అనుభవించారని, తల్లిదండ్రులతో కలిసి ఉన్నా ఒంటరిగానే భావించేదని, ఆమె ఒత్తిడి నుంచి బయటపడేందుకు తాను అండగా నిలిచానన్నారు. కాగా స్వేచ్ఛ మృతదేహానికి గాంధీ ఆస్పత్రి మార్చురీ వద్ద టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, స్వేచ్ఛ మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చాక ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, వేముల వీరేశం, కాలేరు వెంకటేశ్, మందుల సామేలు, మాజీ మంత్రులు తలసాని, శ్రీనివాస్ గౌడ్, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లంనారాయణ, సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

మా కుమారుడి ప్రాణాలు కాపాడండి

» దాతలకు తల్లిదండ్రుల విజ్ఞప్తి

» స్పైనల్ మస్కులర్ అట్రోపీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వేద్

హైదరాబాద్ సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్పైనల్ మస్కులర్ అట్రోపీ (ఎస్ఎంఏ) టైప్2 అనే అరుదైన జన్యువాధితో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి చేయూతనివ్వాలని చిన్నారి తల్లిదండ్రులు దాతలకు విజ్ఞప్తి చేస్తున్నారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లికి చెందిన భార్యభర్తలు సత్యవేద, సాయిరాంల కుమారుడు వేద్ (10 నెలలు) ఏడో నెలలో ఎస్ఎంఏ టైప్2 వ్యాధి బారిన పడ్డాడు. బాలుడికి ఒక డోసు ఔషధంతో 'జోల్జెన్స్మా' అనే జన్యు చికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. ఆ ఔషధం ఖరీదు దాదాపు 9కోట్ల వరకు ఉంటుందని చెప్పడంతో ఇంపాక్ట్ క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులను సమీకరిస్తున్నట్లు బాలుడి తల్లిదండ్రులు వివరించారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాల్సిందిగా కోరుతున్నారు. సత్యవేద జొన్నడ, బ్యాంకు అకౌంట్ నంబర్ 50100820441712, ఐఎఫ్ఎస్ఈ కోడ్-హెచ్‌డీఎఫ్‌సీ 0009698 నంబర్‌లో దాతలు విరాళాలు జమ చేయాల్సిందిగా సత్యవేద, సాయిరాం కోరుతున్నారు. వివరాలకు 9866228299, 9490969055 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ఇక బీఆర్ఎస్ నేతలకు సిట్ నోటీసులు

» ట్యాపింగ్ బాధితుల్లో బీఆర్ఎస్ నేతలు

» ఎమ్మెల్సీ కవిత పీఏకు సిట్ నోటీసులంటూ ప్రచారం

» నిర్ధారించని సిట్ అధికారులు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులుగా ఉన్న బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇచ్చేందుకు సిట్ సన్నద్ధమైనట్లు సమాచారం. ఇప్పటి వరకు బాధితులుగా ఉన్న 200 మందికి పైగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మీడియా ప్రతినిధుల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. బాధితులుగా ఉన్న బీఆర్ఎస్ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల వాంగ్మూలాలను త్వరలో నమోదు చేయనున్నట్లు తెలిసింది. సిట్ ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యాధారాల్లో భాగంగా.. మావోయిస్టుల సానుభూతిపరుల పేరుతో 615 మంది ఫోన్లను ట్యాప్ చేయడం ద్వారా అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం, ఐటీ చట్టాన్ని ఉల్లంఘించారని నిర్ధారించింది. బాధితుల వాంగ్మూలాలతో ప్రభాకర్‌రావు పాత్రపై బలమైన ఆధారాలను సేకరించనున్నట్లు తెలుస్తోంది. న్యాయస్థానాల్లో ఈ కేసు నిలబడి, అక్రమంగా ట్యాపింగ్ చేసిన తీరులో శిక్షలు పడేలా చేసే దిశలో సిట్ వేగంగా అడుగులు వేస్తోంది. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో నిందితులు మకాం వేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనడానికి నిందితుల సెల్ టవర్ లోకేషన్లు కీలకంగా మారుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సిట్.. కొత్తగా సేకరించిన ఆధారాలతో త్వరలో అనుబంధ చార్జ్‌షీట్ వేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.నవీన్‌రావును సిట్ విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రైవేటు వ్యక్తి అయిన మీడియా చానల్ అధినేత శ్రవణ్‌రావును ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో లాగడం వెనుక నవీన్‌రావు పాత్ర ఉన్నట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. శ్రవణ్‌రావు, ఈ కేసులో అరెస్టు అయిన పోలీసు అధికారులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, నవీన్‌రావులకు సంబంధించిన సెల్ టవర్ లోకేషన్ల(నేరం జరిగిన సమయంలో)ను సిట్ ఇప్పటికే సేకరించింది. వీరంతా చాలా సార్లు కలుసుకున్నారన్న విషయాలను సాంకేతికంగా నిర్ధారించుకున్న తర్వాతే నవీన్‌రావును విచారించాలని సిట్ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. నవీన్‌రావు ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన హైదరాబాద్ వచ్చిన తర్వాత సిట్ అధికారులు విచారించవచ్చని తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్సీ కవిత పీఏకు సిట్ నోటీసులు జారీ చేసిందని ప్రచారం జరుగుతోంది. దీన్ని సిట్ ఉన్నతాధికారులు నిర్ధారించలేదు. కవిత సన్నిహితులు సైతం సిట్ నుంచి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎలాంటి నోటీసులు రాలేదని చెబుతున్నారు.

నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు: షర్మిల

అమరావతి: తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేసిందని, ఈ నిజాన్ని చెబితే చంపేస్తారా అని బీఆర్ఎస్ నేతలను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎవరి ఫోన్లనైనా ట్యాప్ చేస్తారా? అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. తీగ లాగుతుంటే డొంక కదులుతుందన్నట్లుగా విచారణలో నిజాలన్నీ బయట పడుతుంటే ఫోన్‌ట్యాపింగ్ నిందితులకు భయం పట్టుకుందన్నారు. ఈ అంశంపై ప్రసారం చేస్తున్న మీడియాసంస్థపై దాడి చేయడం.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెడికల్ సీట్లలో అక్రమాలు!

» అర్హులకు దక్కని 400 ఎంబీబీఎస్ సీట్లు

» 2 కాలేజీలను డీమ్డ్ వర్సిటీలుగా మార్చడంలో చీకటి కోణం.. లోకాయుక్తలో ఫిర్యాదు

హనుమకొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ గత వైస్‌చాన్స్‌లర్‌తోపాటు రిజిస్ట్రార్ తీరు మూలంగా 400 మంది వైద్య విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై విచారణ జరపాలని కోరుతూ వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ లోకాయుక్తలో గురువారం ఫిర్యాదు చేశారు. ప్రైవేటు మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు తప్పనిసరి అని, అయితే అవేమీలేకున్నా 400ఎంబీబీఎస్ సీట్లు గల రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడం, ఈక్రమంలో గతేడాది 400 మెడికల్ సీట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి దాటిపోవడంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబరులో రెండు మల్లారెడ్డి మెడికల్ కాలేజీలకు ఇచ్చిన డీమ్డ్ యూనివర్సిటీ హోదాను రద్దు చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు ఫిర్యాదుచేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వీసీ, రిజిస్ట్రార్‌లు డీమ్డ్ యూనివర్సిటీ సమాచారాన్ని ఏడు నెలల పాటు గోప్యంగా ఉంచడం, అర్హులైన మెడికల్ విద్యార్థులు సీట్లు కోల్పోవడానికి కారణాలపై విచారణ జరపాలని లోకాయుక్తను కోరారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలు, కన్వీనర్, మేనేజ్‌మెంట్ సీట్ల సమాచారాన్ని వెబ్ ఆప్షన్స్ తేదీకి కావలసినంత ముందుగా విద్యార్థులకు తెలపాల్సి ఉండగా.. గోప్యత పాటించారని ఆరోపించారు. మెరిట్ విద్యార్థులు ప్రవేశాల దరఖాస్తు ఫీజు చెల్లించిన తర్వాత 52 రోజులకు గతేడాది సెప్టెంబరు 27న వెబ్‌ఆప్షన్ ప్రారంభానికి ఒక రోజు ముందు సీట్ల వివరాలను సైట్‌లో ఉంచారని, దీని వెనుక అతిపెద్ద మోసం దాగి ఉందన్నారు. అలాగే గత వీసీతో పాటు రిజిస్ట్రార్ వెబ్‌ఆప్షన్‌లో మూడు కాలేజీలైన మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్ (200 సీట్లు), మల్లారెడ్డి మెడికల్ కాలేజీ ఫర్ ఉమెన్ (200 సీట్లు), నీలిమా మెడికల్ కాలేజీ, మేడ్చల్ (150 సీట్లు) మొత్తం 550సీట్లు తగ్గిస్తూ వెబ్‌ఆప్షన్‌లో సమాచారాన్ని పొందుపరిచారన్నారు. మల్లారెడ్డి మెడికల్ కాలేజీలు డీమ్డ్ వర్సిటీలుగా మారడానికి వాటి యాజమాన్యాలు 2023 నవంబరు23న కాళోజీ హెల్త్ వర్సిటీకి దరఖాస్తు చేసుకోగా ఆ విషయాన్ని గత వీసీ 2024 మే 9న ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ వెంటనే స్పందిస్తూ డీమ్డ్ యూనివర్సిటీలుగా మార్చడంపై అభ్యంతరాలు కోరినట్టు తెలిపారు. అనంతరం గతేడాది మే18న యూజీసీ సమావేశమైందని, మల్లారెడ్డి రెండు కాలేజీల(400సీట్లు)ను డీమ్డ్ వర్సిటీలుగా సెప్టెంబరు 6న ప్రకటించినట్టు తమఫిర్యాదులో వివరించారు. దీంతో 400 సీట్లు ప్రభుత్వ అజమాయిషీ నుంచి వెళ్లిపోయాయని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.